RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



26 ఏప్రిల్ 2025 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:279

# ఎన్.డి.ఎస్.ఏ నివేదికతో బి.ఆర్.ఎస్ పార్టీ సిగ్గుపడాలి

అధిక వడ్డీలతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారు

లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కుప్పకూలి పోయింది

మెడిగడ్డ,అన్నారం,సుందిళ్ళ ఎందుకూ పనికి రాకుండా పోయాయి

అయినా ప్రజలను బి.ఆర్.ఎస్ తప్పుదోవ పట్టిస్తోంది

ఆ పార్టీ తెలంగాణా రైతాంగానికి బహిరంగ క్షమాపణ చెప్పాలి

కాళేశ్వరం బి.ఆర్.ఎస్ సొంత జాగీర్ కాదు

ప్రజాధనంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

-మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై జాతీయ ప్రాజెక్టుల భద్రతా సంస్థ(%చీణూా%)ఇచ్చిన నివేదికను చూసి బి.ఆర్.ఎస్ పార్టీ నేతలు సిగ్గు పడాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

బి.ఆర్.ఎస్ పాలనలో కట్టిన ఈ ప్రాజెక్టు వారి పాలనలోనే కుప్ప కూలిపోయిందని ఆయన మండిపడ్డారు.

మెడిగడ్డ, అన్నారం,సుందిళ్ళ బ్యారేజీ లు ఎందుకూ పనికి రాకుండా పోయినా ఆ నిర్మాణాలు తమ గొప్పతనమని బి.ఆర్.ఎస్ నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై జాతీయ ప్రాజెక్టుల భద్రతా సంస్థ(%చీణూా%)ఇచ్చిన నివేదిక పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా స్పందించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి బి.ఆర్.ఎస్ ప్రభుత్వం అధిక వడ్డీలతో లక్ష కోట్లు ఋణం తీసుకొచ్చి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని ఆయన దుయ్యబట్టారు



ఇంత జరిగాక కుడా బి.ఆర్.ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్ బి.ఆర్.ఎస్ సొంత జాగీర్ కాదని,ప్రజాధనంతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడితే చూస్తూ సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

ఎన్.డి.ఎస్.ఏ ఇచ్చిన నివేదిక పై సమగ్రమైన అధ్యయనం చేసిన మీదట తదుపరి చర్యలకై మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

బి.ఆర్.ఎస్ పాలనలో నిర్మితమైన ఈ ప్రాజెక్టు రైతుల కోసం నిర్మించింది ఎంత మాత్రం కాదని నాటి అధికార పార్టీ నేతలు జేబులు నింపు కోవడానికే దీనిని వినియోగించుకున్నారని ఆయన ఎద్దేవాచేశారు ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలను గుర్తించి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటూమన్నారు.ఈ అంశంలో ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని బాద్యులైన వారికి శిక్షలు తప్పవని ఆయన పేర్కొన్నారు.ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన రూపకల్పన,నిర్వహణా లోపాలు బయట పడినందున బి.ఆర్.ఎస్ నేతలు తెలంగాణా రైతాంగానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.మెడిగడ్డ, సుందిళ్ళ,అన్నారం బ్యారెజ్ లు నిరుపయోగంగా మారినా రాష్ట్రంలో దాన్యం దిగుబడి రికార్డు సృష్టింసుంది అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగం విషయంలో అనుసరించిన విధానాలు మాత్రమె దోహద పడ్డాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# రాజకీయాలకు అతీతంగా

## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉంది రేవంత్ రెడ్డి



కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం సానుభూతి తెలుపుతోంది.

ఆ కుటుంబాలకు అందరం అండగా నిలబడి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుతున్నాం.

1967, 1971 లో ఇలాంటి దాడులు జరిగినపుడు ఇందిరాగాంధీ గట్టి జవాబు ఇచ్చారు ఒక్క దెబ్బతో పాకిస్తాన్ ను పాకిస్తాన్, బంగ్లాదేశ్ అని రెండు ముక్కలు చేశారు

ఆ సందర్భంలో ఇందిరాగాంధీని వాజ్ పేయ్ దుర్గామాతతో పోల్చారు

ప్రధాని మోడీ గారు మీరు దుర్గామాత భక్తులుగా ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోండి

ఉగ్రమూకలకు గట్టి జవాబు ఇవ్వాలి

కోట్లాదిభారతీయులంతా మీకు మద్దతుగా ఉంటారు%శా% ఒక్క దెబ్బతో పాకిస్థాన్ ను రెండు ముక్కలు చేయండి

పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను భారత్ లో కలపండి

కాశ్మీర్ లో ఉగ్రవాదులు పర్యాటకులను



**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**పీపుల్స్ ప్లాజా నుంచి ప్రారంభమైన కొవ్వొత్తుల ప్రదర్శన ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్ లు

ర్యాలీకి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు.

జమ్మూ కశ్మీర్ పహల్గామ్ లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి ఆత్మశాంతి కలగాలని ప్రార్థిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన

ఇందిరా గాంధీ విగ్రహం వరకు కొనసాగనున్న కొవ్వొత్తుల ప్రదర్శన ర్యాలీ.

ఇందిరా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్న కొవ్వొత్తుల ప్రదర్శన ర్యాలీ

జమ్ము కశ్మీర్ పహల్గామ్ లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తదితరులు..

ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మాట్లాడుతు పహల్గామ్ భారతీయ పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడులను ఖండిస్తున్నాం

ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి

రాజకీయాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉంది

ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం చేపట్టే ప్రతీ చర్యకు మద్దతు పలికేందుకు అందరం సిద్ధంగా ఉన్నాం

అందరం ఏకమై తీవ్రవాదాన్ని అంతమొందించి దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలి

దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నాం

ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారి హతమార్చిన సంఘటనపై మృతులకు సంతాపం ప్రకటిస్తూ ఈ రోజు జరిగిన కొవ్వుతుల ప్రదర్శనలో కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ కుర్షిద్, అజారుద్దీన్, జగ్గారెడ్డి, వి.హనుమంతరావు, ఎంపీ లు అనిల్ యాదవ్, మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్ లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాతంగా ముగిసిన హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు

. :హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఏ.ఐ.ఎం.ఐ.ఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, ఏప్రిల్ 25: హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాతంగా ముగిసిందని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్ లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ఉదయం 10 గంటల లోపు ముగిసింది. ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు పారదర్శకంగా, ఎన్నికల నియమావళికి అనుగుణంగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.

ఈ ఎన్నికల్లో 88 ఓట్లు పోల్ కాగా అందులో 63 ఓట్లు ఏ.ఐ.ఎం.ఐ.ఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫ్ఫెండీ, 25 ఓట్లు బిజెపిఅభ్యర్థి డా.ఎన్.గౌత్ రావుకు పోలయ్యాయని తెలిపారు . గలుపొందిన అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి డిక్లరేషన్ సర్టిఫికెట్ ను అందజేశారు.

ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, పోలింగ్, కౌంటింగ్ నిర్వహణలో ఏవిధమైన సమస్యలు తలెత్తకుండా ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన ఎన్నికల విభాగపు అధికారులు, సిబ్బంది, ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి, పోలిస్ యంత్రాంగం, మీడియా ప్రతినిధులకు రిటర్నింగ్ అధికారి కృతజ్ఞతలు తెలిపారు.

భూ భారతితో రైతుల భూములకు పూర్తి రక్షణ

వార్తా 2 లో

# ఉగ్రవాదంపై పోరులో కేంద్రానికి అండగా ఉంటాం

ఏ నిర్ణయం తీసుకున్నా ఏపీ ప్రభుత్వం, ప్రజలు మీ వెంటే..

ప్రధాని నరేంద్రమోదీని కలిసి సంఘీభావం తెలిపిన సీఎం చంద్రబాబు

రాజధాని నిర్మాణం పనుల పున:ప్రారంభానికి ప్రధానికి ఆహ్వానం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 : ఉగ్రవాదంపై పోరాటంలో కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ప్రభుత్వం అండగా నిలుస్తారని, ఉగ్రవాదులకు సరైన సమాధానం చెప్పేలా కేంద్రం తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా కట్టుబడి ఉంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్ర మోదీతో అన్నారు. పహల్గామ్‌లో జరిగిన భయంకరమైన ఉగ్రదాడి తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని చెప్పారు. శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈమేరకు తన సంఘీభావాన్ని తెలిపారు. ఉగ్రవాదులది పిరికిపంద చర్య అని, హింసను ఖండిస్తున్నామని ఈ సందర్భంగా అన్నారు.



పహల్గామ్ బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తామని తెలిపారు. భారతదేశ భద్రతను కాపాడే విషయంలో మోదీ నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు.

రాజధాని అభివృద్ధి పనులు వివరించిన సీఎం :

మే 2న చేపట్టే రాజధాని పనుల పున:ప్రారంభానికి ప్రధాని నరేంద్రమోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు. అమరావతిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానికి వివరించారు. దీనిపై స్పందించిన ప్రధాని, రాజధాని నిర్మాణానికి సంబంధించి పలు సూచనలు చేశారు. అమరావతిలో పచ్చదనం పెంచేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని..., ఇందుకోసం మియావాకి విధానాన్ని అమలు చేయాలని సూచించారు. పనులు పున:ప్రారంభించే కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రధానమంత్రి అంగీకారం తెలిపారు. మరోవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పురోగతిని, ఆర్ఐఎన్ఎల్ గురించి ప్రధానికి సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్రం ఆమోదం తెలిపినందుకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీపీసి, ఆర్సెలర్ మిటల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్‌కు మద్దతు, అలాగే బీపీసీఎల్ రిఫైనరీ మంజూరు విషయంలోనూ ప్రధానికి ధన్యవాదాలు చెప్పారు. ఆరామ్‌కో భాగస్వామ్యాన్ని ఖరారు చేయడంతో అదనపు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈసారి రాష్ట్ర పర్యటనలో శ్రీశైలం కూడా సందర్శించాలని నరేంద్రమోదీని చంద్రబాబు కోరారు.

ప్రజాబలం

26 ఏప్రిల్ 2025 శనివారం

# అసలైన సంపద మేధో సంపత్తి

"మానవాళి ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు ఒకే విధమైన పరిష్కారం అసాధ్యమని, ప్రతి సమస్య పరిష్కారంలో సృజనశీల ఆలోచనలు జోడిస్తే సరళ మార్గాలు ఆవిష్కరించబడి ఉత్తమ ఫలితాలు సుసాధ్యమని" ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ తెలపడం మేధావి వర్గం గుర్తుచేసుకోవాలి. ఈ దిశగా మేధో సంపత్తిని గుర్తించడం, ప్రోత్సహించడం, సంపత్తి హక్కులను కాపాడడం, సమాజోన్నతికి వినియోగించడం ఆయాదేశాల కనీస బాధ్యతగా తెలుసుకోవాలి. నేటి సృజనశీల ఆవిష్కరణలు రేపు పాతబడిపోతున్నాయి. శాస్త్రసాంకేతిక విప్లవం నిత్యనూతనంగా కొత్తపొంతలు తొక్కుతున్నది. నాడు ట్రాంకాల్ ద్వారా దూరప్రాంత ప్రజలతో మాట్లాడిన రోజుల నుంచి నేడు క్షణాల్లో స్మార్ట్‌ఫోన్‌లో వీడియో కాల్ ద్వారా చూస్తూ మాట్లాడుకునే డిజిటల్ కాలానికి వచ్చాం. రేపు ఏ ఆవిష్కరణ మన జీవనశైలినా ఏ విధంగా మార్చనుందో ఊహకు అందడం లేదు. ఇలా మానవ జీవనశైలిలో పెను మార్పులు రావడానికి మేధో సంపత్తి పునాదిగా నిలుస్తున్నది. మేధావుల సృజన, వినూత్న ఆవిష్కరణల దాహంతో పలు అత్యాధునిక శాస్త్రసాంకేతిక ఉపకరణాలు మనల్ని అబ్బురపరుస్తూ మన జీవినశైలిలో ఓ భాగం అవుతున్నాయి. వంటింటి నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు నిరంతరం కొనసాగుతున్నాయి. అత్యంత శక్తివంతమైన మేధో సంపత్తి (ఇంటలెక్చువల్ ప్రాపర్టీ) ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట 26 ఏప్రిల్ రోజున "ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం (వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ డే)" పాటించడం 26 ఏప్రిల్ 2000 నుంచి ప్రారంభమైంది. 2025 ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవ ఇతివృత్తంగా "మేధో సంపత్తి – సంగీతం : ఐపి బీట్‌ను అనుభూతి చెందండి" అనబడే అంశాన్ని తీసుకున్నారు. పేటెంట్లు, కాపీరైట్స్, ట్రేడ్ సీక్రెట్స్, డిజైన్స్, సంగీత రంగంలో సృజనలు, భౌగోళిక సూచికలు లాంటివి మోధో సంపత్తి కిందికి వస్తాయి. సృజనశీల ఆలోచనలు, వినూత్న ఆవిష్కరణలతో మేధావులు చేస్తున్న కృషి అనన్యసామాన్యం, అభినందనీయం. మేధో సంపత్తి పట్ల అవగాహన, ప్రోత్సాహం, మేధో హక్కుల పరిరక్షణ ప్రాధాన్యం, మేధో సంపత్తిని అక్రమంగా వాడుకునే అక్రమార్కులకు జైలు ఊచల రుచి చూపడం, మేధో హక్కుల విశ్లేషణలు, విస్తృత ప్రచారం, మేధో సంపత్తి సంబంధ చట్టాల అవగాహన, న్యాయపరమైన వివరాలు, ఆవిష్కరణలకు సరైన గుర్తింపు లాంటివి ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవ వేదికగా చర్చించబడతాయి. మేధో సంపత్తిలో ఓ ప్రధాన భాగంగా సాహిత్యం, సంగీతం, కళా సృజన, సినిమా, సింబల్స్, ఇమేజెస్, పేర్లు, వాణిజ్యపరమైన అంశాలు అనేకం వస్తాయి. మేధో సంపత్తి రక్షణ, విక్రయ బాధ్యతలు ఆవిష్కర్తకు మాత్రమే ఉంటాయి. మేధో సంపత్తి ఒక్కరిది లేదా సమూహానిది అయినప్పటికీ అందరికీ సమాన హక్కులు కల్పించబడతాయి. మేధో సంపత్తిని విక్రయించడం, లైసెన్స్ తీసుకోవడం, దానం చేయడం, వినిమయం చేయడం లాంటి సర్వాధికారాలు ఆవిష్కర్తలకు మాత్రమే ఉంటాయని తెలుసుకోవాలి. దేశాభివృద్ధి మేధో సంపత్తి మీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. మేధో సంపత్తి హక్కులు అధికంగా యూఎస్, యూకె లాంటి దేశాల్లో అధికంగా నమోదు అవుతున్నాయి మేధో సంపత్తి హక్కుల వల్ల సామాన్యులపై ఆర్థిక భారం పడడం, అమలులో జాప్యాలు జరగడం, వినియోగదారులపై పెను భారం పడడం జరుగుతుందని వాదనలు చేయలేదు వర్గాలు ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవాన్ని వ్యతిరేకిస్తున్నారని కూడా తెలుసు కోవాలి. పర్యావరణ హితమైన మేధో సంపదలకు నేడు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వబడుతున్నది. వినూత్న ఆవిష్కరణలు మానవాళి జీవన విధానాలను సరళతరం చేస్తున్నాయి, సుఖసంతోషాలకు పునాదులు నిలుస్తున్నాయి. నేటి యువత స్టెమ్ (సైన్స్ – టెక్నాలజీ – ఇంగ్లీష్/ఇంజనీరింగ్ – మ్యాథమ్యాటిక్స్) ఆధారంగా తమ పరిశోధనలతో విలువైన మేధో సంపత్తిని జనింపజేసి ఆచరణాత్మక మార్గాలను చూపుతూ ప్రపంచ మానవాళికి బహుమతులుగా అందజేయాలని కోరుకుందాం, మన భారతం కూడా ఐపి రంగంలో ముందంజలో ఉండాలని కోరుకుందాం.

# భూ భారతితో రైతుల భూములకు పూర్తి రక్షణ

## అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

## రైతుల భూములకు భరోసా కల్పించే చట్టం భూభారతి చట్టమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 25**రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి చట్టం (భూమి హక్కుల రికార్డు చట్టం)-2025 పై శుక్రవారం రోజున జమ్మికుంట పాత మున్సిపాలిటీలో ఆవరణంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు వారి భూముల పై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతి చట్టం ద్వారా లభించునుందని అన్నారు. రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని, తదుపరి భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టాలు ప్రకారం అప్పిలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు.

గతంలో తహసిల్దారు పరిష్కరించే చిన్న చిన్న సమస్యలు కూడా కలెక్టర్ దగ్గరికి వచ్చేవని, వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం వల్ల పరిష్కరించడంలో జాప్యం జరిగేదని తెలిపారు. భూభారతి ద్వారా కింది స్థాయికి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని దీనివల్ల భూమికి సంబంధించిన చిన్న సమస్యలు మండల స్థాయిలోని సత్వరం పరిష్కారం అవుతాయని తెలిపారు.ధరణిలో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకునేందుకు 33 మాడ్యూల్స్ పొందుపరచాలని, దీనివల్ల ఏ సమస్యకు ఏ మాడ్యూల్ లో దరఖాస్తు చేయాలో అర్థం కాకుండా ఉండేదని అన్నారు. భూభారతిలో 4 మాడ్యూల్స్ మాత్రమే ఉండి సులభమైన దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని తెలిపారు.ధరణిలో సవరణకు, సమస్యల పరిష్కారానికి, కింది స్థాయి అధికారులకు ఎటువంటి అధికారాలు లేనందున వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్ ఉండేవని, ఆరు నెలల క్రితం అధికారాలు విభజించడం ద్వారా సమస్యలు త్వరగా పరిష్కారం అవుతున్నాయని అన్నారు. భూములకు సంబంధించిన అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం దొరికిందని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిలో ఇలాంటి ఆకాశము లేదని తెలిపారు. భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. ఎంతోమంది మేధావులు, అధికారులు భూభారతి చట్టానికి రూపకల్పన చేయడంజరిగిందన్నారు.హుజురాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి రమేష్ మాట్లాడుతూ భూభారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే భూభారతిలో మూడంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, వైస్ చైర్మన్ ఏ. సతీష్ రెడ్డి, తహసీల్దార్ జి .రమేష్ బాబు, రెవిన్యూ, వ్యవసాయ, పంచాయతీ అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు వేసారు కాని వర్షం నీరు వెళ్ళటానికి దారి మూసేశారు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సదాశివపేట పట్టణంలోని ప్రధాన కూడలి గ్రామ నడిబొడ్డున మహాత్ముడి విగ్రహం సాక్షిగా వర్షం పడితే అడుగు పెట్టలేని స్థితిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు,పట్టణంలోని(గాంధీ రోడ్డు)హనుమాన్ దేవాలయం నుండి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వరకు నూతన సీసీ రోడ్డు వేసారు,అయితే గాంధీ చౌక్ ప్రధాన కూడలి నాలుగు రోడ్లు ఒకే చోట కావడంతో ఒక వైపు రోడ్డు ఎత్తుగా ఉండడంతో మహాత్మ గాంధీ విగ్రహం ముందు వైపు వెనక వైపు వర్షం నీరు వచ్చి చేరుతోంది,మున్సిపల్ కమిషనర్ కు పట్టణ ప్రజాలు పలు మార్లు పిర్యాదు చేసిన శాశ్వత పరిష్కారం తీసుకోలేరు,ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షం నీరు వెళ్ళటానికి శాశ్వత పరిష్కారం తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# పర్యాటకులపై ఉగ్రదాడికి ఆర్.ఎం.పి డాక్టర్ల నిరసన

## -పహల్గాం ఘటనను తీవ్రంగా ఖండించిన అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 25:** జమ్మూ కశ్మీర్ పహల్గాం సమీప బైసరీన్ వ్యాలీలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల దాడి దేశవ్యాప్తంగా తీవ్ర నిరాశ, ఆవేదనకు గురి చేసిందని ఈ దారుణమైన ఘటనను ఖండిస్తూ మందమర్రి పట్టణానికి చెందిన ఆర్ఎంపి, పిఎంపి డాక్టర్లు మంగళవారం సాయంత్రం బస్టాండ్ జయశంకర్ చౌరస్తా వద్ద కాంతి దీపాలు వెలిగించి అమరులకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆర్ఎంపి పట్టణ అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రదాడులు జరుగుతుండటం దేశ భద్రత పరిస్థితి ఎంత దుర్దశకు గురైందో స్పష్టంగా చూపుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ ఘాటైన నిర్ణయాలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరింత భయంకరమైన పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ జి.శంకర్, గౌరవ అధ్యక్షుడు గోనె గోవర్ధన్, ఉపాధ్యక్షుడు చింతల పోశం, రాష్ట్ర కార్యదర్శి జి.శంకర్, కోశాధికారి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి సాంబమూర్తి, బి.జనార్ధన్, వేముల నరసయ్య, తిరుపతి, మతిన్ ఖాన్, గోన సత్యం, టి. శ్రీనివాస్, నరసయ్య, మనోహర్, సత్యనారాయణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# జమ్మూ కాశ్మీర్లోని పహల్గంలో ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య.

## ఉగ్రదాడిని ముక్తకంఠంతో ఖండిస్తున్నాంప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** జమ్మూ కాశ్మీర్లోని పహల్గం ఉగ్రవాదుల దాటి బాధాకరమని, ఉగ్రదాడిని ముక్తకంఠంతో ఖండిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం రోజున వేములవాడ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ అంబేద్కర్ చౌరస్తా నుండి మహంకాళి చౌరస్తా వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశ్మీర్ లోని ఉగ్రదాడిలో మరణించిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నాను అన్నారు . ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని వేడుకుంటున్నట్లు తెలిపారు. ఉగ్రదాడులతో చాలా దేశాలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ఏ దేశం కూడా మనుగడ సాధించ లేదన్నారు.

ఈ ఘటనను హేయమైన చర్యగా అభివర్ణించిన ప్రభుత్వ విప్. ఇటువంటి కిరాతక చర్యలకు భారత ప్రజల సమైక్యతను, ధైర్యాన్ని ఎన్నటికీ దెబ్బతీయ లేవని స్పష్టం చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాతి మొత్తం ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ దాడి చేసిన ఉగ్రవాదులను గుర్తించి వారిని వారి సంస్థను మట్టుపెట్టాలని పేర్కొన్నారు. ఈ దాడికి బాధ్యత వహిస్తున్న ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం ఎటువంటి సంకోచం లేకుండా కఠినంగా వ్యవహరించాలని కోరుతూ, మృతుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అసమాన శిల్పి గణపతి స్థపతి

ఆధునిక కాలంలో పలు దేవాలయాలు, అపురూప నిర్మాణాలు చూసినపుడు శిల్ప కళకు ప్రతిరూపం అయిన గణపతి స్థపతి వెంటనే స్ఫురణకు రాక మానరు. ఉలి చప్పుళ్ల మధ్య ప్రపంచంలో కళ్లు తెరిచి, ఉలి చప్పుళ్లకే జీవితాన్ని అంకితం చేసి, ఉలి చప్పుళ్ల మధ్యే కళ్లుమూసిన వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన, శిల్పీకరించిన గణపతి స్థపతి అసమాన శిల్పి. దేశం గర్వించదగ్గ శిల్పకళా నిపుణులు. హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై బుద్ధ విగ్రహం, హైదరాబాద్‌లో బిర్లా మందిర్, చోళ, విజయనగర శిల్పకళారీతుల కలయికతో మహానంది ఆలయ గోపురాలు, పిట్స్‌బర్గ్‌లోని బాలాజీ దేవాలయం, కంచి సమీప 100 స్తంభాలతో నిర్మించిన మణి మంటపం, బద్రీనాథ్ దేవాలయ మహామండపం, తిరుమలలో వసంతరాయ మంటపం, ఇలా ఒక్కొక్క నిర్మాణంలో గణపతి స్థపతి శిల్పకళా చాతుర్యానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. గణపతి స్థపతి (26 ఏప్రిల్ 1931 – 7 ఏప్రిల్ 2017) ప్రముఖ స్థపతి, వాస్తు శిల్పి. పూర్తిపేరు సత్తయ్య ముత్తయ్య గణపతి. శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో గణపతి స్థపతి పేరు తెర మీదకు వచ్చింది. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ చేత బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించప బడి, సత్కరింప బడిన గొప్పతనం ఆయనది. తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్న ప్రతిభ ఆయనది. నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కోరిక మేరకు హైదరాబాద్‌లో హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠింప చేసిన ఘనత ఆయనది. 1931, ఏప్రిల్ 26న ముత్తు స్థపతి, గౌరీ అమ్మన్ లకు సంతానంగా జన్మించిన గణపతి, ఆరేళ్ల చిరుత ప్రాయంలోనే ఉలిని చేతబట్టి అలవోకగా చెక్కడం అభ్యాసం చేశారు. సాంప్రదాయ ఆలయ, వాస్తు, శిల్ప శాస్త్రాలను, కుటుంబ పెద్దల దగ్గర 17 సంవత్సరాల పాటు శిక్షణ పొందారు. శిల్పాలు చెక్కడం లోనూ, ఆలయాలను నిర్మించటం లోనూ కొత్త ఒరవడిని సృష్టించి, ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తున్న గణపతి తమిళనాడు వదిలి, తెలుగునాట కాలు మోపారు. శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో పేరు తెచ్చుకొన్న గణపతి స్థపతి నైపుణ్యం గురించి, విన్న నాటి దేశ ప్రధాని ఇందిరాగాంధీ, బద్రీనాథ్ దేవాలయ మహామండప పని అప్పగించారు. మండప భాగాలను హైదరాబాద్‌లో తీర్చిదిద్ది, బద్రీనాథ్‌కు తరలించి నిర్మించిన తీరుకు అచ్చెరువొందిన ఆమె, ఒక బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించి సత్కరించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పిలుపునందుకొని, తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖలో స్థపతిగా చేరిన గణపతి స్థపతి, ఉమ్మడి రాష్ట్రంలో వందల, వేల ఆలయాలను నిర్మించి, ప్రధాన స్థపతిగా ఎదిగారు. తరతరాల ప్రాచీన వాస్తుశిల్ప సంప్రదాయం, నిరంతరం కొనసాగాలన్న తపనతో, తన ఆధ్వర్యంలో దేవాదాయ శాఖలో ఒక శిల్ప కళాశాలను స్థాపించి, కొన్ని వందల మంది శిల్పుల్ని తయారుచేసి, కొరతను తీర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా, శిథిలాలయాలను పదిలం చేస్తూ, లేనిచోట కొత్త వాటిని కడుతూ తలమునకలై ఉన్న గణపతి స్థపతికి శ్రీశైలం జలాశయ నీటి ముంపు దేవాలయాల తరలింపు ఒక సవాలుగా మారింది. కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాల్లోని 102 గ్రామాల్లో ముంపునకు గురైన దాదాపు 108 దేవాలయాలను ఊడదీసి ఎగువన1978%–%89 మధ్య చారిత్రక కార్యక్రమం చేపట్టి, పునర్నిర్మించిన ఘనతను దక్కించుకొన్నారు. వాస్తు, శిల్ప విద్యను అందుబాటు లోకి తేవడానికి పూనుకుని, తమిళ, సంస్కృత భాషల్లోనున్న వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాలను తెలుగులోకి అనువదించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పెదపాటి నాగేశ్వరరావు సహకారంతో రూపధ్యాన రత్నావళి, కాశ్యప శిల్ప శాస్త్రాలను వెలువరించారు. నిరంతర అధ్యయనంతో పాటు, పరిశోధనలపై దృష్టి సారించిన గణపతి స్థపతి, తెలుగు విశ్వవిద్యాలయం, సచివాలయం భవనాల్లో ఆధునికతకు, సాంప్రదాయ వాస్తును జోడించి, కొత్త ఒరవడిని సృష్టించారు. ఒకసారి అమెరికా వెళ్లిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు, న్యూయార్క్‌లో గణపతి స్థపతి తారస పడిన సందర్భంలో, లిబర్టీ స్టాట్యూ లాంటి పెద్ద విగ్రహాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పే ప్రయత్నం చేయాలి అన్న ఎన్టీఆర్ కోరికను సాకారం చేసి, హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ విగ్రహం కోసం యాదగిరి గుట్టకు సమీపంలోని రాయగిరి నుంచి 100 అడుగుల రాయిని, 100 చక్రాల వాహనంపై హైదరాబాద్‌కు తరలించి, గణపతి స్థపతి ప్రపంచ ఖ్యాతిని సంపాదించారు. హైదరాబాద్‌లో బిర్లా మందిర్ రూప శిల్పి ఆయనే. సింహాచలం, కాళేశ్వరం, వేములవాడ లాంటి అనేక ప్రాంతాల్లో పలు ఆలయాలకు కొత్త సొగసులు అద్దారు. శ్రీశైలం, మహానంది ఆలయ గోపురాలను చోళ, విజయనగర శిల్పకళారీతుల కలయికతో నిర్మింప చేశారు. విదేశాల్లో సైతం ఆలయాలను నిర్మించి, తెలుగు శిల్పుల కీర్తిని దశదిశలా విస్తరింప చేయటలో భాగంగా, పిట్స్‌బర్గ్‌లోని బాలాజీ దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం అమెరికా తిరుపతిగా ప్రసిద్ధి చెంది, రోజూ వేల మంది భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. గణపతి స్థపతి శిల్పకళా చాతుర్యాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం, 1990లో అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీ ద్వారా గౌరవించింది. ఆయన ప్రతిభకు గుర్తింపుగా, శిల్పకళానిధి, కళైమామణి, శిల్పకళా రత్న వంటి బిరుదులెన్నో వరించాయి. వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన గణపతి స్థపతి కంచి కామకోటి పీఠ పరంపరలోని 68వ పీఠాపతులైన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామికి పరమ భక్తులు. శంకరాచార్య ఆకాంక్ష మేరకు, కంచి సమీపంలో నున్న ఒరుక్కై గ్రామంలో తన అద్భుత శిల్పకల్పనా చాతుర్యంతో మలచిన 100 స్తంభాలతో నిర్మించిన మణి మంటప నిర్మాణం, తన చిరకాల వాంఛగా తరచూ పేర్కొనేవారు గణపతి స్థపతి. శంకరాచార్య ప్రమాచార్య శుభాశీస్సులతో అక్కడే శంకర శిల్పశాలను స్థాపించి, వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాల్లో విద్యార్థులకు శిక్షణనిస్తూ గణపతి స్థపతి, ఏప్రిల్ 7న, ఈ పార్థివ దేహాన్ని వదిలి వెళ్లారు. ఆ మహాశిల్పి ఈ నేలను వదిలినా, ఆయన సృష్టించిన అపురూప, అపూర్వ శిల్పాలు, నిర్మించిన ఆలయాలు, ఆయన శిల్పకళా ప్రతిబింబాలై కళ్లముందు సజీవంగా కదలాడుతూనే ఉన్నాయి.

# గర్వించదగ్గ వాగ్గేయకారుడు

సంగీత త్రిమూర్తులలో మూడవ వాడైన శ్యామశాస్త్రి (ఏప్రిల్ 26, 1763 – ఫిబ్రవరి 6, 1827) ప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసులు. దాక్షిణాత్య కర్ణాటక సంగీత రత్న త్రయంలో వయసురీత్యా పెద్దవారు శ్యామశాస్త్రి (క్రీ. శ. 1763 –1827). శ్యామ శాస్త్రి కన్నా త్యాగరాజు కొద్దిగా చిన్నవారు (క్రీ.శ.1767–1847). వీరు ఇరువురి కన్నా చిన్నవారు ముత్తుస్వామి దీక్షితులు (క్రీ.శ. 1776–1835). శ్యామశాస్త్రి తండ్రి విశ్వనాథ శాస్త్రి. ప్రస్తుత ప్రకాశం జిల్లాలోని గిద్దలూరుకు సమీపంలోగల కంభం ప్రాంతీయులు. మహమ్మదీయుల దండయాత్రలకు బెదిరి వారి కుటుంబీకులు 17వ శతాబ్దంలో తమిళనాడుకు వలస వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. శ్యామశాస్త్రి అసలు పేరు వేంకట సుబ్రహ్మణ్యము. అయితే, చిన్నతనంలో ముద్దుపేరుగా శ్యామకృష్ణ గా పిలుస్తూ, ఆ పేరే చివరకు వ్యవహారికంలో సార్థకమైందని ఆయన శిష్యులు పేర్కొంటారు. పుత్రుడు కలుగునని" చెప్పినట్లే ఇతనితల్లి గర్భవతిఅయి క్రీ.శ1763లో చిత్రభాను సంవత్సరంలో మేష రవి కృత్తికా నక్షత్రమునందు శ్రీనగరమను తిరువారూరిలో శ్యామశాస్త్రిలు జన్మించినట్లు పేర్కొంటారు. తండ్రి విశ్వనాథ శాస్త్రి సంస్కృత, తెలుగు భాషలలొ పండితుడు కావడంతో– శ్యామశాస్త్రి చిన్నతనంలో తండ్రి దగ్గరే సంస్కృతాంధ్ర భాషలు అభ్యసించాడు. సంగీతంలో తన మేనమామ దగ్గర స్వరపరిచయం కల్గినా, ఆ పిదప తంజావూరులో 'సంగీత స్వామి' అనబడే ప్రముఖ తెలుగు సంగీత విద్వాంసుని దగ్గర, తంజావూరులోని రాజాస్థానంలో సంగీత విద్వాంసుడైన శ్రీ పచ్చిమిరియము ఆది అప్పయ్య సహకారంతో సంగీత శాస్త్రాలలో మర్మములు ఎన్నో అధ్యయనం చేశాడు. శ్యామశాస్త్రి రచించిన అనేక కీర్తనలు ఉల్లాసం కలిగించేవి, చక్కని లయ, తాళ ప్రదర్శనలకు అనుగుణంగా ఉండేవి. నాదోపాసన ద్వారా ఆత్మానందం సాధించ వచ్చుని ఆయన అభిప్రాయ పడేవారు. శ్యామశాస్త్రి తెలుగు, తమిళ, సంస్కృత భాషలలొ అనేక కృతులు, కీర్తనలు రచించినా అధికభాగం తెలుగులోనే వ్రాశారు. అయితే, త్యాగరాజు తన కీర్తనలలో భావ రాగలకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా, శ్యామశాస్త్రి కీర్తనలలో క్లిష్టమైన 'తాళ' రచన చేసినట్లు సంగీతాభిమానులు అంటారు. శ్యామశాస్త్రి కీర్తనలలో క్లిష్టమైన రచనతోపాటు, ఆయనకు శిష్యులు అధిక సంఖ్యలో లేకపోవడం వల్ల కూడా, ఈయన కీర్తనలు అధిక ప్రాచుర్యం పొందలేదని వారు భావిస్తారు. శ్యామశాస్త్రి రచించిన "ప్రోవవమ్మ" , "మాంజిరాగం" అలాగే 'కల్గద '(కలగడ ), 'చింతామణి ' రాగాలు, "హిమాద్రిసుతే " అనే కీర్తన, ఒకే స్వరంతో సంస్కృతం,తెలుగు భాషలలొ వేరు వేరుగా రాసిన ఆయన కీర్తనలు సంగీత కళాకారు లందరికి సుపరిచతమే.. త్యాగరాజాదులచే కొనియాడ బడిన ఆయన లయజ్ఞానము శ్లాఘనీయమైనది. ఆనంద భైరవి రాగమన్న ఆయనకు చాల యిష్టమని చెప్తారు. ఆయన మదురైకు వెళ్లినపుడు మీనాక్షి దేవిని స్తుతించుచూ తొమ్మిది కృతులు ("నవరత్నమాలిక") గానం చేశాడు. శ్యామశాస్త్రి ప్రసిద్ధి చెందిన ఆనంద భైరవీ, ధన్యాసి, కల్గద, కళ్యాణి, కాంభోజి, కాపి, చింతామణి వంటి రాగాల్లో కృతులు స్వర పరిచాడు. సంగీత పాఠాల్లో సరళీ స్వరాలు, జంట స్వరాలు, గీతాలు, స్వరజతులు, వర్ణాలు, కృతులు అనేవి ఒక పద్ధతిలో నేర్పుతారు. వీటిలో స్వరజతి రూపకర్త శ్యామశాస్త్రి. తోడి రాగంలో "రావే హిమగిరి కుమారి", భైరవి రాగంలో 'కామాక్షీ అనుదినము'వంటివి కొన్ని ప్రసిద్ధి జెందిన స్వరజతులు. ఈ స్వరజతులే కాకుండా విలోమ చాపు తాళాన్ని కూడా శ్యామశాస్త్రి బహుళ ప్రాచుర్యం లోకి తెచ్చాడు. సాధారణంగా చాపు తాళం గతి 3 ం 4 పద్ధతిలో ఉంటుంది. ఇలా కాకుండా 4 ం 3 రీతిలో తాళ గతిని మార్చి కొన్ని కీర్తనలు స్వర పరిచాడు. పూర్వి కళ్యాణి రాగంలో 'నిన్ను వినగ మరి', ఫరజ్ రాగంలో 'త్రిలోకమాత నన్ను' అనేవి ఈ విలోమ చాపు తాళంలో ప్రసిద్ధి చెందిన కీర్తనలు. తంజావూరు జిల్లాలో తిరువాయూరులో ఉన్న కామాక్షి దేవాలయ అర్చకత్వం చేసుకుంటూ, తన గాన కళా పాండిత్యంలో కామాక్షి అమ్మవారి సేవలో, ఆమె సన్నిధానంలోనే ' శ్యామకృష్ణ' అనే ముద్రతో అనేక కీర్తనలు, కృతులు రచించాడయన. శ్యామశాస్త్రి ఇంటి ఇలవేల్పుగా కామాక్షిదేవిని కీర్తిస్తూ, తమ ఇంటి 'ఆడపడుచుగా' అమ్మవారిని భావిస్తూ – అపూర్వం, అనన్య సామాన్య కృతులెన్నింటినో శ్యామశాస్త్రి రచించాడని ఆయన శిష్యులు, సంగీత కళారాధకులు పేర్కొంటారు. అందువల్లనే, శ్యామశాస్త్రి తన కీర్తనలలో కొన్నింటిని "శ్యామకృష్ణ – సహోదరి" అని పేర్కొన్నట్లు వారు చెపుతారు. శ్యామశాస్త్రి కుమారుడు సుబ్బరాయశాస్త్రి కూడా ప్రముఖ వాగ్గేయకారిడిగా ప్రసిద్ధి చెందాడు. శ్రీ అలసూరు కృష్ణయ్య , శ్రీ తలగంబాడి పంచనాదయ్య తదితరులు శ్యామశాస్త్రి శిష్యులలో ప్రముఖులు.

# అసమాన గణిత శాస్త్రజ్ఞుడు

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు సాధించిన భారతీయుడు శ్రీనివాస రామానుజన్. గత సహస్రాబ్దిలో ప్రపంచానికి అత్యుత్తమ గణితశాస్త్ర సిద్ధాంతాలను, సూత్రాలను అందించిన అత్యుత్తమ అ'గణిత' మేధావి శ్రీనివాస రామానుజన్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణం. అపారమైన మేధస్సుతో భారత దేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్. శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ (డిసెంబర్ 22, 1887ఏప్రిల్ 26, 1920) 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. ఆయనకు పది సంవత్సరాల వయసులోనే గణిత శాస్త్రంతో అనుబంధం ఏర్పడింది. పదమూడేళ్లకే ఎస్ఎల్ లోనీ త్రికోణమితిపై రాసిన పుస్తకాన్ని ఔపోసన పట్టడమే కాదు తను సొంతంగా సిద్ధాంతాలు కూడా ప్రారంభించారు. కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ గణితం మీదే శ్రద్ధ చూపి మిగిలిన సబ్జెక్టులపై దృష్టి పెట్టక పోవడంతో ఎఫ్.ఎ. పరీక్ష తప్పారు. ఆ తరువాత మద్రాస్‌లోని పచ్చయ్యప్ప కాలేజీలో చేరారు. అక్కడ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై రామానుజన్ విశేష పరిశోధనలు చేశారు. 1729 సంఖ్యను రామానుజన్ సంఖ్యగా పిలుస్తారు. తీవ్రమైన అనారోగ్యంతో హాస్పిటల్లో ఉన్నప్పుడు కూడా హార్డీతో 1729 సంఖ్య యొక్క ప్రత్యేకతను తెలియజెప్పి ఆయన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేశారు. రామానుజన్ అనారోగ్యంతో హాస్పిటల్లో వున్నప్పుడు, హార్డీ ఆయనను పలుకరించటానికి వెళ్లి మాటల మధ్యలో తాను వచ్చిన కారు నంబరు 1729, దాని ప్రత్యేకత ఏమైనా ఉన్నదా ? అని అడిగారు. అందుకు రామానుజన్ తడుము కోకుండా ఆ సంఖ్య ఎంతో చక్కని సంఖ్య అని, ఎందుకంటే రెండు విధాలుగా రెండు ఘనముల మొత్తముగా వ్రాయబడే సంఖ్యా సమితిలో అతి చిన్నసంఖ్య అని తెల్పారు. (1729 = 1గి3 ం 12గి3 = 9గి3 ం 10గి3 ). ఈ సంఘటన గణితంపై ఆయనుకున్న అవ్యాజమైన అనురాగానికి, అంకిత భావానికి నిదర్శనం. మహా మేధావులు కూడా సాధించలేని సమస్యలను అలవోకగా ఎలాంటి పుస్తకాల సాయం లేకుండా సాధించి, ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్న భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్ధులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం.. 15ఏళ్లకే రామానుజన్‌లోని తెలివితేటలను ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్కూచ్‌సిడ్జ్‌కార్ రాసిన 'సినాప్సిస్'. అందులో ఆల్జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్దపెద్ద ప్రొఫెసర్‌లు సైతం అర్థం చేసుకోలేకపోయిన ఈ సిద్ధాంతాలను, సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవారు. 3,500 గణిత ఫలితాలను సమీకరించిన రికార్డును సొంతం చేసుకున్న మేధావి. 1903లో మద్రాసు విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్ వచ్చింది. లెక్కల వల్ల కొడుకుకి పిచ్చి పడుతుందేమోనని భయపడిన రామానుజం తండ్రి ఆయనకు పెళ్లి చేశారు. సంసారం గడవటం కోసం 25 రూపాయల వేతనం మీద రామానుజన్ గుమాస్తాగా చేరారు. చిత్తు కాగితాలను కూడా బహు జాగ్రత్తగా వాడుకుంటూ గణితమే లోకంగా బతికేవారు. గణితంలో ఆయన ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను చూచి ఏ డిగ్రీ లేకపోయినా మద్రాసు విశ్వ విద్యాలయం నెలకు 75 రూపాయల ఫెలోషిప్ మంజూరు చేసింది. 1913లో మద్రాస్ పోర్ట్‌ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా.వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్డ్ హార్డి (1877–1947)కి పంపారు. ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి.హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు. జీవిత చరమాంకంలో రామానుజన్ రాసిన మ్యాజిక్ స్క్వేర్, ఫ్యూర్ మాథ్స్‌కు చెందిన నెంబర్ థియరీ, మాక్ తీటా ఫంక్షన్స్ చాలా ప్రసిద్ధి పొందాయి. 33 ఏళ్ళకే ఆయన 1926, ఏప్రిల్ 26న మరణించారు. ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి గౌరవం పొందిన తొలి భారతీయుడిగానూ, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండో భారతీయుడిగానూ ఆయన చరిత్రకెక్కారు. రామానుజన్ స్వరాష్ట్రమైన తమిళనాడు, ఆ రాష్ట్ర వాసిగా ఆయన సాధించిన విజయాలకు గుర్తుగా ఆయన జన్మదినమైన డిసెంబర్ 22 ను రాష్ట్ర సాంకేతిక దినోత్సవంగా ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962 వ సంవత్సరంలో ఆయన 75వ జన్మదినం నాడు, సంఖ్యా శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషిని కొనియాడుతూ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. 2012లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టినరోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. 125వ జయంతి సందర్భంగా 2014ను భారత ప్రభుత్వం జాతీయ గణితశాస్త్ర సంవత్సరంగా ప్రకటించింది. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్ధులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన విదేశీ ప్రొఫెసర్ హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం..

## తాడేపల్లిగూడెం నిట్ సమీపంలో రోడ్డు ప్రమాదం.

### ఒకరు మృతి..మరోకరికి తీవ్ర గాయాలు

తాడేపల్లిగూడెం నిట్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరోకరికి తీవ్ర గాయాల్యాయి. ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు ప్రయాణిస్తున్నారు. కరణం వెంకటేశ్వరరావు (30) సంఘటన స్థలంలోని మృతిచెందగా, నవీన్ అనే యువకుడు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాయలైన నవీన్ కి చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.వెంకటేశ్వరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియాస్పత్రికి తరలించారు.

## అక్బర్ నగర్ లో ఎంపి వంశికృష్ణ పర్యటన

పెద్దపల్లి రామగుండం అక్బర్ నగర్ లో ఎన్టిపిసి బూడిద పైప్ లైన్ పగిలి ఇండ్లలోకి చేరి దెబ్బతిన్న ఇండ్లను పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పరిశీలించారు. నష్టపోయిన తమను ఆదుకోవాలనీ అయనను కాలనీ వాసులు కోరారు. ఎన్టిపిసి అధికారులను పైప్ లైన్ పగలడానికి గల కారణాలు ఎంపి తెలుసుకున్నారు.

వంశీ మాట్లాడుతూ ఫ్లాయాస్ అనేది ఒక విషపూర్తిమైంది... అలాంటి విషయం లో ఎన్టిపిసి యాజమాన్యం జాగ్రత్తలు పాటించాలి. ఈ యాష్ వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని అన్నారు. బూడిదతో నిండిన ఇళ్లను పరిశీలించి బాధితులను ఓదార్చారు. పైప్ లైన్ ప్రమాదంపై ఎన్టిపిసి అధికారులతో చర్చించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు.

రామగుండం ప్రజల రక్షణే ఎన్టీపీసీ ప్రథమ బాధ్యత. ఈ నిర్లక్ష్యాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

# జాతీయ ప్రాజెక్టుగా రాజధాని..?

విజయవాడ, ఏప్రిల్ 26,నవ్యాంధ్ర రాజధాని అమరావతిని.. ఇప్పటి వరకు ఊహిస్తున్న దానికి భిన్నంగా.. మరింత డెవలప్ చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు ప్రయత్నాలుచేస్తోంది. దీనిలో భాగంగా.. రాజధానిని జాతీయ ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలో ప్రధాన జాతీయ రహదారులతో రాజదానిని అనుసంధానించే ప్రక్రియకు సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఇది పూర్తయితే.. అమరావతి.. అందరిదీ అనే భావనను మరింత పెంచి.. దీనిని పొరుగు రాష్ట్రాలకు కూడా చేరువ చేయనున్నారు. ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులు పెట్టేవారిని ఆహ్వానిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. దీనికి తగిన విధంగా ఏర్పాట్లు చేస్తోంది. అంతర్జాతీయ విమానాశ్రయం అమరావతిలోనే ఉండేలా చర్యలు తీసుకుంటోంది. దీనికి సంబంధించి మరో 30-40 వేల ఎకరాల భూమిని సేకరించే దిశగా అడుగులు వేసింది. ఇది పూర్తయ్యేందుకు రెండేళ్ళ గరిష్ఠ సమయాన్ని నిర్దేశించుకుంది. ఇక, ఈ క్రమంలోనే రహదారుల విస్తరణకు కూడా.. కీలక నిర్ణయాలు తీసుకుంది. దీనిలో భాగంగా.. చెన్నై-కోల్‌కతా-హైదరాబాద్‌లతో రాజధానిని అనుసంధానించే జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. 2015-19 మధ్యే దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందించినా.. వివిధ కారణాలతో ముందుకు సాగలేదు. కానీ.. ఇప్పుడు దీనిని సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. తద్వారా.. రాజధానిని దేశవ్యాప్తంగా.. అన్ని ప్రాంతాలకు అనుసంధానించాలని నిర్ణయించింది. దీనిలో కీలకమైన మూడు రహదారులపై మాస్టర్ ప్లాన్‌రెడీ చేసుకుంది. ఎలివేటెడ్ కారిడార్-5, ఎలివేటెడ్ కారిడార్-13, నేషనల్ హైవే ? 13లను నిర్మించి..వాటి ద్వారా హైదరాబాద్, చెన్నై, కోలకత వంటి నగరాలకు అమరావతిని కలుపుతారు.. తద్వారా.. దేశవ్యాప్తంగా రహదారి కనెక్టివిటీ మెరుగుపడుతుంది. పలువురుపెట్టుబడి దారులు.. కూడా..ఈ మార్గాలపై ఇటీవల సీఎం చంద్రబాబుతో చర్చించారు.

దీంతో ఈ విషయంపై తాజాగా సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది.అదేసమయంలో కేంద్రానికి కూడా సమాచారం పంపించి.. ఆయారహదారుల నిర్మాణంపై క్లారిటీతీసుకుంటారు. దీంతో అమరావతి రాజధానిని జాతీయ ప్రాజెక్టుగా మరింత తీర్చిదిద్దాలని చంద్రబాబు భావిస్తున్నారు.

పటేల్ తరహాలో

అమరావతిలో 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతిలోని నీరుకొండపై 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నారు.

విగ్రహ బేస్‌లో ఎన్టీఆర్ జీవితం, కళాకృతులు, మినీ థియేటర్ తదితరాలు ఉండనున్నాయి. డీపీఆర్ తయారీకి కన్సల్‌టెంట్ కోసం టెండర్లు ఆహ్వానించారు. నందమూరి తారకరామారావు భారీ విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండు రోజుల కిందట మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి గుజరాత్ పర్యటనలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని సందర్శించి వచ్చారు. ప్రాథమిక అంచనాల మేరకు 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇందులో నీరుకొండ ఎత్తు 300 అడుగులు ఉంటుంది.

దీని మీద 100 అడుగుల ఎత్తులో బేస్‌ను నిర్మిస్తారు.

ఈ బేస్‌లోనే ఎన్టీఆర్ మెమోరియల్ హాల్, ఎన్టీఆర్ మ్యూజియం, ఎన్టీఆర్ జీవిత చరిత్ర తెలుసుకునేలా కళాఖండాలు, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్ ఉంటాయి. ఈ బేస్ పైన 200 అడుగుల ఎత్తైన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.

# ఏపీఎస్సీఎస్సీలో 18 నోటిఫికేషన్లు

విజయవాడ, ఏప్రిల్ 25, ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ అంశం కొలిక్కి రావడంతో ఏపీలో ఉద్యోగ నియామక ప్రక్రియలో వేగం పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. మెగా డిఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదలైంది.ఎస్సీ వర్గీకరణ అంశం కొలిక్కి రావడంతో ఏపీపీఎస్సీలో పెండింగ్‌లో ఉన్న నోటి ఫికేషన్ల విడుదలకు ఏపీపీఎస్సీ సిద్ధమైంది. ఈ ఏడాది జనవరిలోనే నోటిఫికేషన్లు జారీ చేయాలని భావించినా ఎస్సీ వర్గీకరణ కార్యరూపం దాల్చక పోవడంతో నోటిఫికేషన్లు ఆలస్యమయ్యాయి.ఏపీ ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 866 పోస్టుల భర్తీకి సంబంధించి 18 నోటిఫికేషన్లు ఏపీపీఎస్సీలో పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో అటవీ శాఖకు సంబంధించి 814 పోస్టులున్నాయి.ఎస్సీ వర్గీకరణకు తగ్గట్లు అన్ని శాఖల్లో రోస్టర్ పాయింట్లు ఖరారు చేయాల్సి ఉంది. ఈ కసరత్తు పూర్తవగానే ఏపీపీఎస్సీ నోటి ఫికేషన్ల జారీ చేయాలని భావిస్తోంది.

శాఖల వారీగా భర్తీ చేయనున్న ఉద్యోగాలుఅటవీ శాఖలో సెక్షన్ ఆఫీసర్ పోస్టులు 100 ఉన్నాయి. వీటిలో 30 పోస్టులు క్యారీ పార్వర్డ్ పోస్టులుగా ఉ?నాయి.అటవీ శాఖలో బీట్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ ఆఫీసర్ పోస్టులు 691 ఉన్నాయి. వీటిలో 141 క్యారీ ఫార్వర్డ్ పోస్టులు ఉన్నాయి.

డ్రాఫ్టు మెన్ గ్రేడ్-2 టెక్నికల్ అసిస్టెంట్: పోస్టులు 13 ఉన్నాయి.వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టులు 10, దేవాదాయ శాఖలో ఈవో పోస్టులు 7, జిల్లా సైనిక సంక్షేమ అధికారుల పోస్టులు 7, ఇంటర్మీడియట్ విద్యలో లైబ్రేరియన్ పోస్టులు 2, ఉద్యానశాకలో హార్టికల్చర్ పోస్టులు 2, మత్స్య శాఖలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు 2, భూగర్భ జలశాకలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు 2, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ క్యాటగిరీ 2 పోస్టులు 2, మునిసిపల్ శాఖలో సీనియర్ అకౌంటెంట్ పోస్టులు 11, టైపిస్ట్ పోస్టులు 1, అసిస్టెంట్? మోటర్ వెహికల్ పోస్టులు 1 ఉన్నాయి. వీటితో పాటు పలు క్యారీ ఫార్వార్డ్ పోస్టులు ఉన్నాయి.

# అమల్లోకి ఇంటర్ బోర్డులో సంస్కరణలు

గుంటూరు, ఏప్రిల్ 25 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఇంటర్ విద్యలో పలు సంస్కరణలు తీసుకువస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఐదు సబ్జెక్టులకు బదులు ఆరు సబ్జెక్టులను ఎంచుకోవల్సి ఉంటుంది. అయితే విద్యార్థులు ఎంపిక చేసుకున్న ఆరో సబ్జెక్టులో ఉత్తీర్ణత తప్పనిసరి కాదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో తీసుకువచ్చిన అనేక సంస్కరణలపై సందేహాలు వ్యక్తమవుతుండటంతో బోర్డు ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. ఫస్ట్ ఇయర్‌లో పార్ట్ 1 కింద ఇంగ్లిస్ సబ్జెక్టు ఉంటుంది. పార్ట్ 2 కింద తెలుగు, సంస్కృతం, అరబిక్ ఇలా భాష సబ్జెక్టులతోపాటు గ్రూపు సబ్జెక్టులు కూడా ఉంటాయి.పార్ట్ 3లో గ్రూపు సబ్జెక్టులు ఉంటాయి. అభ్యర్థి ఎంపీసీ గ్రూపు ఎంపిక చేసుకుంటే గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం గ్రూపు సబ్జెక్టులు ఉంటాయి. అయితే విద్యార్థి ఎంపీసీ గ్రూపు తీసుకొని గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, ఇంగ్లిష్, తెలుగు చదువుతూ ఆరో సబ్జెక్టుగా జీవశాస్త్రం తీసుకున్నాడనుకుంటే జీవశాస్త్రంలో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిన అవసరం ఉండదన్నమాట. అంతేకాకుండా ఆరో సబ్జెక్టులో ఫెయిల్ అయినా ఐదు సబ్జెక్టులు పాసైనట్లు మెమో ఇస్తారు. ఒకవేళ ఆరో సబ్జెక్టులోనూ పాసైతే ప్రత్యేకంగా మరో మెమో జారీ చేస్తారు.కానీ పార్ట్2లో తెలుగు, సంస్కృతం, అరబిక్‌లాంటి భాష సబ్జెక్టులతోపాటు గ్రూపు ఆప్షనల్ సబ్జెక్టులు కలిపి మొత్తం 24 వరకు ఉంటాయి. వీటిల్లో ఏ సబ్జెక్టునైనా విద్యార్థి ఎంపిక చేసుకోవచ్చు. ఉదాహరణకు ఎంపీసీ విద్యార్థి గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ఆంగ్ల భాష సబ్జెక్టుతోపాటు జీవశాస్త్రాన్ని ఎంపిక చేసుకుంటే జీవశాస్త్రంలో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ ఐదు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత తప్పనిసరన్నమాట. వీళ్లు జేఈఈతోపాటు నీట్ పరీక్ష కూడా రాసుకోవచ్చు. ఒకే కోర్సులో ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ చదివేందుకు అర్హత లభిస్తుంది.

ఈ మేరకు ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను ప్రవేశ పెట్టడంతోపాటు ప్రశ్నపత్రాల విధానాన్ని మార్పు చేశారు. గతంలోలానే ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు ఉంటాయి. వీటిల్లో పార్ట్ 2లో ఎంపిక చేసిన సబ్జెక్టును చదువుకోవచ్చు. వీటితోపాటు విద్యార్థి ఆసక్తి మేరకు అదనంగా ఆరో సబ్జెక్టు చదువుకోవడానికి వీలుంటుంది.

# వంశీ ఇంకెన్నాళ్లు...

విజయవాడ, ఏప్రిల్ 26,గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు అరెస్టయి దాదాపు డెబ్బయి రోజులు అవుతుంది. అయినా ఆయన ఇంకా జైలులోనే మగ్గుతున్నారు. కేసుల మీద కేసులు ఆయనపై వరస పెట్టి పెడుతున్నారు. అందుకోసమే బెజవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వల్లభనేని వంశీని టీడీపీ కార్యాలయంలో ఉన్న సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల కేసులో వల్లభనేని వంశీని ఈ ఏడాది ఫిబ్రవరి 13న అరెస్ట్ చేశారు. అంటే నేటికి వల్లభనేని వంశీ అరెస్టయి దాదాపు డెబ్బయి రోజులవుతుంది. కొన్ని కేసుల్లో బెయిల్ వస్తున్నా మరికొన్ని కేసుల్లో మాత్రం బెయిల్ లభించడం లేదు. అందుకే ఆయన విజయవాడ జిల్లా జైలులోనే మగ్గిపోతున్నారు.. గన్నవరం పోలీస్ స్టేషన్ లో నమోదైన రెండు కేసుల్లో పీటీ వారెంట్లు జారీ అయ్యాయి. వారెంట్లపై నేడు విచారణ చేపట్టనున్న న్యాయస్థానం నిర్ణయాన్ని వెలువరించనుంది. కేవలం సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల కేసులతో పాటు గన్నవరం నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్స్ అక్రమ తవ్వకాలపై కూడా కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులోనూ వల్లభనేని వంశీ నిందితుడిగా ఉన్నారు. వీటికి తోడు భూ కబ్జాల ఆరోపణలపై కూడా వంశీపై అనేక కేసులు నమోదు కావడంతో ఒక దాంట్లో బెయిల్ వస్తే మరొక కేసు మెడకు చుట్టుకుంటుంది. ఫిబ్రవరి 13న... వైసీపీ అధికారంలో ఉండగా వల్లభనేని వంశీ వ్యవహరించిన తీరుపై ఆగ్రహంగా ఉన్న కూటమి ప్రభుత్వం వల్లభనేని వంశీని అరెస్ట్ చేస్తుందని ముందే తెలిసినప్పటికీ ఇలా వరస కేసులు వచ్చిపడతాయని ఊహించలేదు. సోషల్ మీడియాలో టీడీపీ క్యాడర్ ప్రభుత్వాన్ని నిలదీస్తుండటంతో ఇక ఫిబ్రవరి 13న పకడ్బందీగా కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వల్లభనేని వంశీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గన్నవరం నియోజకవర్గాన్ని వదిలేసి హైదరాబాద్ లోనే ఉంటున్నారు. అక్కడే మకాం వేశారు. అయితే పోలీసులు మాత్రం అన్నికోణాల్లో ఆలోచించి వరస కేసులు నమోదవుతుండటంతో ఇప్పట్లో వల్లభనేని వంశీ బయటకు వచ్చే అవకాశం కనిపించడం లేదు. తాను వేసిన సింగిల్ బ్యారక్ కాదని, అందరిలోనూ కలిపి ఉంచాలని, బయట నుంచి ఆహారాన్ని తెప్పించుకునేందుకు అవకాశం ఇవ్వాలని వల్లభనేని వంశీ గతంలో న్యాయస్థానాన్నిఆశ్రయించారు. అదే సమయంలో మిగిలిన ఖైదీలతో పాటు తనను ఉంచాలని కూడా కోరారు. తనకు ప్రాణభయం ఉందని కూడా వల్లభనేని వంశీ చెప్పారు. అయితే వరసగా కేసులు నమోదవుతుండటం, ఒక కేసులో బెయిల్ వచ్చినా మరొక కేసులో అరెస్ట్ చేయడానికి పోలీసులు అన్నీ సిద్ధం చేస్తున్నారు. అందుకే వల్లభనేని వంశీ ఇప్పట్లో బయటకు వచ్చేందుకు ఛాన్స్ లేదు. ఇంకా బెజవాడలోని మండుటెండలకు మరికొద్ది కాలం జైలులోనే ఉండి పోవాల్సి పరిస్థితులు ఉన్నాయంటున్నారు.

కేడర్ లోనూ నిరుత్సాహం

గత ఏడాది జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోరంగా పరాజయం పాలైన వైసీపీని చాలా మంది వదిలేశారు. కీలక రెడ్డి నాయకుల నుంచి అనేక మంది బీసీల వరకు.. కూడా పార్టీకి దూరమయ్యారు. ఈ క్రమంలో ఇప్పుడు కీలకమైన కార్యకర్తల వంతు వచ్చింది. ఏ పార్టీకైనా.. నాయకులతోపాటు.. కార్యకర్తలు చాలా కీలకం. నాయకులు జంప్ చేస్తారు..కానీ.. కార్యకర్తలు మాత్రం ఎంతో కొంత అంకిత భావంతో పార్టీలను అంటిపెట్టుకుని ఉంటారు. ఎన్నికల సమయంలోనూ..వారే కీలకం.ఈ విషయాన్ని గుర్తించే.. దాదాపు అన్ని పార్టీలూ..కార్యకర్తలే తమకు బలమని.. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని చెబుతాయి. కార్యకర్తల సెంట్రిక్‌గా అనేక కార్యక్రమాలు కూడా చేపడతాయి. అయితే.. వైసీపీ విషయానికి వస్తే.. కార్యకర్తలనను పక్కన పెట్టిన విషయం తెలిసిందే. గత వైసీపీ హయాంలో వలంటీర్లే సర్వస్వంగా అప్పట్లో సీఎం జగన్ వ్యవహరించారు. ఇది పార్టీకి మేలు చేయకపోగా.. ఓడించేసింది. తద్వారా.. పార్టీ నామరూపాలు లేకుండా పోయిందన్న చర్చ ఉంది.ఇంత పరాభవం తర్వాత.. ఒకటి రెండు సార్లు.. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తున్నానని జగన్ చెప్పుకొచ్చా రు. కానీ.. నెలలు గడిచిపోతున్నా.. ఆయన కార్యకర్తల విషయంలో ఎలాంటి నిర్ణయాలూ తీసుకోవడం లేదు. గుర్తింపు అంతకన్నా లేదు. పైగా.. టీడీపీ సహా కూటమి నాయకులు.. కార్యకర్తలపై పోరాటాలు చేయాలని పిలుపునిస్తున్నారు. ఇదే జరిగితే.. జైలుకు వెళ్తోంది.. కార్యకర్తలు, నాయకులే. కనీసం వారిని పరామర్శించడంలోనూ.. న్యాయపరంగా రక్షణ కల్పించడంలోనూ..వైసీపీ అధినేత విఫలమవుతున్నారు.ఆయా విషయాలను గమనిస్తున్న వైసీపీ కార్యకర్తలు.. ఇప్పుడు ప్లేట్ మార్చేస్తున్నారు. టీడీపీ కానీ.. జనసేన కానీ..కార్యకర్తలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని వారు గుర్తించారు. సీఎం చంద్రబాబు సైతం..తన ప్రొటోకాల్ ను పక్కన పెట్టి మరీ.. కార్యకర్తలు, నాయకుల ఇళ్లకు వెళ్లి కష్టాల్లో ఉంటున్నవారిని ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారు. భరోసా కల్పిస్తున్నారు. ఈ పరిణామాలతో వవైసీపీలో అలజడి రరేగింది. ఇంకా పార్టీని నమ్ముకుని ఇక్కడే ఉంటే కష్టమనిభావిస్తున్న వారు.. జెండా మార్చేసేందుకు రెడీ అయ్యారు. గుంటూరు, కృష్ణా, నెల్లూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక మంది కార్యకర్తలు.. గత రెండు రోజుల్లోనే టీడీపీ, జనసేనల బాటపట్టడం గమనార్హం

# క్రియాశీలక రాజకీయాల్లోకి భువనమ్మ..

నెల్లూరు, ఏప్రిల్ 25, ప్రజా నాయకుడు.. లేదా నాయకురాలు.. కావడానికి జెండా పట్టుకునే తిరగాల్సిన అవసరం లేదని.. ఈ దేశంలో అనేక మంది నిరూపించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తూ.. ప్రజల మనసుల్లో చోటు దక్కించుకున్నవారు ఎందరో ఉన్నారు. అంత మాత్రాన వారు రాజకీయా ల్లో పాల్గొని పోటీ చేయాల్సిన అవసరం ఉండదు. ఇలాంటి వారిలో నర్మదాబచావో(నర్మదా నదిని రక్షించండి) పేరుతో ఉద్యమించిన మేధా పాట్కర్ వంటివారు ఉన్నారు.ఇప్పుడు అలానే అప్రకటిత ప్రజానేతగా.. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వర నిలుస్తున్నారు. ఆమె.. ప్రజలకు చేరువ కావడం.. వారి సమస్యలు పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. నారా వారి సొంత నియోజకవర్గం కుప్పంలో ఎక్కువగా పర్యటిస్తున్నారు. నెలకు మూడు నుంచి నాలుగురోజుల పాటు అక్కడే ఉంటున్నారు. ఇక్కడ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారు. సాయం చేస్తున్నారు. అభివృద్ధి పనులు కూడా చేపడుతున్నారు.అంతేకాదు.. ఒక్కకుప్పమే అయితే.. భువనేశ్వరి గురించి.. ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఎన్టీఆర్ జిల్లా నుంచి ఖమ్మం వరకు కూడా.. ఆమె తన ప్రజా ప్రస్థానాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. కృష్ణాజి ల్లాలోని తన తండ్రి గ్రామం నిమ్మకూరులో పెద్ద ఎత్తున పాఠశాలను నిర్మిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేద విద్యార్థులను ఎంపిక చేసి.. వారికి స్కాలర్ షిప్పులు అందిస్తున్నారు. ఎన్టీఆర్ ట్రస్టును మరింత బలోపే తం చేసి.. పేదలకు, సమాజంలో అణగారిన వర్గాలకు ఆసరా చూపిస్తున్నారు.ఇదంతా స్వచ్ఛంద సేవే కదా.. ప్రజానేత ఎలా అవుతారన్న ప్రశ్నలు సహజం. అయితే.. కేవలం స్వచ్ఛం ద సేవకు మాత్రమే భువనేశ్వరి పరిమితం కాలేదు. అవసరానికి తగిన విధంగా రాజకీయ అవతారం కూడా ఎత్తుతున్నారు. గత ఎన్నికల్లో ఊరూ వాడా ప్రచారం చేశారు. ఇప్పుడు కూడా.. పీ4 పథకంపై ఆమె అంతర్గతంగా పారిశ్రామిక వేత్తలతో చర్చిస్తున్నారు. వీరిలో మహిళా పారిశ్రామికవేత్తలను ఒప్పించే పనిలో ఉన్నారు. తద్వారా.. చంద్రబాబు ఆశయాలకు దన్నుగా నిలిచే ప్రయత్నం చేస్తున్నారు. సో.. భువనేశ్వరి రాజకీయ నేత కాకపోవచ్చు.. కానీ, అప్రకటిత ప్రజానేతగా మాత్రం గుర్తింపు పొందుతున్నారనడంలో సందేహం లేదు. ఇటీవల కుప్పం డిగ్రీ కాలేజీలో భువనేశ్వరి ముఖాముఖిలో పాల్గొన్నారు. డ్రగ్స్, గంజాయి యువతను నాశనం చేస్తోందన్నారు. “వారి స్వలాభం కోసం చాలా మంది మిమ్మల్ని టెంప్ట్ చేస్తారు. చాలా జాగ్రత్తగా ఉండాలి. రోల్ మోడల్ పెట్టుకోవాలి” అని విద్యార్థులకు సూచించారు. ప్రతి పురుషుని సక్సెస్ మహిళతోనే ముడి పడి ఉంటుందన్నారు. “కాలేజ్ డేస్ గుర్తుకు వస్తున్నాయి. ఆషామాషీగా వెళ్లి మీరందరూ చేసేదే నేను కూడా కాలేజ్‌లో చేసేదాన్ని. మిమ్మల్ని చూసి గర్వంగా ఉంది. ఫ్యూచర్ ఆఫ్ ఇండియా అవర్ ఆంధ్రప్రదేశ్ లీడర్ ప్రతి ఒక్కరిలో ఉంటుంది. మీ హక్కుకోసం నడవాలి. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మీకోసం సంపాదిస్తున్నారు. అది ఈజీ కాదు. హార్డ్ వర్క్. ఏదీ ఫ్రీగా రాదు. కష్టంతోనే వస్తుంది. బాలికలకు పట్టుదల, ధైర్యం, మీమీద నమ్మకం ఉండాలి. పెళ్లి అయ్యేదాకా ఒకటి, తర్వాత మరొకటి. రాజకీయాల్లో బిజినెస్‌లో నన్ను నేను లాక్కుని ముందుకు వెళ్ళాను. మన ధైర్యం మనకుండాలి” అని వెల్లడించారు.ముందు నందమూరి కుమార్తెను.. బాబు భార్య సెకండ్. ఒక మహిళగా నేనేమిటి అనేది నాకు తెలుసు. మనందరిలోనూ ఆ శక్తి ఉంది. ఫోకస్ పనిలోపెడితే ముందుకు వెళ్ళచ్చు. హౌస్ వైఫ్ ఉన్నప్పుడు హెరిటేజ్ చూసుకోమన్నారు. నాకే ఏమీ తెలియదు. ఎండీగా బాధ్యతలు ఇచ్చారు. అందరినీ ఒకటే అనుకున్నాను. జీవితాలు బాగుంటాయి. హార్డ్ వర్క్ మీద నమ్మకం పెట్టాలి. నాన్నకంటే గొప్పవాడివి కావాలి. చేయకపోతే నీ ఫ్యూచర్ ఆగుతుంది అని నా కుమారునికి చెప్పా. మీ భవిష్యత్తు నీ చేతిలో ఉంది. ఎవరూ రారు. బద్ధకం ఉంటే జీవితంలో ఎదగలేరు. మీరే ఫ్యూచర్ లీడర్స్, ఏ రంగంలోనైనా. డిసిప్లిన్ ముఖ్యం. నాకు డిసిప్లిన్ ఎక్కువ. స్ట్రిక్ట్ నెస్ లేకపోతే నేను ముందుకు వెళ్లలేను. ఉద్యోగాలకు, ఆర్గనైజేషన్ టీమ్ వర్క్ ఉండాలి. అందరూ మనమే అంటేనే భవిష్యత్తు. సంతోషంగా కార్యక్రమం చేపట్టాలి. జీవితంలో టీచర్స్‌ను మరచిపోవద్దు. రెస్పెక్ట్ ఇవ్వాలి వారికి. అందరిలో ఉంటాయి తప్పులు. ఒక వేలు చూపిస్తే 4 వేళ్ళు మనల్ని చూపిస్తాయి. ఇవన్నీ ఎదుర్కొన్నాను నేను. వ్యాపారం, ఉద్యోగం అన్నింటిలోనూ ఆడపిల్ల దేనిలోనూ తక్కువకాదు. నా జీవితంలో చూస్తున్నాను. సోషల్ మీడియా, యూట్యూబ్ మిమ్మల్ని మీ కుటుంబం నుంచి దూరం చేస్తుంది. కుటుంబానికి ఇంపార్టెన్స్ ఇవ్వండి. ఫోన్లు, సోషల్ మీడియా కుటుంబాలకు దూరం అవుతున్నారు” అని తెలిపారు.

# బాలినేనికి చిక్కని పట్టు

ఒంగోలు, ఏప్రిల్ 25, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. అయితే తనకు పట్టున్న ఒంగోలు కార్పొరేషన్ కు చెందిన కార్పొరేటర్లను అయితే తనతో పాటు జనసేనలోకి తీసుకు వచ్చారు. అయితే మరికొందరు కీలక నేతలను పార్టీలోకి తీసుకు రావాలన్న ఆయన ఆలోచన మాత్రం కార్యరూపం దాల్చడం లేదని తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జనసేనలోకి వచ్చేందుకు ఎవరూ పెద్దగా సుముఖత వ్యక్తం చేయడం లేదని సమాచారం. అందుకే బాలినేని శ్రీనివాసులు రెడ్డి ఎంతగా ప్రయత్నించినా కొందరు నేతలు సున్నితంగా తిరస్కరిస్తుండగా, మరికొందరు నేతలు మాత్రం తాము వైసీపీని వదిలి రాలేమని తెగేసి చెబుతున్నారు. జిల్లాపై పట్టున్న నేతగా... బాలినేని శ్రీనివాసులు రెడ్డి కాంగ్రెస్ లో ఉన్నప్పటి నుంచే ప్రకాశం జిల్లాను తన చెప్పు చేతల్లో పెట్టుకుని ఉన్నారు. నాడు పీసీసీ చీఫ్ గా, తర్వాత ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డికి సమీప బంధువు కావడంతో ఆయన చెప్పిందే మాట.. చేసిందే శాసనం అన్నట్లు ఉండేది. నాటి నుంచి 2019 ఎన్నికల వరకూ బాలినేని శ్రీనివాసులు రెడ్డి చెప్పిన వారికే టిక్కెట్లు దక్కేవి. అందుకే బాలినేని అందరు నేతలతో టచ్ లో ఉంటారు. వారు కూడా బాలినేని ప్రాపకం కోసం పాకులాడేవారు. అలాంటిది 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత బాలినేని వైసీపీకి రాజీనామా చేయడం, తర్వాత జనసేనలో చేరిపోవడం ఒకరకంగా మిగిలిన నేతలకు కూడా షాకింగ్ కు గురి చేశాయి.కానీ బాలినేని శ్రీనివాసులు రెడ్డి పార్టీని వీడితే అనేక మంది నేతలు కూడా ఆయన వెంట పోలోమంటూ క్యూ కడతారని భావించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అదే ఊహించారు. అందుకే బాలినేనికి అంత ప్రాధాన్యత ఇచ్చారు. కానీ బాలినేని చేరి నెలలు కావస్తున్నా ఒక్క పేరున్న నేత కూడా ప్రకాశం జిల్లా నుంచి రాకపోవడం జనసేనలోనూ చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న పరిణామాలు, హామీలు అమలు చేయకపోవడం, తిరిగి జగన్ పుంజుకునే అవకాశాలుంటాయన్న అంచనాలు వినపడుతుండటంతో నేతలు పార్టీని వీడి వచ్చేందుకు సుముఖంగా లేరని చెబుతున్నారు. బాలినేని వదలకుండా ప్రయత్నిస్తున్నా కార్పొరేటర్లు మినహా మరో ముఖ్యనేత ప్రకాశం జిల్లాలో ఆయన వెంట రాకపోవడానికి ఇదే కారణమని అంటున్నారు. ప్రకాశం జిల్లా రాజకీయాల్లో బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక స్థానం ఉంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచి.. నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో మంత్రిగా బాలినేని పని చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు వైఎస్ జగన్ కాంగ్రెస్ పార్టీని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపించారు.దీంతో బాలినేని సైతం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి.. వైఎస్ జగన్ అడుగులో అడుగు వేసి నడిచారు. ఆయన ఒంగోలు ఎమ్మెల్యేగా ఆరుసార్లు గెలిచారు. ఇక 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి జగన్ కేబినెట్‌లో స్థానం సంపాదించారు. రెండున్నరేళ్ల తర్వాత జగన్ కేబినెట్‌ను పునర్ వ్యవస్థీకరించారు. దీంతో మంత్రి పదవిని బాలినేని కోల్పోయారు.అయితే వైఎస్ జగన్ కుటుంబంతో బాలినేనికి సమీప బంధుత్వం ఉంది. అయినా ఆయన్ని కేబినెట్ నుంచి తొలగించడంతో తీవ్ర మనో వేదనకు గురయ్యారనే గట్టి ప్రచారం అయితే జిల్లా గట్టిగానే సాగింది. అందువల్లే నాటి నుంచి పార్టీ అధిష్టానానికి ఆయన సాధ్యమైనంత దూరంగా ఉన్నారనే చర్చ సైతం సాగింది. ఇక ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారానికి దూరమైంది. ఎమ్మెల్యేగా సైతం బాలినేని ఓటమి పాలయ్యారుపార్టీ వీడేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్ వద్ద కుండ బద్దలు కొట్టారు. బాలినేనికి నచ్చ జెప్పేందుకు పార్టీ అధినేతే కాదు.. అగ్రనేతలు సైతం ప్రయత్నించారు. కానీ బాలినేని మాత్రం వారి సూచనలు సలహాలు పట్టించుకోలేదు

# చంద్రబాబు మాస్టర్ ప్లాన్

విజయవాడ, ఏప్రిల్ 25, మంద కృష్ణ మాదిగ. పరిచయం అక్కర్లేని పేరు ఇది. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉమ్మడి ఏపీలో ఆయన సుపరిచితం. జాతీయ స్థాయిలో సైతం తనదైన ముద్ర చాటుకున్నారు. ఎక్కడో ప్రకాశం జిల్లాలో 14 మంది యువకులతో మాదిగ దండోరాను ఆయన ప్రారంభించారు. ప్రతి మాదిగ గూడెంలో దండోరా జండా ఎగిరే విధంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని విస్తరించారు. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలను కొన్ని వర్గాలకే దక్కాయని.. అందరికీ విస్తరింపజేయాలన్న ధ్యేయంతో ఆయన చేపట్టిన ఉద్యమం జాతీయ స్థాయిలో సైతం కలిగితురాయిగా నిలిచింది. అందుకే అత్యున్నత న్యాయస్థానం సైతం ఎస్సీ వర్గీకరణకు జై కొట్టింది. దీంతో జాతీయస్థాయిలో సైతం మందకృష్ణ మాదిగ పేరు మార్మోగింది. ఇప్పుడు మందకృష్ణ మాదిగను రాజకీయంగా ప్రోత్సహించాలని ఎన్డీఏ నిర్ణయించుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయంలో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి విజయసాయిరెడ్డి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ పార్టీ ద్వారా తనకు లభించిన రాజ్యసభ పదవిని సైతం ఆయన వదులుకున్నారు. దీంతో ఏపీ నుంచి రాజ్యసభ పదవి ఖాళీ అయింది. ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ తరుణంలో రకరకాల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే ఈ సీటు బిజెపికి విడిచి పెట్టాలని ఆ పార్టీ పెద్దలు కోరినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు అన్నామలై పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మరోవైపు ఢిల్లీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీని సైతం ఏపీ నుంచి రాజ్యసభకు పంపిస్తారని టాక్ నడుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో మందకృష్ణ మాదిగ పేరు తెరపైకి వచ్చింది. దీని వెనుక చంద్రబాబు వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది.ఎస్సీ వర్గీకరణ చేపట్టి.. మెజారిటీ ఎస్సీ ఉప కులాల్లో ఎన్డీఏ కూటమి పార్టీలకు ఆదరణ పెరిగింది. ప్రధానంగా మాదిగ, రెల్లి ఉప కులాల నుంచి విశేష స్పందన వస్తోంది. వాస్తవానికి ఎస్సీ సామాజిక వర్గం ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన మద్దతు దారుగా ఉంది. కానీ 2024 ఎన్నికల్లో ఎస్సీల్లో స్పష్టమైన చీలిక కనిపించింది. దానిని అలాగే ఉంచుకోవాలంటే ఎస్సీ వర్గీకరణ అనేది చేయాలని చంద్రబాబు ప్లాన్. అందుకే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన మరుక్షణం.. ఎస్సీ రిజర్వేషన్ అమలు చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ నివేదిక ఇచ్చిందో లేదో అమలు చేసి చూపించారు. అదే సమయంలో ఆది నుంచి ఎస్సీ వర్గీకరణ విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు మందకృష్ణ మాదిగ అనేక సందర్భాల్లో మద్దతు తెలిపారు. అదే సమయంలో మొన్నటి ఎన్నికల్లో తెలంగాణలో సైతం బిజెపికి మద్దతు ప్రకటించారు. రెండు చోట్ల ఎన్డీఏ అభ్యర్థులు గెలుపు కోసం కృషి చేశారు. అందుకే ఇప్పుడు మందకృష్ణ మాదిగ పేరును తెరపైకి తెచ్చి.. తెలుగు రాష్ట్రాల్లో ఎన్డీఏ లబ్ధి పొందేలా ప్లాన్ చేస్తున్నారు చంద్రబాబు.వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలోఅధికారంలోకి రావాలన్నది బిజెపి ప్లాన్. అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగానే బీసీ నేత కృష్ణయ్యకు రాజ్యసభ పదవి ఇచ్చింది. ఇప్పుడు మందకృష్ణ మాదిగ కు ఇస్తే.. బీసీలతో పాటు మాదిగ సామాజిక వర్గం బిజెపి వైపు వస్తుందన్నది ప్లాన్. ఇదే విషయాన్ని బిజెపి అగ్ర నేతలకు చంద్రబాబు వివరించినట్లు తెలుస్తోంది. మంద కృష్ణ మాదిగకు రాజ్యసభ పదవి ఇస్తే తెలంగాణతో పాటు ఏపీలో రాజకీయంగా లబ్ధి పొందవచ్చని వారి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మొత్తానికైతే అనూహ్యంగా పెద్దల సభలో మందకృష్ణ మాదిగ అడుగుపెట్టడం ఖాయమని తేలుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# అమరావతి రైతులు, మహిళలకు గొప్ప అవకాశం

విజయవాడ, ఏప్రిల్ 25 ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవం కోసం ప్రధాని మోదీ వచ్చే నెల 2వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. ఈ సందర్భంగా పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ప్రధాని చేతుల మీదుగా జరగనున్నాయి. అయితే ఈ సందర్భంగా అమరావతిలో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు కూటమి సర్కార్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇక ప్రధాని సభలో రాజధాని ప్రాంత రైతులు, మహిళలకు గొప్ప అవకాశం కల్పించనున్నారు.గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్సీపీ ప్రభుత్వం 3 రాజధానుల ప్రకటన చేసిన తర్వాత.. అమరావతి ప్రాంత రైతులు, మహిళలు చేసిన అసమాన పోరాటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అమరావతిని రాజధానిగా కొనసాగించాలని.. 3 ఏళ్లకు పైగా నిరసనలు, ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేసిన సంగతి తెలిసిందే. ఇక గతేడాది జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలై టీడీపీ-జనసేన-బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి విజయం సాధించి.. అధికారంలోకి వచ్చింది. దీంతో మళ్లీ రాజధానిగా అమరావతినే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే గతంలో 2014లో అమరావతి ప్రారంభోత్సవానికి పునాది రాయి వేసిన ప్రధాని మోదీ.. ఇప్పుడు మరోసారి అమరావతి నిర్మాణంలో పాలుపంచుకోనున్నారు. ఈ క్రమంలోనే అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు మే 2వ తేదీన ప్రధాని మోదీ.. ఆంధ్రప్రదేశ్ రానున్నారు. అమరావతి రాజధాని, సీఆర్డీఏ పరిధిలో సుమారు రూ.లక్ష కోట్లతో చేపట్టే పనులకు నరేంద్ర మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పురపాలకశాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. అదే సమయంలో భారీ సభను ఏర్పాటు చేయనున్నారు. ఈ సభకు 5 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. అయితే సభస్థలి వద్ద మొత్తం 3 వేదికలు ఏర్పాటు చేయనున్నారు. ఈ సభలో అమరావతి ప్రాంత రైతులు, మహిళలకు గొప్ప అవకాశం కల్పించనున్నారు.

3 వేదికల్లో ఒకదానిపై 30 మంది అమరావతి రైతులు, మహిళలు, రాజధాని పరిరక్షణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబ సభ్యులను కూర్చునేందుకు అవకాశం కల్పించనున్నారు. 5 లక్షల మంది రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఏపీ సర్కార్ అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇక ప్రధాని మోదీ.. హెలిప్యాడ్ దిగిన తర్వాత అక్కడి నుంచి సభాస్థలానికి చేరుకునే వరకు 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా అక్కడి ఏర్పాట్లను గుంటూరు పోలీస్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్, సీఆర్డీఏ, పోలీస్ అధికారులతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు.

వాహనాలు, జనం రద్దీని నియంత్రించడం.. పార్కింగ్ సమస్యలను పరిష్కరించడంపై అధికారులకు నారాయణ సూచనలు చేశారు. మే 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని మోదీ గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుని.. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సభాప్రాంగణం వద్దకు వస్తారని తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సభ జరుగుతుందని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతిలో పర్యటించిన సీఎం చంద్రబాబు వెంటనే రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

రూ.41 వేల కోట్ల పనులకు టెండర్లు పూర్తై పనులు కూడా ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ పనులను ప్రధాని మోదీ చేతుల మీదుగా మళ్లీ ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. మొత్తం రాజధాని అమరావతిలో రూ.లక్ష కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

# తిరుపతి స్టేషన్ రూ.850 కోట్లతో అభివృద్ధి పనులు

తిరుపతి, ఏప్రిల్ 25 ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే స్టేషన్‌లు కొత్త అందాలను అద్దుకుంటున్నాయి.. అమరావతికి కీలకంగా ఉన్న రైల్వే స్టేషన్‌లకు మహర్దశ వస్తోంది. అమరావతి సమీపంలోని మంగళగిరి రైల్వే స్టేషన్‌తో పాటుగా విజయవాడ రైల్వే స్టేషన్ కేంద్రం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూపురేఖలు మారబోతున్నాయి.. అత్యాధునిక సదుపాయాలతో స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ పథకం కింద విజయవాడ రైల్వే స్టేషన్ త్వరలో విమానాశ్రయంలా మారనుంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.850 కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నారు. రైల్వే బోర్డు దీనికి సంబంధించిన డీపీఆర్‌ను ఆమోదించాల్సి ఉంది.. ఆమోదం రాగానే పనులు మొదలవుతాయి. విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నారు.విజయవాడ రైల్వే స్టేషన్ దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కీలకమైనది.. ఇక్కడ ప్రతిరోజు లక్ష మంది ప్రయాణికులు, అదే పండుగలు, సెలవు రోజుల్లో ఈ సంఖ్య రెండు లక్షల వరకు ఉంటుంది. మొత్తం 10 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి.. ప్రతిరోజు 250కి పైగా ప్రయాణికుల రైళ్లు, 80 గూడ్సు రైళ్లు విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. విజయవాడ రైల్వే స్టేషన్‌కు ఐదు ప్రవేశ ద్వారాలతో అరుదైన గుర్తింపు పొందింది. ప్రతి ఏటా ఏకంగా రూ.500 కోట్ల ఆదాయం వస్తుండటంతో గతేడాది బెజవాడ రైల్వే స్టేషన్ ఎన్ఎస్‌జీ 01 హోదా కూడా పొందిన సంగతి తెలిసిందే.ప్రస్తుతం స్టేషన్లో ఉన్న ప్రవేశ ద్వారాలు చిన్నగా ఉన్నాయి.. వాటిని వెడల్పు చేయనున్నారు. వాహనాల పార్కింగ్ కోసం ఎక్కువ స్థలం కేటాయిస్తారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లు, భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు. స్టేషన్ మొత్తం కొత్తగా కనిపించేలా మార్పులు చేస్తారు. లైటింగ్, ఎస్కలేటర్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను విశాలంగా నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నారు. అలాగే ప్రయాణికుల కోసం మంచి విశ్రాంతి గదులు, ఏసీ, నాన్ ఏసీ గదులు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. రిజర్వేషన్ కేంద్రాలు, వెయిటింగ్ హాళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర షాపులు కూడా ఉంటాయి.విజయవాడ రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు పెంచుతున్నా ప్రయాణికుల రద్దీకి సరిపోవడం లేదు. విశ్రాంతి గదులు, ప్లాట్‌ఫాంలు, లిఫ్టులు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, పార్కింగ్ స్థలం తక్కువగా ఉన్నాయి. ఈ మేరకు అమరావతి రాజధాని కావడం వల్ల రాబోయే ఐదేళ్లలో విజయవాడ స్టేషన్‌కు రద్దీ మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అందుకే అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించారు.డీపీఆర్‌కు వీలైనంత త్వరగా కేంద్రం ఆమోద ముద్ర వేసేలా రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీలు ప్రయత్నిస్తే అభివృద్ధి పనులు మొదలవుతాయంటున్నారు. అంతేకాదు అమృత్ పథకం కింద కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని రాయనపాడు, గుణదల, గుడివాడ, మచిలీపట్నం రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. గుణదల పనులు దాదాపు పూర్తికాగా.. రాయనపాడు పనులు కూడా త్వరలో పూర్తవుతాయని చెబుతున్నారు అధికారులు.

# కశ్మీర్ కొండల్లో ఉగ్రవాదులు

శ్రీనగర్, ఏప్రిల్ 25, (న్యూస్ పల్స్) జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలోని బైసరన్ వ్యాలీలో జరిగిన ఉగ్రదాడి దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించింది. లష్కర్?ఎ?తొయిబాతో సంబంధం ఉన్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) బాధ్యత వహించిన ఈ దాడిలో 26 మంది, అందులో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ పౌరుడు మరణించారు. ఉగ్రవాదులు కార్బైన్‌లు, అఓ?47 రైఫిళ్లతో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటన తర్వాత, కేంద్ర ప్రభుత్వం భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛను మంజూరు చేసింది, ఉగ్రవాదులను అంతమొందించేందుకు తీవ్ర శోధన కార్యకలాపాలను ప్రారంభించింది.పహల్గాం దాడి తర్వాత, భారత సైన్యం, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సంయుక్తంగా పూంఛ్, బారాముల్లా, పహల్గాం అడవుల్లో ఉగ్రవాదుల కోసం భారీ శోధనను ప్రారంభించాయి. హెలికాప్టర్‌లు, డ్రోన్‌లతో ప్రతి అంగుళాన్ని జల్లెడ పడుతున్నాయి. ఈ ఆపరేషన్‌లో అత్యాధునిక సాంకేతికత ఉపయోగించబడుతోంది, ఇందులో డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన నెట్రా డ్రోన్‌లు 240 డిగ్రీల కవరేజ్‌తో రియల్?టైమ్ డేటాను అందిస్తాయి. ఇజ్రాయెల్ నుంచి దిగుమతి చేసుకున్న ఇఒ/చి?2090 రాడార్ సిస్టమ్స్ 450 కిలోమీటర్ల పరిధిలో లక్ష్యాలను గుర్తిస్తాయి. ఇస్రో ఉపగ్రహాల నుంచి పొందిన రియల్?టైమ్ ఇమేజరీ ఉగ్రవాదుల స్థానాలను ఖచ్చితంగా గుర్తించడంలో సహాయపడుతోంది.

# పీఓకే విలీనమే పరిష్కారమా...

పహల్గామ్ లో ఉగ్రదాడితో అందాల కశ్మీరం... అల్లకల్లోలంగా మారింది. ఉగ్రతూటాకు ఆ ప్రాంతం అల్లాడిపోయింది. ముష్కరుల రాక్షసకాండకు 26 మంది అమాయకులు బలయ్యారు. దీంతో భారత్, పాక్ మధ్య వివాదం మరింత ముదిరింది. భారత్ సరిహద్దుల్లో ఆయుధాలు సిద్ధం చేసుకుంటూనే... పాక్‌కు వెన్నులో వణుకుపుట్టేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఖరాకండిగా పాక్‌తో దౌత్య సంబంధాలు తెంచేసుకుంది.పహల్గామ్ ఉగ్రదాడిని అమెరికా, రష్యా, చైనా, శ్రీలంక, ఇటలీ, ఇజ్రాయెల్, ఫ్రాన్స్, జర్మనీ సహా పలుదేశాలు ఖండించాయి. ఉగ్రవాదుల ఏరివేతకు, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశాలపై పోరాటంలో మద్దతుగా ఉంటామని ప్రకటించాయి. దీంతో ప్రపంచదేశాల సపోర్టుతో పాక్‌ను భారత్ ఒంటరిని చేసేందుకు ప్లాన్ రెడీ చేస్తోంది.ఇటు జీ20 దేశాల రాయబారులతోనూ భారత విదేశాంగ శాఖ భేటీ అయ్యింది. దౌత్యవేత్తలకు పహల్గామ్ ఉగ్రదాడి గురించి కళ్లకు కట్టినట్లు వివరించారు భారత విదేశాంగ అధికారులు. ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ ప్రోత్సహిస్తున్న తీరును? భారత్‌పై పాక్ పదేపదే కవ్వింపులకు దిగుతున్న పరిణామాలను దౌత్యవేత్తలకు తెలియజేశారు. పాక్ కుట్రలను ఇటు అఖిలపక్ష సమావేశంలోనూ వివరించింది కేంద్రం. రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాక్ తీరుపై అన్నిపార్టీలు కన్నెర్ర చేశాయి. పాక్ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా స్వాగతిస్తామంటూ కాంగ్రెస్ అగ్రనేతలు సైతం మద్దతిచ్చారు.పాక్ ఆక్రమిత కశ్మీర్ విలీనం' భారత్‌లో రాజకీయంగా, భద్రతపరంగా అత్యంత చర్చనీయమైన అంశం. ఈ విషయంపై భారత్‌లో ప్రభుత్వ విధానాలూ, ప్రజల భావోద్వేగాలూ గట్టి స్థాయిలో ఉన్నాయి. పహల్గామ్ ఉగ్రదాడితో మరోసారి పీఓకే విలీనంపై జోరుగా చర్చ జరుగుతోంది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దుశ్చర్యకు 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశం మొత్తాన్నిగ్రాంతికి గురిచేస్తోంది. అయితే, ఈ దాడిని పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్ తిరిగి స్వాధీనం చేసుకోడానికి మార్గం సుగమం చేసిందా? పాకిస్థాన్‌తో పూర్తిస్థాయి యుద్ధం జరిగి త్వరలోనే పీఓకే విలీనం అవుతుందా? దాయాది పాకిస్థాన్ కుట్రలకు అడ్డుకట్ట పడుతుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఈ దిశగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేయబోతుందని చెబుతున్నారు.ఇదే సమయంలో తాజాగా, ప్రముఖ జ్యోతిషుడు ఏడాది కిందట చెప్పిన జోస్యం ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. పహల్గామ్ దాడి పీఓకేలోని చాలా భూభాగాన్ని భారత సైన్యం స్వాధీనం చేసుకోడానికి కీలక అవకాశం కల్పించిందని, ఈ విషయంలో ఆర్మీ విజయం సాధిస్తుందంటూ రుద్ర కరణ్ ప్రతాప్ అనే జ్యోతిషుడు అంచనా వేశారు. గతంలో ఈయన చెప్పిన జోస్యాలు ఫలించడంతో దీనిపై నమ్మకం పెరిగింది. వాస్తవానికి గతేడాది ఏప్రిల్ మొదటి వారంలోనే ఈ జ్యోతిషుడు.. ప్రధాని మోదీ, పీఓకే స్వాధీనం గురించి జాతకం చెప్పడం విశేషం.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం కుజ మహాదశలోకి ప్రవేశించారని, మూడోసారి ఆయన పదవిలోకి వచ్చి.. దేశ భూభాగానికి సంబంధించిన వివాదాలపై దృష్టిసారించి సత్ఫలితాలు సాధిస్తారన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఏప్రిల్ 2025 నుంచి సెప్టెంబరు 2025 మధ్య భారత్‌లో విలీనం అవుతుందని 2024 ఏప్రిల్ 6న ట్వీట్ చేశారు. దీనికి ప్రత్యేక క్రెడిట్ లేదా గుర్తింపు అవసరం లేదంటూ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది.తాజాగా, పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం అప్పట్లో తాను పెట్టిన పోస్ట్‌ను జ్యోతిషుడు రీపోస్ట్ చేస్తూ.. "ఏప్రిల్ 22, 2025 నాటి సంఘటనలు ఒక కీలకమైన క్షణాన్ని సూచిస్తాయి.. పహల్గామ్‌లో జరిగిన ఒక దారుణమైన, పిరికిపంద ఉగ్రవాద దాడి రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను రేకెత్తిస్తుంది..ఈ సమయంలో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లోని గణనీయమైన భాగాన్ని భారత సైన్యం తిరిగి స్వాధీనం చేసుకుంటుంది" అని ట్వీట్ చేశారు.దేశ విభజన అనంతరం 1947లో పాకిస్థాన్ ఆక్రమించుకున్న కశ్మీర్‌లోకి కొంత భూభాగమే పీఓకే. దీనిని అధికారికంగా తమ భూభాగంగా భారత్ భావిస్తుంది. సంవిధాన పరంగా జమ్మూ కశ్మీర్ రాష్ట్రం మొత్తం భారత్‌లో భాగమే. పీఓకేను స్వాధీనం తిరిగి స్వాధీనం చేసుకోవడమే లక్ష్యమని భారత పార్లమెంటు 1994లో ఏకగ్రీవంగా తీర్మానించింది కూడా.అయితే, విలీనం అంత ఆషామాషీ కాదు. ప్రస్తుతం పాకిస్థాన్ అధీనంలో ఉన్న పీఓకేలో పాక్ సైన్యం ఆధిపత్యం చెలాయిస్తోంది. ఇటీవల అక్కడ హమాస్ నేతల పర్యటన, ఉగ్రవాద శిబిరాల ఉనికిపై భారత్‌కు ఆగ్రహాన్ని కలిగించాయి. ఉగ్రదాడుల నేపథ్యంలో ఖనీఐపై కేంద్రం మరింత దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయి. రాజకీయం-దౌత్యవరంగా: అంతర్జాతీయంగా పాక్‌పై ఒత్తిడి తెచ్చి, దానిని భారత్‌కు తిరిగి అప్పగించే మార్గం (కానీ ఇది చాలా కష్టం).రక్షణ చర్య: సైనిక మార్గంలో తిరిగి స్వాధీనం చేసుకోవడం. అయితే, ఇది పూర్తి స్థాయి యుద్ధానికి దారితీయవచ్చు.ప్రజా ఉద్యమాల ద్వారా: పీఓకే లో నివసించే ప్రజలు పాకిస్థాన్ పాలనపై అసంతృప్తిగా ఉండటం, స్వేచ్ఛను కోరడం దీన్ని భారత్ అనుకూలంగా మలచుకోవడం.

ఇటీవల కేంద్రంలోని పెద్దలు కొన్ని సందర్భాల్లో పీఓకేను స్వాధీనం చేసుకుంటామని బహిరంగంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సరిహద్దు ఉగ్రవాదంపై తీవ్ర స్థాయిలో స్పందిస్తున్న నేపథ్యంలో ఖనీఐపై మరింత దృష్టిసారించే అవకాశం ఉందని అంటున్నారు. మరి ఈ ప్రయత్నాలు ఎంతవరకు సఫలమవుతాయో? జోస్యం ఫలిస్తుందో లేదో వేచిచూడాల్సిందే.

# గూగుల్ లో ట్రెండింగ్ టాపిక్ గా పహల్గామ్

హైదరాబాద్, ఏప్రిల్ 25, జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిపై భారతదేశంలో మాత్రమే కాదు, పాకిస్తాన్‌లో కూడా వాతావరణం వేడెక్కింది. మంగళవారం అంటే ఏప్రిల్ 22న జరిగిన ఈ దాడిపై ఒకవైపు భారతదేశంలో కోపం, ఆవేదన వ్యక్తం చేస్తుంది. మరోవైపు పాకిస్తాన్ ఇంటర్నెట్ వినియోగదారులు కూడా ఈ ఘటన గురించి ఆరా తీస్తున్నారు జరుగుతున్న చర్చల్లో పాల్గొంటున్నారు. భారత్ చేపట్ట చర్యల గురించి తెలుసుకుంటున్నారు. ఈ దాడి తరువాత పాకిస్తాన్‌లోని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ చీ (గతంలో ట్విట్టర్) గూగుల్‌లో దీనికి రిలేటెడ్‌గా ఉండే కీవర్డ్స్ వేగంగా ట్రెండ్ అవుతున్నాయి. నివేదికల ప్రకారం, పాకిస్తాన్‌లోని ప్రజలు పెద్ద సంఖ్యలో 'పహల్గాం, పహల్గాం ఎటాక్, కాశ్మీర్, పుల్వామా, జమ్ము ' వంటి పదాల గురించి వెతుకుతున్నారు.ఈ ఉగ్రవాద ఘటన తరువాత భారతీయ సోషల్ మీడియాలో ఛఖజీష్ట్రజీశ్రీణజీమివతీతీనీతీతిబబింబిబిజీఞ్న, ఛటనీటతి వంటి హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతుండగా, పాకిస్తాన్‌లో కూడా ఈ దాడిపై ప్రజల ఆసక్తి కనిపిస్తోంది. సోషల్ మీడియాలో పాకిస్తాన్ వినియోగదారులు ఈ దాడిపై వేర్వేరుగా స్పందిస్తున్నారు. ఈ దాడిపై పొరుగు దేశం పాకిస్తాన్ నుంచి ఒక అధికారిక ప్రకటన కూడా వచ్చింది. పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఈ ప్రకటన విడుదల చేశారు. ఈ దాడిలో పాకిస్తాన్‌కు ఎలాంటి సంబంధం లేదని ఖండించారు. అయితే, సోషల్ మీడియాలో పాకిస్తాన్ వినియోగదారుల ప్రతిస్పందన ద్వారా ఈ ఘటన అక్కడ కూడా కలకలం రేపిందని స్పష్టమవుతోందిఅదే సమయంలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా స్పందించారు. ఉగ్రవాదాన్ని భారతదేశం సహించదని ఆయన అన్నారు. అంతేకాదు దానికి తగిన ప్రతిస్పందన ఇస్తుందని అన్నారు. అలాగే ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఢిల్లీలోని ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, 'ఈ దాడి అమానుషమైనది మాత్రమే కాదు, సిగ్గుచేటు ప్రయత్నం. దీనికి స్పందన కచ్చితంగా బలంగా ఉంటుంది. చేసిన వాళ్లనే కాకుండా దీని వెనుక ఉన్న వారిని కూడా బయటకు లాగుతాం' అని అన్నారు.గూగుల్‌లో ట్రెండ్ అవుతున్న కీవర్డ్‌లు భారతదేశం మాత్రమే కాదు, పాకిస్తాన్ ప్రజలు కూడా పహల్గాం దాడికి సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి ఆసక్తిగా ఉన్నారని స్పష్టంగా తెలుస్తోంది. సెర్చ్ ట్రెండ్స్ ద్వారా పాకిస్తాన్ పౌరులు భారత్-పాక్ సంబంధాలపై దీని ప్రభావాన్ని గురించి ఆందోళన చెందుతున్నారని వెల్లడైంది.

# కార్ బైక్ ఢీ ఒకరు మృతి



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 25 :** లక్షెట్టిపేట పట్టణంలోని ఆంధ్ర బోర్ హర్ష హోటల్ ముందు బైక్ ను కార్ ఢీకొనగా బైక్ నడుపుతున్న చెవుల రాజలింగయ్య అనే 62 సంవత్సరాల వ్యక్తి మృతి చెందాడు.మృతుని స్వస్థలం గొల్లపెల్లి మండలం అబ్బాపూర్ గ్రామం. తన కుమారుడు ఆంధ్ర బోర్,కుమార్తె గాంధి నగర్ లో ఉంటారు.శుక్రవారం రోజున ఉదయం అందాజా 10 గంటలకు తన బైక్ పై ఉత్కూర్ చౌరస్తా నుండి ఆంధ్రబోర్ లోని తన కొడుకు టైర్ల దుకాణంకు వెళుండగా వెనుకాల నుండి గుర్తు తెలియని కార్ ఢీకొట్టి వెళ్లడంతో తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు.మృతుని చిన్న కొడుకు చెవుల మహేందర్ పిర్యాదు మేరకు లక్షెట్టిపేట ఎస్సై జి సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.

# మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కేసులో మాధవరెడ్డి అరెస్ట్

మదనపల్లె రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కేసులో అన్నమయ్య జిల్లా మదనపల్లె రెడ్డీస్ కాలనీకి చెందిన వైసిపి నేత, రైస్ మిల్ మాధవ రెడ్డిని గురువారం రాత్రి తిరుపతి సిఐడి పోలీసులు అరెస్టు చేశారు. సిఐడి డిఎస్పి కొండయ్య నాయుడు కథనం మేరకు.. గత ఏడాది జూలైలో జరిగిన ఫైళ్ళ దగ్ధం కేసులో ఏ టు ముద్దాయిగా ఉన్న మాధవరెడ్డి కండిషన్ బెయిలుపై బయట తిరుగుతూ ఉన్నాడు. ఈ కేసులో ఇప్పటికే సబ్ కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతం తేజ్ ను సీఐడి అధికారులు మూడు నెలల క్రితం అరెస్టు చేయగా ఈ రోజు మాధవరెడ్డిని సిఐడి అధికారులు అరెస్టు చేసినట్లు తెలిపారు..

# యుద్ధం వస్తే.. ఎవరి బలం ఎంత.. సైన్యం ఎంత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25, భారత్ పాక్ మధ్య ఇప్పుడు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనగా.. తాజాగా పహల్గామ్ ఉగ్రదాడితో అవి తారస్థాయికి చేరుకున్నాయి. ఇప్పటికే పాకిస్తాన్‌పై అనేక ఆంక్షలు విధించిన భారత్.. కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశమై 5 కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో సింధూ జలాల పంపిణీ ఆపడం, పాక్ వాసులకు వీసాల రద్దు, అట్టారీ సరిహద్దు మూసివేత, భారత్‌లోని పాక్ అధికారుల తొలగింపు, ఇస్లామాబాద్‌లోని భారత అధికారులను వెనక్కి రప్పించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలకు ప్రతీకారంగా భారత్‌పై పాక్ కూడా అలాంటి నిర్ణయాలే తీసుకుంది. సిమ్లా ఒప్పందం రద్దు, భారత్‌తో వాణిజ్య సంబంధాలు తెంచుకోవడం, పాక్ ఎయిర్‌స్పేస్‌ను భారత్ ఉపయోగించుకోకుండా అడ్డుకోవడం, భారతీయులకు సార్క్ వీసాలు రద్దు, ఇస్లామాబాద్‌లోని భారత దౌత్య అధికారుల తగ్గింపు సహా పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొంది.భారత్‌తో పోల్చుకుంటే పాకిస్తాన్ జనాభా పరంగా, సైనిక పరంగా, ఆయుధాల పరంగా, ఆర్థిక పరంగా, రాజకీయ పరంగా, అంతర్జాతీయ సహకారం పరంగా అన్ని రంగాల్లో వెనకబడే ఉంది. ఇప్పటికే అడుక్కుతినే స్థాయిలో ఉన్న పాకిస్తాన్.. భారత్‌తో యుద్ధం వస్తే ఇంకా పాతాళానికి పడిపోతుందనే విషయం తెలిసినా.. ఆ దేశం కవ్వింపు చర్యలకు దిగుతూనే ఉంది. విదేశీ మారక నిల్వలు పూర్తిగా అడుగంటిపోయి.. రోజు గడవాలంటే విదేశాలు, విదేశీ సంస్థలు, అంతర్జాతీయ సంస్థల వద్ద చేతులు చాచి అడుక్కుంటోంది. పాక్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర పతనావస్థలో ఉంది. మరోవైపు.. అంతర్గతంగా పాక్‌లో అనేక రాజకీయ, వేర్పాటువాద సవాళ్లు ఉన్నాయి. ప్రభుత్వం, సైన్యం మధ్య కూడా సఖ్యత లేదు. ఒకవైపు ప్రత్యేక దేశం కోసం ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్న బలూచిస్తాన్.. ఇటీవలి కాలంలో పాక్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ఇలాంటి సమయంలో భారత్‌తో యుద్ధం అంటే పాకిస్తాన్ ఇంకా నష్టపోవాల్సిన పరిస్థితే ఉంటుంది.మరోవైపు.. సైనిక పరంగా, ఆయుధాల పరంగా, రక్షణ శాఖ బడ్జెట్ పరంగా చూస్తే.. భారత్‌తో అసలు పాకిస్తాన్ పోటీపడే స్థితిలో కూడా లేదు. భారత్ వద్ద 14 లక్షల మంది సైనికులు ఉండగా.. పాకిస్తాన్ వద్ద కేవలం 6.5 లక్షల మంది సైన్యం మాత్రమే ఉంది. ఇక రిజర్వ్ ఫోర్స్‌లు భారత్ వద్ద 11 లక్షలు ఉండగా.. పాకిస్తాన్‌కు కేవలం 5 లక్షలు మాత్రమే ఉంది. 2024లో భారత రక్షణ బడ్జెట్ 81 బిలియన్ డాలర్లు కాగా.. పాకిస్తాన్ రక్షణ బడ్జెట్ 11 బిలియన్ డాలర్లు మాత్రమే కేటాయించారు. ఫైటర్ జెట్‌లు (సుఖోయ్-30 ఎంకేఐ, రఫేల్) భారత్ వద్ద 600 కంటే ఎక్కువ ఉండగా.. పాకిస్తాన్ వద్ద 350 (జేఎఫ్-17, ఎఫ్-16, మిరాజ్) ఉన్నాయి.యుద్ధ ట్యాంకులు భారత్ వద్ద 4,500కు పైగా ఉండగా.. పాక్ వద్ద కేవలం 2,400 మాత్రమే ఉన్నాయి. నౌకా శక్తిలో భారత్ వద్ద 1 ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, డిస్ట్రాయర్స్, సబ్‌మెరైన్లు ఉన్నాయి. కానీ పాకిస్తాన్ వద్ద నౌకా శక్తి పరిమిత సంఖ్యలోనే ఉంది. ఇక న్యూక్లియర్ ఆయుధాలు భారత్ వద్ద 160 నుంచి 170 ఉన్నట్లు అంచనా ఉండగా.. అదే పాకిస్తాన్ వద్ద 160 నుంచి 165 అణ్వాయుధాలు ఉన్నట్లు అంచనా ఉంది. ఈ ఒక్క అణ్వాయుధాల విషయంలో మాత్రం భారత్‌ను ఢీకొట్టే సత్తా పాకిస్తాన్‌కు కనిపిస్తోంది. మిస్సైల్ శక్తిలో భారత్ వద్ద అగ్ని, బ్రహ్మోస్ వంటి అగ్రశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ మిస్సైళ్లు ఉన్నాయి. అదే పాక్ వద్ద షాహీన్, గౌరీ, బాబర్ మిస్సైళ్లు ఉన్నాయి.పహల్గామ్ ఉగ్రదాడిని భారత్ చాలా తీవ్రంగా పరిగణిస్తోంది. అంతేకాకుండా ఈ దాడి చేసిన ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తీసుకువచ్చి మట్టిలో కలిపేస్తామని.. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర హెచ్చరికలు చేశారు. కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇలాగే తీవ్రంగా స్పందించారు. నేరుగా యుద్ధమార్గాన్నే ఎంచుకోకుండా భారత్ పలు దౌత్య, ఆర్థిక పరంగా చర్యలు తీసుకుంటోంది.యుద్ధం విషయంలో భారత్ పెట్టుకున్న రూల్ మాత్రం ఎన్నటికీ మారదు. మొదట ప్రత్యర్థి దాడి చేస్తేనే.. దానికి ప్రతిస్పందించడం తప్ప.. భారత్ ఎన్నడూ మొదట యుద్ధానికి కాలు దువ్వదు. ప్రస్తుతం ఇరు దేశాల సరిహద్దుల వద్ద పర్యవేక్షణ పెరిగినా, సైన్యం, ఆయుధాలను మోహరించినా.. యుద్ధం జరగడం అనేది చివరి పరిష్కారంగా మాత్రమే రెండు దేశాలు భావిస్తున్నాయి. ఎందుకంటే ఒకసారి యుద్ధం గనక ప్రారంభమైతే.. రెండు దేశాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. సైనిక పరంగా పాక్ కంటే అత్యంత బలంగా ఉన్న భారత్.. పాక్ కవ్విస్తే తప్ప యుద్ధభూమిలో అడుగుపెట్టదు. అయితే పాక్ వద్ద అణ్వాయుధాలు భారీగా ఉండటం.. తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకసారి అణ్వాయుధాలు ప్రయోగిస్తే.. దాని వల్ల కలిగే నష్టం ఊహించడం కూడా చాలా కష్టంగా ఉంటుంది.

# పాక్కు వత్తాసు పలికిన అస్సాం ఎమ్మెల్యే అరెస్ట్..

## దేశద్రోహం కేసు నమోదు



గువహటీ పహల్గాంలో ఉగ్రదాడిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అయితే, అస్సాంలోని మంకాచార్ నియోజకవర్గానికి చెందిన ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే అమీనుల్ ఇస్లాం.. పహల్గాం ఘటనలో పాకిస్థాన్ను సమర్థిస్తున్నట్లు ఆరోపణలున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ సీరియస్ అయ్యారు. సీఎం ఆదేశాలతో ఎమ్మెల్యేని అరెస్టు చేసి, దేశద్రోహం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# కేటీ రామారావుకు ఫుల్ పవర్స్



హైదరాబాద్, ఏప్రిల్ 25, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం వచ్చే ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. ఎన్నికల్లో ఆయనే అంతా డిసైడ్ చేసేటట్లున్నారు. కేసీఆర్ పార్టీ అధినేతగా ఉన్నప్పటికీ ఆయన గౌరవం ఆయనకు ఉంటుంది. ఆయన సలహాలు, సూచనలు మాత్రమే తీసుకుంటారు. కేసీఆర్ చెప్పే వ్యూహాలను రాజకీయంగా అమలు చేయనున్నారు. అంతే తప్ప నియోజకవర్గాల్లో కేసీఆర్ జోక్యం మాత్రం ఇక ఉండకపోవచ్చని అంటున్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారు. కేసీఆర్ రాజకీయంగా యాక్టివ్ గా ఉండకపోవచ్చన్న ఊహాగానాలు గులాబీపార్టీలో జోరుగా ఊపందుకుంటున్నాయి. అదే సమయంలో కేటీఆర్ ను ప్రసన్నం చేసుకోవడానికి నేతలు కూడా క్యూ కడుతున్నారు. వచ్చే ఎన్నికలకు ముందు అంటే రానున్న ఏడాది తాను తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ వచ్చే ఏడాది పాదయాత్ర చేసిన తర్వాత కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఇప్పటికే అక్టోబరు నెలలో బీఆర్ఎస్ అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందని కూడా కేటీఆర్ ప్రకటించారు. ఇక తాజాగా కేటీఆర్ రాజేంద్ర నగర్ ఉప ఎన్నికల్లో పటోళ్ల కార్తీక్ రెడ్డి పేరును ప్రకటించడం కూడా ఈ చర్చకు కారణమయింది. ఏ మాత్రం కేసీఆర్ తో సంబంధం లేకుండా ముందుగానే, ఉప ఎన్నికల ఊసే లేకముందే అభ్యర్థిని ప్రకటించడంతో ఇంకా కారు స్టీరింగ్ కేటీఆర్ చేతుల్లోనే ఉన్నట్లు స్పష్టమయింది. కేసీఆర్ కూడా తొలి పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇక పెద్దగా ఆయన రాష్ట్రం కోసం పనిచేయాలన్న ఆకాంక్ష కూడా లేదు. దీంతో పాటు ఎక్కువ కాలం ఫామ్ హౌస్ లోనే పరిమితమవుతున్నారు. వ్యవసాయంలోనే ఆయన ఎక్కువ గడుపుతూ చాలా వరకూ సేద తీరుతున్నారు. వ్యవసాయ క్షేత్రం అంటే ఆయనకు మక్కువ. రాజకీయంలో అంచులన్నీచూశారు. పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ కు మిగిలిన రాజకీయ నేతలకు మాదిరిగా పెద్ద లక్ష్యాలు ఏవీ ఉండవు. కానీ తాను స్థాపించిన పార్టీని మరొకసారి అధికారంలోకి తీసుకు వస్తే చాలునన్న భావనలో ఉన్నారు. అందుకే ఈసారి ఎన్నికలలో కేటీఆర్ క్రియాశీలకంగా మారనున్నారు. టిక్కెట్లను కూడా ఆయనే కేటాయించనున్నారు. ఇది ఫైనల్ అంటూ గులాబీ పార్టీలే అభిప్రాయపడుతున్నాయి.

# హైడ్రా కొత్త లోగో రెడీ

హైదరాబాద్, ఏప్రిల్ 25, హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణ, ప్రకృతి విపత్తుల నిర్వహణకు ఏర్పాటు చేసిన హైడ్రా ఇకపై కొత్త లోగోతో కార్యకలాపాలను కొనసాగించనుంది. ఇప్పటి వరకూ ఈవీడీఎం లోగోతోనే పనిచేసిన హైడ్రా లోగో మార్చింది. హైదరాబాద్ నగరాన్ని సూచించేలా హెచ్ అక్షరంపై నీటి బొట్టు ఉన్న లోగోను రూపొందించారు. చెరవులను కాపాడుకుంటూ, జల సంరక్షణ చేపడుతూ హైదరాబాద్ ను విపత్తుల నుంచి రక్షించుకుందామనే సూచకంగా కొత్త లోగోను తీర్చిదిద్దారు.కొత్త లోగోను హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారికంగా ఆమోదించారు. హైడ్రా కార్యకలాపాలు, సిబ్బంది యూనిఫామ్, వాహనాలపై నూతన లోగోను ముద్రించనున్నారు. హైడ్రా అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో కొత్త లోగోను అప్డేట్ చేశారు.

బతుకమ్మ కుంటలోనే బతుకమ్మ ఉత్సవాలు

వచ్చే బతుకమ్మ ఉత్సవాల నాటికి బతుకమ్మ కుంటను సిద్ధం చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. బతుకమ్మ కుంటకు సంబంధించిన కోర్టు వివాదం మంగళవారం పరిష్కారమయ్యిందన్నారు. బుధవారం హైడ్రా కమిషనర్ అంబర్ పేటలోని బతుకమ్మ కుంటను సందర్శించారు. స్థానికుల సమక్షంలో బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు.యుద్ధ ప్రాతిపదికన ఈ చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ చెరువును పునరుద్ధరిస్తే పరిసరాలన్నీ ఆహ్లాదకరంగా మారుతాయని అన్నారు. పనులకు సహకరించాలని స్థానికులను కోరారు. ఈ కార్యక్రమానికి స్థానికులు పెద్దయెత్తున హాజరయ్యారు. అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తామని స్థానికులు కమిషనర్‌కు హామీ ఇచ్చారు.ఫిర్యాదు స్వీకరించిన 24 గంటల్లోనే మురుగు సమస్యకు హైడ్రా పరిష్కారం చూపింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలం మల్లంపేటలోని రామచంద్రయ్య కాలనీకి మురుగు ముప్పును తొలగించింది. చెన్నం చెరువు నుంచి రేళ్లకుంటకు వెళ్లే కాలువకు మధ్యలో ఆటంకాలు సృష్టించడంతో రామచంద్రయ్య కాలనీలో కొంత భాగం మురుగు ముప్పును ఎదుర్కొంది.మీటరుకు పైగా ఇళ్లు మురుగులో మునిగిపోవడంతో అక్కడి నివాసితులు ఇళ్లను ఖాళీ చేయాల్సి వచ్చింది. మురుగు నీటిలో మా ఇళ్లు నీట మునిగాయని.. నెల రోజులుగా ఇళ్లు ఖాళీ చేసి బయట తలదాచుకుంటున్నామని రామచంద్రయ్య కాలనీ వాసులు హైడ్రా ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు.

మురుగు నీటి సమస్య

దుండిగల్ మున్సిపాలిటీలోని చెన్నం చెరువుకు నిజాంపేట మున్సిపాలిటీ మురుగు నీరు వచ్చి చేరుతోందని.. ఆ నీరు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని రేళ్లకుంటకు చేరాల్సి ఉండగా ఆటంకాలు ఏర్పడ్డాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. రామచంద్రయ్య కాలనీకి పక్కన లే ఔట్ వేసిన వారు కాలువను మూసేయడంతో ఈ ఇబ్బంది తలెత్తిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు.ఈ ఫిర్యాదును గూగుల్ మ్యాప్స్‌తో పాటు శాటిలైట్ ఇమేజీలలో పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం హైడ్రా అధికారులు అక్కడకు చేరుకుని మురుగు కాలువను పునరుద్ధరించారు.దీంతో రామచంద్రయ్య కాలనీలో నిలిచిన మురుగు నీరు బయటకు వెళ్లింది. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో హైడ్రాకు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా 24 గంటలలోపే పరిష్కారం లభించడం పట్ల రామచంద్రయ్య కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

# మంత్రి వర్గం వాయిదాల పర్వంతోనే

హైదరాబాద్, ఏప్రిల్ 25, ఇదిగో.. అదిగో.. అన్నారు. కొందరైతే డేట్ కూడా ఫిక్స్ చేశారు. తీరా చూస్తే ఏదీ లేదు. వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ ఎప్పుడనేది.. అసలు అంతుచిక్కని ప్రశ్నగా మారిపోయింది. అయితే ఇప్పుడు మీనాక్షి నటరాజన్ కామెంట్స్‌తో మరోసారి కేబినెట్ అంశం తెరపైకొచ్చింది. మంత్రివర్గ విస్తరణ ఎవరి పరిధిలో ఉంటుందన్న టాపిక్‌పై తెలంగాణలో హాట్‌హాట్ డిబేట్స్ నడుస్తున్నాయిమంత్రివర్గ విస్తరణ కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూపులు.. అంతకంతకూ పెరిగిపోయిన ఆశావహులు.. కాలం గడిచిపోతున్నా పదవీ కాంక్ష నెరవేరని నాయకుల ప్రయత్నాలకు ఫుల్‌స్టాప్ పడింది. ఇప్పట్లో కేబినెట్ విస్తరణ కష్టమేనన్న సంకేతాలతో కొన్నాళ్లుగా నేతలంతా సైలెంట్ అయిపోయారు. అయితే లేటెస్ట్‌గా మంత్రివర్గ విస్తరణపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ చేసిన వ్యాఖ్యలు సరికొత్త చర్చకు తెరలేపాయి. కేబినెట్ విస్తరణ అంశం ముఖ్యమంత్రి పరిధిలో ఉందంటూ పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.ఈ కామెంట్సే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. మొన్నటిదాకా కేబినెట్ విస్తరణ అంశం కాంగ్రెస్ హైకమాండ్ చేతిలో ఉంటుందని చెబుతూ వచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులనే మంత్రిపదవి వరిస్తుందని.. ఆ నేతలు ఎవరనేది మాత్రం నిర్ణయించేది అధిష్టానమే పదేపదే చెప్పారు రేవంత్‌రెడ్డి. దీంతో ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవుల కోసం ఎంతోమంది సీనియర్లు అధిష్టానం పెద్దలను కలవడం, లేఖలు రాయడం జరిగింది.సీనియర్ నేత జానారెడ్డి కూడా హైకమాండ్‌కు లెటర్ రాశారు. రంగారెడ్డి జిల్లాకు ఛాన్సివ్వాలని ఖర్గేకు, కేసీ వేణుగోపాల్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అయితే ఓ అడుగు ముందుకేసి.. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే రాజీనామా చేస్తానంటూ పార్టీ పెద్దలకే అల్టిమేటం ఇచ్చారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టారన్న ప్రచారం జరిగింది. ఇటు నల్గొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సైతం ఢిల్లీ పెద్దలతో లాబీయింగ్ జరిపినట్లు జోరుగా ప్రచారం నడిచింది. ఇలా ఒక్కరేంటి? మంత్రివర్గంలో చోటు దక్కించుకోవాలన్న తపనతో ఎందరో నేతలు హస్తినబాట పట్టారు.మరికొందరు విజ్ఞప్తి లేఖలు ఢిల్లీకి పంపారు.మొత్తంగా? కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ ఒకలా.. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మరోలా మాట్లాడటంతో నేతలంతా కన్‌ఫ్యూజన్‌లో పడ్డట్లు తెలుస్తోంది. మరీ ఈ కేబినెట్ విస్తరణ కన్‌ఫ్యూజన్‌పై క్లారిటీ రావాలంటే కాస్త ఆగాల్సిందే..!

# అంగట్లో సరుకుల్లా బర్త్ సర్టిఫికేట్లు.. రూ.15 వేలు

హైదరాబాద్, ఏప్రిల్ 25, దేశంలో ఉగ్రదాడి అలజడి రేపిన సమయంలో తెలంగాణలోని కొందరు ఉద్యోగుల తీరు ఆందోళన కలిగిస్తోంది. కొందరు ఉద్యోగులు డబ్బు కోసం ఎంతకైనా తెగించి అంగట్లో సరుకుల్లా ఎవరికైనా బర్త్ సర్టిఫికేట్లు జారీ చేసే స్థాయికి దిగజారడం దేశ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తుంది. ప్రభుత్వ యంత్రాంగంలోని కొందరు వ్యక్తులు స్వార్థపూరితంగా వ్యవహరించడం వల్ల దేశ భద్రత ప్రమాదంలో పడుతోంది. వ్యవస్థలోని అవినీతిని, బాధ్యతారాహిత్యాన్ని కూడా తెలియజేస్తున్నాయి.దేశంలో అక్రమంగా ప్రవేశించిన ఇద్దరు బంగ్లాదేశీయులకు నకిలీ బర్త్ సర్టిఫికేట్లు, ఆధార్ కార్డులు జారీ చేసి వారు పాస్‌పోర్ట్ పొందేలా చేసిన ఘటనలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నార్సింగి మున్సిపాలిటీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి జి.సుధీర్ కుమార్ , మహ్మద్ ముఖీబ్, టి.సాయి కిరణ్, జి.రంజనీకాంత్ , బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ హసిబుల్, రోహన్ షాలను అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ప్రధాన నిందితుడు హసిబుల్ ఢాకా నుంచి నాలుగేళ్ల క్రితం రూ.25 వేలు చెల్లించి అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించాడు. కోల్‌కతాలో జోవన్ చౌదరి అనే నకిలీ పేరుతో ఆధార్ కార్డు పొందాడు. అక్కడ కరాటే కోచ్‌గా పనిచేస్తూ.. 2023లో మలక్‌పేట్‌కు చెందిన జయాచౌదరితో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం పెంచుకున్నాడు. తాను కోల్‌కతా పౌరుడినంటూ నమ్మించి ఆమెను వివాహం చేసుకున్నాడు.మలక్‌పేట్‌లో నివాసం ఉంటున్న హసిబుల్.. నార్సింగి మున్సిపాలిటీ ఉద్యోగి సుధీర్‌కు రూ.15,000 లంచం ఇచ్చి నకిలీ జనన ధ్రువీకరణ పత్రం సేకరించాడు. తరువాత ఓటరు కార్డు కూడా పొందాడు. ఇదే మార్గంలో బంగ్లాదేశ్‌కే చెందిన రోహన్ షాకూ నకిలీ బర్త్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు ఇప్పించాడు. వీరిద్దరూ పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేయగా.. అనుమానాస్పదంగా ఉండటంతో టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగింది. మఫ్టీలో నార్సింగి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లిన పోలీసులు ఫేక్ బర్త్ సర్టిఫికేట్ కావాలని అడగగానే సుధీర్ అంగీకరించడంతో బండారం బయటపడింది. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి మలక్‌పేట్ పోలీసులకు అప్పగించారు.

# మే రాకుండానే మండుతున్న సూరీడు

అదిలాబాద్, ఏప్రిల్ 25, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత వారం రోజులుగా ఎండ తీవ్రత పెరిగిపోయింది. నిప్పుల కొలిమిలా మారిపోయింది. బుధవారం గరిష్టంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో జిల్లాలో ఉదయం నుంచే భానుడు?. భగభగలా మండిపోతున్నాడు.దీంతో జిల్లాలోని ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో సైతం మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మూడు రోజులుగా అన్ని మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో అధికారులు ఆరెంజ్, రెడ్ అలర్ట్ జారీ చేశారు.ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పెళ్లిళ్లు, శుభకార్యాలకు వెళ్లేందుకు కూడా జనాలు జంకుతున్నారు. దాహం తీర్చుకునేందుకు చల్లని శీతల పానీయాల వైపు మొగ్గుచూపుతున్నారు. కొంత మంది వడదెబ్బకు గురై ఆసుపత్రుల పాలవుతున్న సంఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ లోని పలు ప్రాంతాలో ఐదు మంది వడ దెబ్బతో మృతి చెందినట్లు తెలిసింది.ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీలను విపరీతంగా వాడుతున్నారు. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తల ను పాటిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఇంట్లోంచి బయటకు రావడం లేదు.ఏప్రిల్ నెలలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఉంది. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. రానున్న మే మాసంలో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళనలో జనాలు ఉన్నారు. రోహిణి కార్తె నాటికి పరిస్థితి మరింత మారిపోయే అవకాశం ఉంది.

ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి?.

వేసవిలో వడదెబ్బ నుంచి రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు. తలనొప్పి, వికారం, కళ్లు తిరగడం, వాంతులు చేసుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదిచాలని హెచ్చరిస్తున్నారు. ప్రతీరోజూ 5 నుంచి 6 లీటర్ల నీటిని తాగాలని, శీతల పానీయాలకు బదులు మజ్జిగ, నిమ్మ, పండ్ల రసాలు తాగడం ఉత్తమమని అంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఎండలో ప్రయాణం చేయకూడదని సూచిస్తున్నారు.

# ప్రపంచం మలేరియా దినోత్సవం

**2030 వరకు మలేరియా వ్యాధి ని పూర్తిగా నిర్మూలించ వచ్చు**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ**

**డా.సి.ఉమా గౌరీ**






**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 25:** ప్రపంచం మలేరియా దినోత్సవం సందర్భంగా ఉప్పల్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం 2025 కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా .సి ఉమా గౌరీ ముఖ్య అతిధిగా వచ్చి జండా ఊపి ర్యాలీ ని ప్రారంభిచారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా .సి ఉమా గౌరీమాట్లాడుతూ,

ప్రతి ఒక్కరూ మలేరియా ఎలా వస్తుందో అవగాహన కలిగి ఉండాలని దోమలు వ్యాపించ కుండా చర్యలు తీసుకోవాలని అందుకు ప్రతి ఒక్క ఆశ కార్యకర్తలు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

జిల్లా ప్రోగ్రామ్ అధికారి (ఎన్వీబీడీసీపీ) డా వై శ్రీదేవి మాట్లాడుతూ దోమలు పెరగకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అందుకోసం ప్రతి రోజూ నిలవ ఉన్న నీటిని శుభ్రం చేసుకోవాలని కూలర్ లలో,నీటి తొట్టిలో, కొబ్బరి చిప్ప లలో, ఇతర వాటిల్లో నీరు నిలువ ఉండ కుండా చూడాలని వీటిపై అవగాహన కల్పించ వలసిన గురుతర భాద్యత ఆశ లపై ఆరోగ్య సిబ్బంది పై ఉందని అన్నారు. అందరూ కలిసి కట్టుగా అంకిత భావంతో పనిచేస్తే 2030 వరకు మలేరియా వ్యాధి ని పూర్తిగా నిర్మూలించ వచ్చు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిణి డా శోభ రాణి

,డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిణి. డా .సత్యవతి ,

జిల్లా ప్రోగ్రామ్ అధికారులు ,

ఉప్పల్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం లో పనిచేస్తున్న ఆశ వర్కర్లు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాలపై సమీక్ష నిర్వహించిన సిపి అంబర్ కిషోర్ జా



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 25:** మందమర్రి సర్కిల్ కార్యాలయంలో నకిలీ పత్తి విత్తనాలపై సమీక్ష సమావేశాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా (డి.ఐ.జి) ఐపిఎస్ నిర్వహించారు. శుక్రవారం బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నకిలీ పత్తి విత్తనాల అంశం పై వివరాలను అరా తీశారు. అనంతరం మందమర్రి సర్కిల్ కార్యాలయాన్ని, పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి, సిబ్బంది బాగోగులు తెలుసుకొని, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఎ.భాస్కర్ ఐపిఎస్, బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, పట్టణ సిఐ కాసర్ల శశిధర్ రెడ్డి, ఎస్ఐ శివనీతి రాజశేఖర్ లు పాల్గొన్నారు.

## అఘోరి అరెస్ట్... విచారణ... హై డ్రామా..

మెదక్, ఏప్రిల్ 25,ఘోరీ.. తెలుగు రాష్ట్రాల్లో కొన్నాళ్లుగా హల్‌చల్ చేస్తోంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన యువకుడు శ్రీనివాస్ అఘోరీగా మారినట్లు ప్రచారం చేసుకుంటున్నాడు. శ్మశానంలో పూజలు, రోడ్లపై హల్‌చల్ చేస్తూ.. పోలీసులను, సామాన్యులను ఇబ్బంది పెడుతున్నాడు. ఇటీవల ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడు. అఘోరిపై పోలీసులకు ఫిర్యాదులు అందడంతో అరెస్టు చేశారు. అతడిని జైలుకు తరలించే క్రమంలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.తెలుగు రాష్ట్రాల్లో కొన్నాళ్లుగా హల్‌చల్ చేస్తున్న అఘోరీ తెలంగాణలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి. అతడి వయసు 27 ఏళ్లు. కేదార్‌నాథ్‌లో సాధువుగా జీవిస్తున్నాడు. అతను తన కలలో 'అర్ధనారీశ్వర' రూపాన్ని చూసినట్లు పేర్కొన్నాడు, దీని స్ఫూర్తితో లింగ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకోవాలని నిర్ణయించాడు. ఈ ప్రక్రియ రెండు దశల్లో జరిగినట్లు వైద్యులు గుర్తించారు.

చెన్నైలో మొదటి శస్త్రచికిత్స..

మొదటి దశలో, అతని శరీరం నుంచి కొన్ని పురుష అవయవాలు (పురుష జననేంద్రియాలు) తొలగించబడ్డాయి. ఈ శస్త్రచికిత్స తర్వాత అతను ఇండోర్‌కు తిరిగి వచ్చి, తన ఆధార్ కార్డు, పాన్ కార్డు వంటి అధికారిక పత్రాలను నవీకరించాడు.జూన్ 28, 2024న, ఇండోర్‌లోని భండారీ హాస్పిటల్‌లో డాక్టర్ అశ్విన్ దాస్ (ప్లాస్టిక్, కాస్మెటిక్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్) నేతృత్వంలో ఐదు గంటల పాటు జరిగిన శస్త్రచికిత్సలో అతను పురుషుడి నుంచి స్త్రీగా పూర్తిగా మార్పిడి చెందాడు. ఈ శస్త్రచికిత్స విజయవంతమైనట్లు వైద్యులు ప్రకటించారు. అయితే, వైద్యులు అతను 'అర్ధనారీశ్వర' రూపాన్ని సాధించినట్లు పేర్కొన్న ఊహాగానాలను ఖండించారు, ఇది కేవలం లింగ మార్పిడి శస్త్రచికిత్స అని స్పష్టం చేశారు.

అఘోరీలు శైవ సంప్రదాయంలో భాగమైన సాధువులు, వారు సాంప్రదాయిక సామాజిక నిబంధనలను తిరస్కరించి, ఆధ్యాత్మిక మోక్షం కోసం తీవ్రమైన సాధనలు చేస్తారు. అఘోరీ సంస్కృతిలో 'అర్ధనారీశ్వర' ఒక పవిత్ర భావన, ఇది పురుష, స్త్రీ శక్తుల సమన్వయాన్ని సూచిస్తుంది. ఈ సాధువు తన లింగ మార్పిడిని ఈ ఆధ్యాత్మిక ఆదర్శంతో ముడిపెట్టినప్పటికీ, ఇది అఘోరీ సంప్రదాయంలో సాధారణ ఆచారం కాదు. అఘోరీలు సాధారణంగా శారీరక మార్పుల కంటే మానసిక, ఆధ్యాత్మిక సాధనలపై దృష్టి పెడతారు.

లింగ మార్పిడి శస్త్రచికిత్స లేదా జెండర్ అఫర్మేషన్ సర్జరీ, ఒక వ్యక్తి యొక్క శారీరక లక్షణాలను వారి లింగ గుర్తింపుకు అనుగుణంగా మార్చే వైద్య ప్రక్రియ. ఈ సాధువు విషయంలో, అతను పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈ ప్రక్రియలో సాధారణంగా ఈ క్రింది దశలు ఉంటాయి.వైద్య పరీక్షలు: శస్త్రచికిత్సకు ముందు, రోగి యొక్క శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి హార్మోన్ స్థాయిలు, రక్త పరీక్షలు, మానసిక సంప్రదింపులు నిర్వహించబడతాయి. జెండర్ డిస్ఫోరియా (లింగ గుర్తింపు వల్ల కలిగే మానసిక ఒత్తిడి) నిర్ధారణ కీలకం.హార్మోన్ థెరపీ: ఈస్ట్రోజన్, ప్రొజెస్టెరోన్ వంటి హార్మోన్లను నిర్వహించడం ద్వారా స్త్రీ లక్షణాలను పెంపొందించడం. ఈ సాధువు హార్మోన్ థెరపీ తీసుకున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి.


జైలులో హైడ్రామా..

ఇదిలా ఉంటే.. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన అఘోరీ శ్రీనివాస్, శ్రీవర్షిణీ కేసు జైలు వరకూ వివాదాస్పదంగా మారింది. మోసం కేసులో అరెస్టయిన అఘోరీ, జైలులో తన భార్య వర్షిణీని తన వద్దే ఉంచాలని రచ్చ చేయడం, ట్రాన్స్‌జెండర్ గుర్తింపు వల్ల జైలు అధికారులు ఎదుర్కొన్న సమస్యలు ఈ కేసును మరింత ఆసక్తికరంగా మార్చాయి.అఘోరీ శ్రీనివాస్, ఒక మహిళా నిర్మాతను పూజల పేరుతో రూ.10 లక్షలు తీసుకుని మోసం చేసిన ఆరోపణలతో మోకిలా పోలీసులచే అరెస్టయ్యాడు. ఫిర్యాదు ఆధారంగా, పోలీసులు అతన్ని ఉత్తరప్రదేశ్‌లో అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించారు. రెండు గంటల పాటు విచారణ తర్వాత, అతన్ని చేవెళ్ల కోర్టులో హాజరు చేయగా, న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.సంగారెడ్డి జిల్లాలోని కంది సబ్ జైలుకు తరలించినప్పుడు అఘోరీ శ్రీనివాస్ అరుపులు, కేకలతో హైడ్రామా సృష్టించాడు. తన భార్య శ్రీవర్షిణీని తనతోనే ఉంచాలని, ఆమె లేకుండా తాను ఉండలేనని గట్టిగా అరిచాడు. అతని ప్రవర్తనతో జైలు సిబ్బంది, పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అఘోరీ తన భార్యతో ఒకే బ్యారక్‌లో ఉండాలని డిమాండ్ చేయడం వివాదానికి కారణమైంది.రిమాండ్ ప్రక్రియలో భాగంగా అఘోరీని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించగా, వైద్యులు అతన్ని ట్రాన్స్‌జెండర్‌గా గుర్తించారు. ఈ గుర్తింపు కారణంగా కంది సబ్ జైలు అధికారులు అతన్ని జైలులోకి అనుమతించడానికి నిరాకరించారు. అఘోరీని మహిళా ఖైదీల బ్యారక్‌లో ఉంచాలా, పురుష ఖైదీల బ్యారక్‌లో ఉంచాలా అనే సందిగ్ధంతో జైలు అధికారులు పోలీసులకు తిరిగి అప్పగించారు. మరోసారి లింగ నిర్ధారణ పరీక్షల తర్వాత, కోర్టు సూచనల మేరకు అఘోరీని చంచల్‌గూడజైలుకు తరలించారు

# ఆపరేషన్ కర్రెగుట్ట...

ఖమ్మం, ఏప్రిల్ 25,: కర్రెగుట్ట చుట్టూ యుద్ధవాతావరణం నెలకొంది. ఆపరేషన్ కగార్ పేరుతో 20 వేల మంది భద్రతా బలగాలు తెలంగాణ?ఛత్తీస్ గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టను చుట్టుముట్టాయి. అదే సమయంలో హెలిక్యాప్టర్ ద్వారా ఆపరేషన్ కూడా నడుస్తోంది. మూడు రోజులుగా ఈ ఆపరేషన్ నడుస్తోంది. కర్రె గుట్టపై దాదాపు వెయ్యి మంది మావోయిస్టులు డెన్ ఏర్పాటు చేసుకున్నట్టు సీఆర్పీఎఫ్ అనుమానిస్తోంది. కర్రెగుట్టపై ది మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత హిడ్మా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆపరేషన్ కగార్ పేరుతో ఇప్పటి వరకు దండకారణ్యంలోని అబూజ్ మడ్ ప్రాంతాన్ని దాదాపుగా స్వాధీనం చేసుకున్నాయి కేంద్రబలగాలు. అబూజ్ మడ్ కు ఆనుకొని కర్రెగుట్ట మొదలవుతుంది.కర్రెగుట్టకు సంబంధించి.. బీజాపూర్ జిల్లాలోని ఊసూరు బ్లాక్, ఆవు పల్లి, పూజారి కాంకేడ్ ప్రాంతాలు ఛత్తీస్ గఢ్?లో ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాలకు విస్తరించి ఉన్నాయి. కర్రె గుట్టలపై తెలంగాణలో పాముడూరు, తడపల, జెల్ల, డోలి, చెలిమల, బండారు పల్లి, ముకునూరు గ్రామాలుండేవి. ఈ గ్రామాలను గతంలోనే ఖాళీ చేయించి వారికి వేరే ప్రాంతాల్లో పునరావాసం కల్పించారు. అయితే పెనుగోలు గ్రామస్తులు మాత్రం అక్కడే ఉన్నారు.ఆబూజ్ మడ్ పై కేంద్ర బలగాలు ఆపరేషన్ మొదలు పెట్టగానే మావోయిస్టులు సమీపంలోనే ఉన్న కర్రెగుట్టకు మారినట్టు తెలెస్తోంది. ఇక్కడ డెన్ లు ఏర్పాటు చేసుకొని ఆయుధాలను దాచినట్టు చెబుతున్నారు. ఇక్కడికి పోలీసులు, భద్రతా బలగాలు రాకుండా గుట్ట చుట్టూ ల్యాండ్ మైన్స్ పెట్టినట్టు సమాచారం. పలువురు ఆదివాసీలు వేట కోసం కర్రెగుట్టకు వెళ్లి ఇటీవల మృత్యువాత కూడా పడ్డారు.మావోయిస్టులు కర్రెగుట్టపై డెన్ ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం అందుకున్న కేంద్ర బలగాలు స్పెషల్ ఆపరేషన్ కు శ్రీకారం చుట్టాయి. మూడు వైపుల నుంచి గుట్టను చుట్టుముట్టాయి. దీంతో పాటు హెలిక్యాప్టర్లు, డ్రోన్ల ద్వారా అణువనువూ తనిఖీ చేస్తున్నాయి. అబూజ్ మడ్ పరిధిలోని ఆదివాసీ గూడేలకు రోడ్లు వేసుకుంటూ ఆపరేషన్ మొదలు పెట్టిన సీఆర్పీఎఫ్ బలగాలు ప్రస్తుతం కర్రెగుట్ట వద్దకు చేరుకున్నాయి. అయితే ఈ ఆపరేషన్ రాష్ట్ర పోలీసులకు సంబంధం లేకుండా జరుగుతోంది. అదే విధంగా ఫారెస్టు అధికారులు సైతం కర్రెగుట్ట వైపు రావద్దంటూ సీఆర్పీఎఫ్ ఆదేశాలు జారీ చేసింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వరకు స్థానిక పోలీసులు ఎంటర్ అయ్యే అవకాశం లేదు.మావోయిస్టులు కర్రెగుట్టను సేఫ్టీ ప్లేస్?గా భావిస్తున్నారు. ఇదొక గుట్టల సముదాయం.. ఒక గుట్ట దిగగానే కొంత మైదాన ప్రాంతం ఉంటుంది.. ఆ వెంటనే గుట్ట స్టార్ట్ అవుతుంది. గుట్టల కింద సహజ సిద్ధంగా ఉండే బంకర్లు, సొరంగ మార్గాలున్నాయి. ఒక్కో బంకర్ చాలా విశాలంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. సెలయేళ్లు కూడా ప్రవహిస్తూ ఉంటాయి. మూడు కాలాలూ నీటి వసతి ఉంటుందని అంటున్నారు. అయితే అబూజ్ మడ్?ను సీఆర్పీఎఫ్ బలగాలు స్వాధీనం చేసుకున్న దరిమిలా.. మావోయిస్టులు కర్రెగుట్టలను సేఫ్టీ ప్లేస్ గా భావించే భారీ మొత్తంలో ఆయుధాలను తీసుకొని ఇక్కడికి వచ్చి ఉంటారని తెలుస్తోంది. ఇక్కడే డెన్ ఏర్పాటు చేసి ఉంటారనే అనుమానాలున్నాయి.ఆపరేషన్ కగార్?లో భాగంగా కర్రెగుట్టపై బేస్ క్యాంప్ ఏర్పాటు చేసుకొనేందుకు సీఆర్పీఎఫ్, భద్రతా బలగాలు రెడీ అవుతున్నాయి. ఇక్కడ ఆయుధాలను భద్రపర్చిన మావోయిస్టులు తిరిగి వస్తే వారిని పట్టుకోవడమే ఈ బేస్ క్యాంప్ లక్ష్యమని అంటున్నారు. ఈ ఆపరేషన్ మూడు నెలల పాటు కొనసాగుతుందని తెలుస్తోంది. ఏది ఏమైనా మావోయిస్టుల ఏరివేతలో ఇది అతి పెద్ద ఆపరేషన్ గా చెబుతున్నారు.

# భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ -నేడు ఆయన వర్ధంతి




అపారమైన మేధస్సుతో భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త మన శ్రీనివాస రామానుజన్. 1887 డిసెంబర్ 22న తమిళనాడులోని ఉత్తర అర్కాట్ జిల్లా ఈరోడ్‌లో ఓ నిరుపేద కుటుంబంలో పుట్టాడు. ఆయన తలిదండ్రులు కోమలమ్మాళ్, శ్రీనివాస అయ్యంగార్. పన్నెండేళ్ల వయసులోనే అసాధారణ బాలునిగా గుర్తింపు పొందిన రామానుజన్ 'ఆయిలర్' సూత్రాలు, త్రికోణమితికి చెందిన అనేక సమస్యలను స్వయంగా సాధించాడు. రామానుజన్‌లోని తెలివితేటలను బయటకు తీసుకువచ్చిన గ్రంథం కార్ రాసిన 'సినాప్సిస్', అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్ద పెద్ద ప్రొఫెసర్‌లు సైతం ఎన్నో పుస్తకాలు రిఫర్ చేసినా అర్థం చేసుకోలేకపోయిన సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవాడు. అప్పటికే అందులో చాలా సమస్యలు నిరూపించబడ్డాయన్న విషయం తెలియకపోవడంతో వాటిని తన పద్ధతితో సాధించాడు.కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ ఎఫ్.ఎ. పరీక్ష తప్పాడు. తర్వాత మద్రాస్‌లోని వచ్చయ్యప్ప కాలేజీలో చదువుకు చేరాడు. అక్కడ గణితోపాధ్యాయునిగా ఉన్న ఎన్.రామానుజాచారి సమస్యలను కఠినంగా చెప్తుంటే, రామానుజన్ వాటిని తనదైన రీతిలో తక్కువ సోపానాలతో సాధించే వాడు. రామానుజన్ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. తర్వాత రామానుజం 1909లో జానకి అమ్మాళ్‌ను పెళ్లి చేసుకున్నాడు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై పరిశోధనలు కొనసాగించేవాడు. 1913లో మద్రాస్ పోర్ట్‌ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా?వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్డ్ హార్డి (1877-1947)కి పంపాడు. ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి.హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు. అక్కడ రాత్రనకా, పగలనకా గణితం పైనే ఏకాగ్రత పెట్టి కొత్త సిద్ధాంతాలను కనిపెట్టాడు రామానుజన్. ఫిబ్రవరి 28, 1918లో 'ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ' గౌరవం పొందిన రెండవ భారతీయుడిగా, 1918 అక్టోబర్‌లో 'ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి' గౌరవం పొందిన మొదటి భారతీయుడిగా చరిత్రకెక్కాడు. 1919 మార్చిలో భారతదేశానికి తిరిగి వచ్చాడు. మనదేశ ఔన్నత్యాన్ని జగతికి చాటిన రామానుజన్, అనారోగ్య కారణంగా చివరకు ఏప్రిల్ 26, 1920న అస్తమించాడు. అప్పటికి ఆయన వయసు 33. చివరిదశలో 'మ్యాజిక్ స్క్వేర్', 'ప్యూర్ మాథ్స్‌కు చెందిన నంబర్ థియరీ', 'మాక్ తీటా ఫంక్షన్స్' చాలా ప్రసిద్ధి పొందాయి. వీటి ఆధారంగా ఆధునికంగా కనుగొన్న స్ట్రింగ్ థియరీ, క్యాన్సర్ పరిశోధనలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని 1986-87 రామానుజన్ శతజయంతి ఉత్సవాల్లో గణిత శాస్త్రవేత్తలు ప్రకటించారు. రామానుజన్ నోటు పుస్తకాలపై, గణిత సిద్ధాంతాలపై రామానుజన్ ఇనిస్టిట్యూట్‌లో, అమెరికాలోని 'ఇలినాయిస్' యూనివర్సిటీలో నేటికీ రీసెర్చ్ జరుగుతోంది. గణితశాస్త్రంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును 'జాతీయ గణితదినోత్సవం'గా ప్రకటించింది.

# బాబోయ్ ఉచిత ఆర్ టిసి ప్రయాణం పథకం వద్దు

కొడిమ్యాల,ఓ అవ్వా!ఎటుపోతున్న వే సంచులు బాగా పట్టుకుని పోతున్నావు అని అడిగింది లచ్చమ్మ నర్సమ్మను ఎటు లేదవ్వ గా జగిత్యాల లో ఉల్లిగడ్డలు, ఎల్లి పాయలు ఇక్కడికన్నా అగ్గో అత్తున్నాయట గాడికోయ్యి తీసుకొద్దామని పోతున్నా అని చెప్పింది నర్సవ్వ అయ్యో గట్లనా జర్ర ఆగరాదు నేనుకూడా అత్త సంచులు పట్టుకొని అన్నది లచ్చవ్వ ఇద్దరు కలసి బస్టాండ్ కాడి కెళ్ళి నిలవడి బస్ కోసం ఎదురు సూడంగానే వాళ్ళ ఇంటి దగ్గర ఉన్న ఎల్లవ్వ కనిపించింది. ఓ ఎల్లవ్వ నువ్వేటు పోతున్నావే బస్సు కాడికచ్చినవ్ అనంగానే ఎటులేదే మీరు మాట్లాడుకునేది ఇన్నానే నేను గూడ ఉల్లి గడ్డలు కొంకుందామని అచ్చిన అన్నది నీ బస్ ఇంకా అత్తలేదు గీ బస్సు ఎప్పుడు అత్తదో ఏమో అని అటు ఇటు సూడంగానే కట్టే పట్టుకుని అటు ఓ ముసలయ్య అచ్చిండు. అగో గీ తాతమన రాములు తాత లెక్కనే ఉన్నాడు.ఓ రాములు తాతా ఏడికే పోతున్నావు గీ బస్సు దగ్గరికి అచ్చినవ్ అని అడగంగానే జగితలా పొయ్యత్త బిడ్డా!ఓ రెండు ధోతుల జోడలు కొంకచ్చు కుంటా అని అచ్చిన గాని మమ్మల్ని బస్సు యెడ ఎక్కనిత్తండ్లు మొత్తం ఆడోళ్ళ తోటే నిండి పాయె మేము ఎక్కి నంక నిలువడి నిలవడి సచ్చేంత పనవుతుంది అనగానే ఎల్లవ్వ ఇంకా నయ్యం నీ పని నయ్యముంది ఇప్పుడు, ఇప్పుడు మా ఆడోళ్ళను సూడంగానే బస్సు ఆపకుంటా బుర్రుమని పోతుండ్లు ఆర్టీసీ వాళ్లకు కూడ అర్థమయ్యింది వీళ్లంతా అట్టి పనులకు కూడ బస్సులల్ల తిరుగుతుండ్లని అందుకే గీ ఉచిత పథకం ఏది ఇచ్చిన ప్రజలను మెప్పించే విధంగా ఉండి ప్రజలకు కూడ బాధ్యత కల్పించే విధంగా ఉంటే బాగుంటుంది అని చెప్పు కుంటపోతుంది ఎల్లవ్వ అంతలోనే బస్సు హారన్ వినిపించింది. బస్సు వచ్చి ఆగగానే ఒకళ్ల మీద ఒకళ్ళు పడి బస్సు ఎక్కారు.

## మాదకద్రవ్యాల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలి::జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**మండల స్థాయిలో డ్రగ్స్ నియంత్రణపై సమావేశాలు నిర్వహించాలి**

**గ్రామాలలో గంజాయి పై సమాచారం అందితే వెంటనే పోలీసులకు తెలియజేయాలి**

**మాదక ద్రవ్యాల పై జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశం నిర్వహించిన కలెక్టర్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్-25 (ప్రజా బలం ప్రతినిధి)**మాదకద్రవ్యాల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని ఎస్పీ మహేష్ బి గీతే తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ ముఖ్య ప్రణాళిక అధికారి ప్రస్తుతం క్రాప్ కటింగ్ పరిశోధనలు జరుపుతున్నారని, వీరితో సమయం చేసుకుంటూ ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతుందో పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు.పాఠశాలలో ముగుస్తున్నందున పరిసరాల్లో ఉన్న పాన్ షాప్ వంటి వాటి పై నిఘా పెట్టాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా చూడాలని అన్నారు. ప్రతి మండలంలో తహసిల్దార్, ఎంపిడిఓ, పోలీస్, మండల వ్యవసాయ అధికారి వైద్య అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి డ్రగ్స్ నియంత్రణ ప్రణాళిక రూపొందించాలని అన్నారు.జిల్లాలో ఉన్న సినిమా థియేటర్ల పరిసరాలను రాత్రి సమయంలో ఆకస్మికంగా తనిఖీలు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న బార్లు, వైన్ షాప్ ప్రభుత్వ నిర్దేశిత సమయపాలన పాటించేలా చూడాలని అన్నారు. బార్ నిర్వాహకులతో వాట్స్ అప్ గ్రూప్ తయారు చేయాలని ప్రతి రోజూ ఎప్పుడు మూసి వేస్తున్నారో సమాచారం అందించాలని అన్నారు.డ్రగ్స్ నియంత్రణ పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, అవగాహన కార్యక్రమాల్లో డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలు వివరించే వీడియోలను, పోస్టర్లను ప్రదర్శించాలని అన్నారు. డ్రగ్స్ పరీక్షల నిర్వహణకు అవసరమైన యూరిన్ కిట్లను పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారుల వద్ద అవసరమైన మేర అందుబాటులో ఉంచాలని కలెక్టర్ వైద్యారోగశాఖ అధికారికి సూచించారు. కళాశాలలో సడన్ గా వింతగా ప్రవర్తించే విద్యార్థులను గుర్తించాలని, ఎవరైనా డ్రగ్స్ గంజాయి తీసుకుంటున్నట్లు తెలిస్తే వారికి అవసరమైన కౌన్సిలింగ్ అందజేయాలని అన్నారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు, ఇటుక బట్టీల వద్ద అసిస్టెంట్ లేబర్ అధికారి ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాల పై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ, సిరిసిల్ల జిల్లాలో డ్రగ్స్ మాదకద్రవ్యాల నియంత్రణకు పక్కా నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. డ్రగ్స్ చిన్న సంఖ్య లో ఉన్నా కూడా తప్పనిసరిగా సీజ్ చేయాలని అన్నారు. జిల్లాలో ఓపెన్ డ్రింకింగ్ బంద్ చేయాలని అన్నారు. ఆలయ పరిసరాల ప్రాంతంలో వైన్ షాప్ ఉండకుండా చూడాలని అన్నారు.గ్రామ స్థాయి నుంచి డ్రగ్స్, గంజాయి అలవాటు ఉన్నట్లు ఏదైనా అనుమానం కలిగితే వెంటనే తమకు సమాచారం అందించాలని, మా దగ్గర అవసరమైన మేర డ్రగ్స్ నిర్ధారణ కిట్లు, నార్కోటిక్స్ గుర్తించే డాగ్స్ అందుబాటులో ఉన్నాయని వెంటనే పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలన వాల్ పోస్టర్స్, హ్యాండ్ బుక్ లను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారి రాధా బాయి , అసిస్టెంట్ లేబర్ అధికారి నాజర్ అహ్మద్, డ్రాగ్ ఇన్స్పెక్టర్ భవాని, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష,విద్యా, వ్యవసాయ శాఖ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 2011బ్యాచ్ CJLM ల కు ఏరియర్స్ ఇవ్వాలి

### TGUEEU-CITU



**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాబలం)** ఖమ్మం విద్యుత్ సంస్థలలో 2006లో జేఎల్ఎంల కోసం నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది తదుపరి ఐదు సంవత్సరాల తర్వాత 2011లో కొంతమందిని

%జజీూవీ% గా రెగ్యులరై చేసి ఉద్యోగాలు ఇచ్చినారు అప్పటినుండి వీరికి మానటరీ బెనిఫిట్ ఇవ్వలేదువీరికి తెలంగాణ హైదరాబాదు ఎస్పీడీసీఎల్ లో ఆంధ్ర ప్రభుత్వం ఈ సౌకర్యం కల్పించినరు కానీ తెలంగాణలో మన వరంగల్ కంపనీ 16 జిల్లాలలో ఉన్న కార్మికులకు 2011 జెల్ ఎం వారి కి సౌకర్యం కల్పించలేదు రావాల్సిన బకాయిలు చెల్లించ లేదు. కావున బకాయిలు చెల్లించాలని కంపనీ వ్యాప్తంగా ఎస్. ఈ లకు దరఖాస్తు ఇవ్వడం జరిగింది. ఖమ్మం జిల్లా లో డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్ బాబురావు, పి వో తిరుపతి గారికి తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ తరపున వినతిపత్రం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం . ప్రసాద్.ఖమ్మం జిల్లా కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ , దొడ్డ వెంకట్ రూరల్ డివిజన్ కార్యదర్శి సీతయ్య ,డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి జిల్లా ట్రెజరర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు కఠిన చర్యలు చేపట్టాలి





**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ అన్నారు.జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో (మినీ స్విజర్లాండ్) పర్యాటకులపై కాల్పులు ఉగ్రదాడిని ఖండిస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలోని గుల్జార్ మస్జిద్ లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థన అనంతరం ముస్లిం మైనార్టీలు నల్ల రిబ్బన్లు ధరించి నిమిషం మౌనం పాటించి నిరసన తెలిపారు.హిందుస్థాన్ జిందాబాద్.పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో మస్జిద్ మేనేజింగ్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అసయ్యద్ బషీర్ అలీ అబ్దుల్ వహీద్ వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు రఫీ అహ్మద్ ఖురేషి, షాహిన్ హష్మీ హబీబ్ చౌష్,జుబేర్ ఖాన్, ఫరాజ్,నౌమాన్, ఫాజిల్ హష్మీ,మోకీత్ తదితరులు పాల్గొన్నారు

## భూభారతి చట్టం అమలుతో మండల స్థాయిలోనే ప్రజల భూ సమస్యల పరిష్కారం:జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** భూభారతి చట్టం అమలు ద్వారా ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలన్నీ మండల స్థాయిలోని పరిష్కారానికి వీలుంటుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శుక్రవారం లక్ష్మణచందా మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ అవగాహన సదస్సులో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి చట్టం అమలు ద్వారా ప్రజల భూ సమస్యలన్నీ సులభంగా వేగంగా పరిష్కరించేందుకు వీలు పడుతుందన్నారు. భూముల రిజిస్ట్రేషన్, తదితర అంశాల పరిష్కారానికి దరఖాస్తులు చేసుకున్న వాటికి నిర్నిత గడువు ఉంటుందని,ఆ గడువు లోపలే అధికారులు వీటన్నింటిని పరిష్కరించాల్సి ఉంటుందని తెలిపారు. ఎక్కువ శాతం భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సమస్యలు మండలంలోని తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కరించబడతాయన్నారు. క్రయవిక్రయాల ద్వారా పట్టా మార్పిడి, వారసత్వ పట్టా మార్పిడి వంటి అనేక పనులు సులభతరంగా చేసుకోవచ్చున్నారు.ఈ నూతన భూభారతి చట్టాన్ని అనుసరించి ప్రజలకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందన్నారు. సాదాబైనామా ప్రక్రియ తిరిగి వినియోగంలోకి తీసుకురావడం వల్ల ఎంతో మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ చట్టం ద్వారా భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సరళతరం చేయడం వల్ల అధికారుల చుట్టూ మాటిమాటికి తిరగాల్సిన అవసరం లేదన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల భూ సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఈ భూభారతి అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,తహసిల్దార్ జానకి,ఎంపీడీవో రాధా రాథోడ్,మండల ప్రత్యేక అధికారి మోహన్ సింగ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి,వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, డిసిసిబి వైస్ చైర్మన్ రఘునందన్,మండల వ్యవసాయ అధికారి వసంతరావు,ఇతర అధికారులు,ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

### పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తా





**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.శుక్రవారం నిర్మల్ నియోజకవర్గం దిలవార్ పూర్ మండలం సాంగ్వి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో మొదటి విడతలో 22మందికి ఇళ్లు మంజూరు అయినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఒక్కో ఇంటి నిర్మాణానికి 2.50 లక్షల రూ.లు రాష్ట్ర ప్రభుత్వం 2.50 లక్షల రూ.లతో ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు.అర్హులైన ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్ని సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నెరవేర్చే దిశగా కృషి చేస్తామని అన్నారు.ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి వాటిని దాట వేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వమే తప్ప చేతల్లో ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చేలా లేదన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు తాజా మాజీ సర్పంచ్ అచ్యుత్ రావ్, రాంరెడ్డి,దశరథ్ రెడ్డి, మైనారిటీ మోర్చ అధ్యక్షులు మహబూబ్, నాయకులు కుస్తాపురం రమేష్, పల్లికొండ ముత్యం, నిరంజన్ రెడ్డి,ఈర్ల విజయ్,అధికారులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## గంగమ్మ తల్లి పోతురాజు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో తుంబూరు దయాకర్ రెడ్డి మేకల మల్లి బాబు యాదవ్



**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాబలం)**ఖమ్మం నేలకొండపల్లి మండలం భైరవుని పల్లి గ్రామంలో యాదవులంతా భైరవనిపల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో రాజకీయాలు వర్గాల కతీతంగా నూతనంగా గంగమ్మ తల్లి గుడిని ఏర్పాటు చేసుకుని శుక్రవారం నాడు గంగమ్మ తల్లి,పోతురాజు విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం ఘనంగా జరిగింది. . వారి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మాత్యులు గారి ఖమ్మం క్యాంప్ ఆఫీస్ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, జిల్లా అఖిలభారత యాదవ్ మహాసభ గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు యాదవ్ లు పాల్గొన్నారు. గ్రామంలోని యాదవులు ఘన స్వాగతం పలికి గంగమ్మ తల్లి గుడిలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి పంటలు పుష్కలంగా పండాలని, సమృద్ధిగా వానలు కురవాలని, ప్రజలందరికీ అవసరమైనప్పటికీ అనాదిగా

కురుమ యాదవులు మాత్రమే గంగమ్మ తల్లికి, పోతురాజుకు బోనాలతో మొక్కులు తీర్చుకొని సేవిస్తుంటారని, ప్రతి గ్రామంలో ఈ సాంప్రదాయం కలిగి ఉండటం చాలా గర్వకారణం అని పేర్కొన్నారు. వనభోజనాల సాంప్రదాయం కూడా శ్రీకృష్ణ పరమాత్మ కాలము నుండి కొనసాగటం చాలా గొప్ప సాంప్రదాయమని తెలిపారు. భైరవునిపల్లి గ్రామంలో ఇంటిలోనుండి బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా గుడి వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించారు. గ్రామం అంతా పండుగ వాతావరణం తో జాతరను తలపించింది . విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొని వచ్చి ప్రతిష్ట చేయడం జరిగింది. పూజారులు జొన్నభట్ల ప్రసాద్ శాస్త్రి నాగయ్య శాస్త్రి ఆధ్వర్యంలో యంత్ర స్థాపన, కళ్యాణం, విగ్రహ ప్రతిష్ట, దృష్టి కుంభం, పూర్ణాహుతి, మహదాశీర్వచనం కార్యక్రమాలతో పాటు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మల్లెబోయిన శ్రీనివాస్, మల్లె బోయిన ఉపేందర్, చేతుల నాగేశ్వరరావు మొరిమేకల కోటయ్య, కనక బండి కనకరాజు బుర్ర వెంకన్న, బాలిన చిన్న నారాయణ కనక బండి రమేష్, నూక చిన్న నాగయ్య బొల్లం సత్యనారాయణ, కనక బండి సత్యనారాయణ నూక సీతారాములు, కవిత, బొల్లం రామారావు నూక వెంకటేశ్వరరావు బుర్రనాగభూషణం బాలిన కోటయ్య శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య కొర్లకుంట నాగేశ్వరరావు, గోళ్ళ శ్రీనివాసరావు మరికంటి రమేష్ మరియు గ్రామస్తులు యాదవ బంధువులు మిత్రులు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు

# పరిసరాల పరిశుభ్రత-ప్రజారోగ్యానికి తొలిమెట్టు



ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ ఎ. బాలకృష్ణ నాయక్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి జెండా ఊపి ర్యాలీ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ

మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాపిస్తుంది. మురుగునీటి నిల్వలున్న ప్రాంతాల్లో ఈ దోమల లార్వా వృద్ధి చెందుతుంది. మలేరియా జ్వరానికి మూలం 'ప్లాస్మోడియం' అనే పరాన్నజీవి. ఇది దోమలతో ముఖ్యంగా ఆడ అనాఫిలస్ దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తిస్తుంది. దోమలు తమ గుడ్లను రక్తంలో వృద్ధి చేసుకోవటానికి మనుషులను కుడుతుంటాయి. అప్పటికే మలేరియాతో బాధపడుతున్న వ్యక్తిని దోమ కుడితే దానికీ పరాన్న జీవి సోకుతుంది. ఆ దోమ మరొకరిని కుట్టినప్పుడు లాలాజలం ద్వారా వ్యక్తి రక్తంలోకి పరాన్నజీవి ప్రవేశిస్తుంది. ఇది కాలేయంలోకి చేరుకొని పరిపక్వమై, వృద్ధిచెందుతుంది. కాలేయ కణాలను ఇన్‌ఫెక్షన్‌కు గురిచేస్తుంది. ఆ కణాలు విచ్ఛిన్నం కావటం వల్ల పరాన్న జీవులు రక్తంలోకి, తర్వాత ఎర్ర కణాలకు చేరుకుని ఇన్ఫెక్షన్‌ను కలుగ చేస్తాయి. మలేరియా కారక పరాన్న జీవిలో ఫాల్సిఫారమ్, వైవాక్స్, ఒవేల్, మలేరియా అనే ముఖ్య రకాలున్నాయి. రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ వారి ఆదేశాల మేరకు ఏడాది పొడవునా దోమల నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాం.

గతంతో పోలిస్తే మలేరియా కేసులు ఏటేటా తగ్గుముఖం పడుతుండటం ఎంతో స్వాగతించాల్సిన విషయం. దోమలు కుట్టకుండా చూసుకోవటం-దోమ తెరలు వాడటం, ఇంటి పరిసరాల్లో దోమల నియంత్రణ మందులు వాడటం - కొబ్బరి చిప్పలు, పాతటైర్లు వంటివి లేకుండా చూసుకోవాలి.-కూలర్లలో నీరు లేకుండా చూసుకోవాలి.

మలేరియా లక్షణాలైన చలి, వణుకుతో కూడిన జ్వరం-తలనొప్పి, ఒంటినొప్పులుపరీక్షలు ర్యాపిడ్ డయాగ్నొస్టిక్ టెస్ట్ (ఆర్‌డిటి) ప్యారాసైట్ ఎఫ్, వి ద్వారా ఫాల్సిఫారమ్, వైవాక్స్ రకం మలేరియాను నిర్ధారించొచ్చు.

రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో...జాతీయ కీటక జనిత వ్యాధి నిరోధక కార్యక్రమం (ఎన్‌విబిడిసిపి)లో భాగంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, జపనీస్ ఎన్సెఫలైటిస్, ఫైలేరియాకు సంబంధించిన కార్యక్రమాలను రాష్ట్రప్రభుత్వం, ఎన్‌హెచ్‌ఎం సహకారంతో నిర్వహిస్తోంది. మలేరియా, ఇతర వ్యాధికారక దోమలతో కలిగే వ్యాధులకు ప్రాథమిక నిర్ధారణ, పూర్తి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. సమగ్ర దోమ నియంత్రణ చర్యలు (ఎల్‌ఎల్‌ఐఎన్‌ఎస్)లో భాగంగా పురుగుమందుల స్ప్రే (ఐఆర్‌ఎస్)లను ప్రతిరోజూ విద్యా శాఖ, గ్రామీణ మంచినీటి సరఫరా, పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖల సమన్వయంతో సంయుక్తంగా నిర్వహిస్తున్నాం. 2025 లో జనవరి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మలేరియా కేసులు నమోదు కాలేదు.ప్రత్యేక కార్యక్రమాలు వెక్టర్ కంట్రోల్ అండ్ హైజీన్ యాప్ ప్రవేశపెట్టి వ్యాధి కారక, దోమల నియంత్రణ చర్యలపై డిజిటల్ ప్లాట్‌ఫాంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అమలు చేస్తున్నాం. జిల్లా కలెక్టర్, డిఎంఅండ్‌హెచ్‌ఒలు సమీక్షా సమావేశాలు నిర్వహించి వ్యాధుల నియంత్రణపై చర్యలు తీసుకుంటున్నారు.గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు స్వచ్ఛత, వ్యక్తిగత రక్షణ చర్యలుపై అవగాహన కల్పిస్తున్నాం. 2027 నాటికి జిల్లాల్లో మలేరియాను పూర్తిగా నిర్మూలించటమే లక్ష్యంగా కృషి జరుగుతోంది. 1000జనాభాకు ఒక కేసు కన్నా తక్కువగా ఉండడం. ఎబిఇఆర్ వార్షిక రక్త పరీక్షా నిష్పత్తి 10 శాతానికిపైగా ఉండచం, ఎంబిఇఆర్ నెలవారీ రక్త స్మియర్ పరీక్షా నిష్పత్తి 1 శాతానికిపైగా ఉండేలా చూడటం.ఎపిఐ (వార్షిక పరాన్న జీవి ప్రబలత్వం 0.50 కన్నా తక్కువగా తగ్గించడం. స్థానికంగా జన్మించిన మలేరియా కేసులను పూర్తిగా నిరోధించటం. అధిక మలేరియా ప్రబలమైన ప్రాంతాల్లో ఎల్‌ఎల్‌ఐఎన్‌ఎస్ దీర్ఘకాలం ప్రభావం చూపించే పురుగుమందు గల దోమతెర ద్వారా ప్రమాదంలో ఉన్న జనాభాకు పూర్తి రక్షణ కల్పించడం. మలేరియాకు తక్షణ నిర్ధారణ పూర్తి చికిత్స అందించటం. మలేరియా నియంత్రణఇండోర్ రెసిడ్యూయల్ స్ప్రే పరిధి జనాభాలో గృహాల్లో 85 శాతం లేదా అంతకంటే ఎక్కువస్థాయికి చేరుకోవడం, నిఘా నివేదికల పర్యవేక్షణ వారానికి నెలకు ఒకసారి సమీక్షలు నిర్వహించటం, సమాజ భాగస్వామ్యంతో ఐఇసి బిసిసి కార్యకలాపాలను బలోపేతం చేయడం ద్వారా కీటకజనిత వ్యాధులను నివారించడం జరుగుతుందని జిల్లా మలేరియా అధికారి శ్రీ ఉ.ఐ. రూప్ కుమార్ తెలిపినారు. ఈ ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి మెడికల్ కాలేజీ సర్కిల్ వరకు స్లోగన్స్ మరియు బ్యానర్స్ తో వెళ్లి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో డిపిఎమ్‌ఓ డాక్టర్ శ్రీనివాసరావ్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్, కిరణ్ కుమార్ డిప్యూటి డెమో, బాబు నెహ్రూ రెడ్డి హెచ్ ఇఓ,పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు,సబ్ యూనిట్ అధికారులు,పట్టణ ఆరోగ్య కేంద్రాల ఒఔఓ లు ,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉగ్రవాద చర్యలను ఖండిస్తూ ప్రజాసంఘాల కొవ్వొత్తుల ర్యాలీ.



బద్వేలు (సిపిఎం) అనుబంధ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బద్వేలు నాలుగు రోడ్ల సెంటర్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు గురువారం రాత్రి కాశ్మీర్ పహాల్గాన్ పర్యాటక ప్రాంతంలో పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు చేసిన దాడులను ఖండిస్తూ దేశంలో శాంతిని నెలకొల్పాలని ఉగ్రవాద సంస్థలను రూపుమాపాలని, దాడులకు పాల్పడి అమాయక ప్రాణాలు తీసిన నిందితులకు ఉరిశిక్ష విధించాలని కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను మాట్లాడుతూ

జమ్మూ కాశ్మీర్ లోని పహల్గావ్ పర్యాటక ప్రాంతంలో టూరిస్టులపై ఉగ్రవాదులు కాల్పుల జరిపి 28 మంది అమాయకులను పొట్టనపెట్టుకున్నారు. ఈ సంఘటనను పిరికిపందా చర్యగా అభివర్ణిస్తూ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదుల కాల్పులలో అసువులుబాసిన, నేలకొరిగిన భారత ముద్దు బిడ్డలకు కన్నీటి నివాళులు అర్పిస్తూ ప్రగాడ శ్రద్ధాంజలి సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు,స్వల్పంగా గాయపడ్డవారు,తీవ్రంగా గాయపడ్డా వారు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరారు.మృతిచెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. అక్కడ తిరిగి మామూలు పరిస్థితులు ఏర్పడాలని అందుకు అందరూ సహకరించాలని సంయమనంతో సామరస్యపూర్వకంగా సోదరభావంతో మెలగాలని అన్నారు మృతి చెందిన కుటుంబాలకు భారత ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి 5 కోట్ల రూపాయలు ఆర్థిక సాయం అందించి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు ముష్కరులను పట్టుకొని కులము, మతము , భేదం లేకుండా ఉరిశిక్ష వేయాలన్నారు,భారత ప్రభుత్వం ఉగ్రవాదులను ఏరివేతలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా మరియు అశ్రద్ధగా నడుచుకోకుండా ఉక్కుపాదం మోపాలని, అన్నారు భారతదేశంలో ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా చూడవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పై ఉన్నదని, ఇలాంటి సంఘటనలను భారతదేశ ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు, ఉగ్రవాదులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దెబ్బకు దెబ్బ తీసి సరైన గుణపాఠం నేర్పాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమం ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పటాన్ చాంద్ భాషా, పట్టణ అధ్యక్షులు షేక్ అన్వర్ భాష, పట్టణ నాయకులు ఖాజాగౌస్, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు, పట్టణ నాయకులు ఎస్. జి నాగార్జున, కె.శివకుమార్, డి. హరి, జి. రాజగోపాల్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం. చిన్ని, పట్టణ అధ్యక్షులు ఎస్.ఎం షరీఫ్, పట్టణ నాయకులు షేక్ ఫాతిమా,ఐద్వా మహిళా సంఘం పట్టణ నాయకురాళ్లు పి. మోక్షమ్మ, షేక్ మస్తాన్ బీ, షేక్ కైరోన్ బీ, ఫాతిమా, నాగరత్నమ్మ,చేతి వృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు చెప్పలి సుబ్బ రాయుడు,గంప సుబ్బరాయుడు, వికలాం గుల సంఘం పట్టణ నాయకులు వెంకటపతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను మార్కుల యంత్రాలుగా మార్చకండి....

## . ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు లక్ష్మీరాజా...



బద్వేలుప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎస్ వి ఇంజనీరింగ్ కాలేజ్ నందు విద్యార్థులు -మార్కుల యంత్రాలు -విలువలు అనే అంశం మీద ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బి లక్ష్మీరాజ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బి లక్ష్మీరాజా ఎస్ వి ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ వీర సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నం ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపకురాలిపై ఓ విద్యార్థి చెప్పుతో దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రుల పైన సమాజం పైన ఉపాధ్యాయ అధ్యాపకుల పైన ఉంది అని తెలిపారు. విద్యార్థులను మార్కుల యంత్రాలుగా చూడటం వలన తయారు చేయటం వలన ఈ సమాజానికి ఈ దేశానికి ఉపయోగం ఉండదన్నారు. సమాజ మార్పు కోసం సమాజంలో జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకొని సమ సమాజం నిర్మించుటలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యార్థుల అభ్యున్నతి కోసం విద్యార్థుల తల్లిదండ్రుల తర్వాత గురువు నిరంతరం శ్రమిస్తాడు అన్నది నగ్న సత్యం. అయితే ఇటీవల కాలంలో స్వల్ప దండనలకు కూడా విద్యార్థుల తల్లిదండ్రులు జోక్యం చేసుకొని గురువులపై దాడులకు తెగబడమనేది సమాజాన్ని అట్టడుగుకు తీసుకు వెళ్లేలా కనిపిస్తుందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను మార్కుల యంత్రాలుగా చూసి వారికి వచ్చిన మార్కులను ఇతర విద్యార్థులకు వచ్చిన మార్కులతో పోల్చుకుంటూ మరిన్ని మార్పులు తెచ్చుకోవాలని తల్లిదండ్రులు తీవ్రంగా విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారు.

అలాగే ప్రస్తుతం విద్యార్థుల బోధనాంశాలలో నీతి కథలు మారల్ పీరియడ్స్ లాంగ్వేజ్ లలో విద్యార్థుల నిజ జీవితానికి అవసరమైన పాఠ్యాంశాలు లేకపోవడం ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఒక లోపంగా కనిపిస్తున్నది.ఉపాధ్యాయులకు అధ్యాపకులకు విద్యార్థులు పైన ఎలాంటి ద్వేషంతో శత్రుత్వంతో కానీ ఉండరని వారిని సరైన మార్గంలో నడపాలి అన్నదే గురువుల లక్ష్యంగా పనిచేస్తారు తప్ప మరో ప్రయోజనం వారి నుండి కోరుకోరని తెలిపారు.

అందుకోసం సమాజంలో విద్యార్థులను మార్కుల యంత్రాలుగా కాకుండా నైతిక విలువలు పెంపొందించుకోవటానికి పెద్దల పట్ల గురువుల పట్ల వినయ విధేయతలతో ఉండటం తల్లిదండ్రులను గౌరవించడం పాఠశాల స్థాయి నుండి విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఉన్నత పాఠశాల స్థాయి నుండి ఇంటర్మీడియట్ డిగ్రీ ఇంజనీరింగ్ మెడికల్ తదితర కళాశాల యందు సైకలాజిస్టులను నియమించి ఎప్పటికప్పుడు విద్యార్థులలో వస్తున్న పరిణామాలను గుర్తించి వారిని తీర్చి దిద్దాల్సిన అవసరం ఉంది అన్నారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఏపీటీఎఫ్1938 జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి కృష్ణారెడ్డి నాయకులు నరసింహులు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులకు అన్ని స్థాయిలలో సదస్సులు నిర్వహించి వారిలో సామాజిక చైతన్యాన్ని పెద్దలు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల పట్ల గౌరవాన్ని పాఠశాల స్థాయి నుంచి పెంపొందించేలా కృషి చేస్తామని తెలిపారు.

# జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా వి.పూర్ణచంద్రరావు బాధ్యతల స్వీకరణ



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25** : మంచిర్యాల జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా వి.పూర్ణచంద్రరావు శుక్రవారం రోజున బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# లక్షెట్టిపేటలో దొంగతనం

# తాళం వేసి ఉన్న ఇంటికి కన్నం

## సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ అల్లం నరేందర్,ఎస్సై సురేష్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 25 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట పట్టణంలోని ఆంధ్రబోర్ లోని ఎయిర్టెల్ టవర్ ఏరియాలో గురువారం రాత్రి చోరీ జరిగింది.బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఆర్మీలో పని చేస్తున్న బొప్పు శ్రీనివాస్ గురువారం తాళం వేసి వెంకట్రావు పేటలో ఓ ఫంక్షన్ కు వెళ్లామన్నారు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయన్నారు. సుమారుగా రెండున్నర తులాల బంగారు గొలుసు, ఇరవై తులాల వెండి,35 వేల రూపాయలు నగదును దోచుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు.సమాచారం అందుకున్న వెంటనే సీఐ అల్లం నరేందర్,ఎస్సై గోపతి సురేష్,తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.బాధితుడి పిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

## పదవ తరగతి పాసైయిన విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు, సత్కారం

అనపర్తి తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభినందించారు. అనపర్తి బాలుర ప్రభుత్వ అన్నత పాఠశాల, రామవరం ప్రభుత్వ పాఠశాలలో జాబ్ రాలేదు పదో తరగతి చదివిన పలువురు విద్యార్థులకు ఈరోజు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛాల అందించి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఈ ఏడాది మొట్టమొదటిసారిగా కాకినాడ జిల్లాకు చెందిన ఓ విద్యార్థిని 600 కు 600 మార్కులు సాధించి రికార్డు సృష్టించిందని , తమ నియోజకవర్గంలో అత్యధికంగా ప్రభుత్వ స్కూల్ విద్యార్థి 592 మార్కులు సాధించి రికార్డ్ సృష్టించాడని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ప్రమాణాలతో విద్యాబోధన చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దున ఉపాధ్యాయ బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు.

# ఉపాధి కూలీలకు జాబ్ కార్డులు ఇవ్వాలి

## పాత జాబ్ కార్డులలో పేరు నమోదుకు అవకాశం ఇవ్వాలి

## రెండు నెలల బకాయిలు వెంటనే ఇవ్వాలి

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, ఆందోల్ నియోజకవర్గం లోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం,నర్సింలు, ఆధ్వర్యంలో అందోల్ మండలం అల్మాయపేట, చౌటకూర్ మండలం శివంపేట్, గ్రామాలలో పర్యటించడం జరిగింది, ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం,నర్సింలు. మాట్లాడుతూ, గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఉపాధి హామీ జాబ్ కార్డు పొందే హక్కు ఉందని, జాబ్ కార్డు ఇవ్వకుండా నిరాకరించడం అంటే పని కల్పించే బాధ్యతనుండి ప్రభుత్వం తప్పుకోవడం కిందికే వస్తుందని, ఆవేదన వ్యక్తం చేశారు, ఈ రకమైన నిర్ణయం చట్టాన్ని ఉల్లంఘించడమేనని, అనేకమంది 18, సంవత్సరాలు నిండిన వారు, కొత్తగా పెళ్లిళ్లు చేసుకున్న వారందరికీ జాబ్ కార్డు ఇవ్వకుండా ఆపడం అంటే, ఒక తరాన్ని ఉపాధి హామీ పనికి దూరం చేయడంతో పాటు, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామి కాకుండా చేయడమే అవుతుందని అన్నారు, యువశక్తిని అభివృద్ధిలో భాగస్వాములు కాకుండా అనుసరించే తిరోగమన విధానాలకు , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్తి పలకాలని వెంటనే జాబ్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు, రెక్కఆడితే కానీ డొక్కాడని గ్రామీణ ప్రాంత పేదలుగా ఉన్న దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల వారిని, ఆహార భద్రతకు, సామాజిక భద్రతకు, ఆర్థిక అభివృద్ధికి, దూరంగా నెట్టే చర్యలకు పాలకులు సిద్ధపడటం ఆందోళన కలిగిస్తుందని అన్నారు, రెండు నెలలుగా ఉపాధి హామీ, బకాయిలు పేరుకుపోయాయని, కూలీలు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుండి అప్పులు తెచ్చుకొని డ్వాక్రా చిట్టీలు కుటుంబ పోషణకు ఉపయోగిస్తున్నారని, వెంటనే రెండు నెలల బకాయిలు ఇవ్వాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు, అయినటువంటి టెంట్లు, మంచినీళ్లు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇవ్వాలని అన్నారు, ఉపాధి హామీ చట్టం ప్రతికూలీకి పనిముట్లు ఇవ్వాలని చెబుతున్న ఎందుకు ఇవ్వడం లేదని అన్నారు, రెండు నెలల బకాయిలు పనిముట్లు కనీస సౌకర్యాలు వెంటనే కల్పించాలని, లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో అందోల్ ఏరియా ఇన్చార్జి జయరాజు, సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాజు, ఉపాదామి కూలీలు పోచయ్య, వీరయ్య, కుమార్, మల్లేశం, లక్ష్మి, దుర్గేష్, బాబు,అరుణ్ కుమార్, మొగులయ్య, వీరమణి, భాగ్యమ్మ, భారతమ్మ,సంగమ్మ, లక్ష్మి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

## కరపత్రం విడుదల సిఐటియు జిల్లా కార్యదర్శి జి,సాయిలు,



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 25, ( ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా, అందోల్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన జోగిపేటలో మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కరపత్రాన్ని జిల్లా సిఐటియు కార్యదర్శి జి, సాయిలు, విడుదల చేశారు, స్థానిక సిఐటియు కార్యాలయం ఆఫీసులో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి,(సీఐటీయూ జిల్లా కార్యదర్శిజి,సాయిలు )మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత, పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను, కాలరాస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా 29, కార్మిక చట్టాలను రద్దు చేసి , నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చింది అన్నారు, వీటికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటం ఫలితంగా, అమలకు ఆలస్యం అవుతున్న, మోడీ ప్రభుత్వం బరితెగించి, పెట్టుబడిదారులకు అనుకూలంగా అమలు వేగవంతం చేయాలని నిర్ణయించిందన్నారు, దీంతో కార్మికులు,యూనియన్లు పెట్టడం, హక్కులు అడగటం, పోరాటాలు చేయటం, కష్టతరంగా అవుతుందని అన్నారు, యూనియన్ రిజిస్ట్రేషన్ కనీస వేతనం ఇతర చట్టపరమైన సౌకర్యాలు, సమ్మెకు వాటికి ఈ కోడ్స్ ద్వారా ప్రమాదం ఉంటుందన్నారు, 8 గంటల పని దినాల్లో మార్పు చేస్తూ 12 గంటలు పని చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కోడ్స్ ద్వారా వీలు కల్పిస్తుందని అన్నారు, బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న, కార్పొరేట్ అనుకూల కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు, దశాబ్దాల పాటు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను హక్కులను, హరిస్తున్న సమయంలో భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై ఎంతగానో ఉందన్నారు, హక్కుల రక్షణ కోసమే మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని కార్యవర్గం పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర మోడీ ప్రభుత్వానికి చెంప చెల్లుమనే విధంగా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, విద్యాసాగర్, అందోల్ డివిజన్ నాయకులు, కృష్ణ రాములు, సురేష్, ప్రభాకర్, నాగేష్ రాజు ,పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు....

# వేములవాడలో నల్ల బ్యాడ్జీలతో ముస్లింల నిరసన కార్యక్రమం.

## మనమంతా ఒక్కటవుదాం, ఉగ్రవాదాన్ని తరిమికొడతాం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ), ఏప్రిల్ 22వ** తేదీన జమ్మూ కాశ్మీర్లో టూరిస్టులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 28 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ అమానుష దాడి దేశవ్యాప్తంగా తీవ్ర కలకలాన్ని రేపింది. ఈ దారుణ ఘటనను నిరసిస్తూ వేములవాడ పట్టణంలోని అన్ని మసీదులలో ముస్లింలు శుక్రవారం రోజున నల్ల బ్యాడ్జీలు ధరించి " ఉగ్రవాదం నశించాలి " అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమగ్రతను భగ్నం చేయాలనే ఉద్దేశంతో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న ఉగ్రవాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదన్నారు. ఒకవైపు మన సైనిక బలగాలు దేశ రక్షణ కోసం నిత్యం అపార త్యాగాలు చేస్తుంటే, అశాంతి కలిగించడమే లక్ష్యంగా ఉగ్రవాదులు అమాయకులపై దాడులకు పాల్పడుతున్నారు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజలంతా కుల, మతాలకతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఒక్కటై, జాతీయ ఐక్యతను ప్రతిబింబించాలన్నారు. ఉగ్రవాదాన్ని రూపుమాపడానికి మరింత కఠినమైన చట్టాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. అమాయకుల ప్రాణాలను బలిగొన్న అరాచకులపై కేంద్రం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణంలోని ముస్లిం మత పెద్దలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారం భూభారతి

## రైతులు కోరుకుంటే లైసెన్స సర్వేయర్ల ద్వారా భూ సర్వే

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 25:** భూభారతితో రైతుల, భూస్వాముల భూసమస్యలు తీర్చే అధికారం రెవెన్యూ అధికారులకు ఈ చట్టంలో ఇవ్వడం జరిగిందని, తద్వారా సమస్యలకు రెవెన్యూ అధికారులు శాశ్వత పరిష్కారం కల్పిస్తారని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు.

శుక్రవారం ఘట్కేసర్ మండలంలోని ఎదులాబాదు గ్రామంలో గల డిఎస్ఆర్ ఫంక్షన్ హాలు లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ భూభారతితో రైతుల, భూస్వాముల భూ సమస్యలు తీర్చే అధికారం రెవెన్యూ అధికారులకు ఈ చట్టంలో ఇవ్వడం జరిగిందని, తద్వారా సమస్యలకు రెవెన్యూ అధికారులు శాశ్వత పరిష్కారం కల్పిస్తారని అన్నారు. ప్రతి గ్రామంలో తహాసీల్దారు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం జరగుతుందని ఆ సదస్సులో మీయొక్క వ్యక్తిగత భూసమస్యలకు సంబంధించిన అప్లికేషన్లు ఇస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ధరణిలోరెవెన్యూ డిపార్ట్ మెంట్ కు ఎలాంటి అధికారాలు కల్పించనందున, ఇప్పటివరకు ఆ సమస్యలన్ని అధిక సంఖ్యలో అలాగే పెండింగ్ లో ఉన్నాయన్నారు. భూభారతి ద్వారా ఆ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. పాసు బుక్కులు రాని వారికి కొత్త పాసు పుస్తకాలు ఇవ్వడం , అలాగే పాసుబుక్కులలో తప్పులను సవరించడం ఈ భూభారతి చట్టం ద్వారా చేయవచ్చని తప్పనిసరిగా రైతుల సమస్యలు తీరుస్తామని కలెక్టరు అన్నారు. రైతులు కోరుకుంటే లైసెన్స సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి భౌతిక సరిహద్దుతో చేయించిన ల్యాండ్ మ్యాపులను ప్రభుత్వ సర్వేయర్లు మళ్లీ వాలిడేట్ చేసిన తరువాతే మీకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో ల్యాండ్ మ్యాపులు వస్తాయని, దీని వల్ల ఎవరికి నష్టం జరగదని ఇంకా పకడ్బందీగా మీ భూసరిహద్దులు ఉంటాయని, అది కూడా రైతు ఒప్పుకుంటేనే భూ సర్వే చేస్తామని కలెక్టరు తెలిపారు. ధరణి వల్ల పిఓబి సమస్యలు చాలా ఉన్నాయని, భూభారతి చట్టంలో పిఓబి రద్దుచేసే అధికారం కల్పించడం జరిగిందన్నారు. ఈ భూభారతి చట్టంలో ప్రతి సంవత్సరం డిసంబర్ 31న ఆ సంవత్సరంలో జరిగిన మార్పులు, చేర్పులను ఆన్ లైన్ లో ప్రింట్ తీసి ప్రతి గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులలో ప్రదర్శిస్తారని అందువల్ల మీకందరికి మీమీ భూముల రికార్డుల వివరాలు తప్పక తెలుస్తాయని కలెక్టరు వివరించారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా రెవెన్యూ అధికారుల పై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని, ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టరు తెలిపారు.

ఈ సదస్సులో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, ఘట్కేసర్ తహాసీల్దారు రజనీ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఫాజుల్ నగర్ వైద్య శిబిరాన్ని సందర్శించిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్, నెఫ్రాలజిస్ట్.





**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ రూరల్ మండలం ఫాజుల్ నగర్ గ్రామపంచాయతీలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వారికి శుక్రవారం గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ నెఫ్రాలజిస్ట్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయి కాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమ, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కొండలరావు ఎస్సార్ 2, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎంజ లీనా, వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వారికి పలు సూచనలు చేసి వారి నుండి రక్త నమూనాల సేకరించి ల్యాబ్ కు పంపించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి లు, సూపర్వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ మలిదశ ఉద్యమ కారుని కుటుంబంలో తీవ్ర విషాదం.

## 21 రోజులలో కుటుంబంలో ముగ్గురు మృతి.

## కుటుంబాన్ని ఆదుకోవాలని కేటీఆర్ కు విజ్ఞప్తి.







**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట,( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో గడ్డి ఎల్లవ్వ (80) గురువారం సాయంత్రం అనారోగ్యంతో మరణించింది. మలీ దశ తెలంగాణ ఉద్యమకారుడు గడ్డి నరసయ్య (55) ఏప్రిల్ మూడవ తేదీన అనారోగ్యంతో మరణించగా, నరసయ్య చిన్న కుమారుడు నరేందర్ (23) మాయా లేడి ప్రేమలో పడి 45 రోజులు జైలు జీవితాన్ని అనుభవించి తన తండ్రి మరణానికి కారణమైన మాయలేడి ఇంటి వద్ద పెట్రోల్ పోసుకొని మంగళవారం 22-04-2025 తేదీన హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రిలో మరణించాడు. కుమారుడు గడ్డి నరసయ్య, మరియు మనవడు గడ్డి నరేందర్ మరణించడంతో తీవ్ర మనస్థాపానికి గురి అయిన గడ్డి ఎల్లవ్వ గురువారం24 వ తేదీ సాయంకాలం తుది శ్వాస విడిచింది. ఒకే కుటుంబంలో 21 రోజుల వ్యవధిలో ముగ్గురు మరణించగా ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అల్లుకున్నాయి. ఈ వరుస సంఘటనలతో గ్రామస్తులను సైతం కంటతడి పెట్టిస్తున్నాయి. నిరుపేద కుటుంబానికి చెందిన గడ్డి నరసయ్య తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పని చేశాడు. ప్రస్తుతం కుటుంబంలో ముగ్గురు మరణించడంతో వారి దినకర్మలు చేయడానికి కూడా డబ్బులు లేక కుటుంబ సభ్యులు ఆందోళనలో పడిపోయారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆ కుటుంబాన్ని ప్రత్యక్షంగా వచ్చి పరామర్శించి, పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉండాలని, భరోసా కల్పించాలని బొప్పాపూర్ గ్రామస్తులు ఆశిస్తున్నారు.

## అర్హులైన అభ్యర్థులకు రాజీవ్ యువ వికాసం అందేలా చూస్తాం.

## వేములవాడ రూరల్ ఎంపీడీవో శ్రీనివాస్.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ అర్బన్ మరియు రూరల్ మండల పరిషత్ కార్యాలయాలలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం రోజున అర్బన్ మండల పరిషత్ కార్యాలయంలో చీర్లవంచ గ్రామానికి చెందిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎదురు గట్ల, చెక్కపల్లి గ్రామాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ మండల పరిషత్ ఎంపీడీవో కే. శ్రీనివాస్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన వారిని ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలు లేకుండా సమర్థవంతంగా అమలు చేస్తున్న మని తెలిపారు. నిరుపేదలైన అభ్యర్థులను గుర్తించి వారికి రాజీవ్ యువ వికాస్ పథకం అందేలా చూస్తామని తెలిపారు.

## అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలి.

## వేములవాడ నియోజకవర్గ బి ఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ.







**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, కోనరావుపేట, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని ఎగ్లాస్పూర్ గ్రామంలో ఇటీవల వడగండ్ల వానకు తీవ్రంగా పంట నష్టపోయిన రైతన్నలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని వేములవాడ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పంట నష్టపోయిన వేములవాడ రాములు, పసుల జాను, మంగలి కొండయ్య రైతుల పొలాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సింగిల్ విండో చైర్మన్లు బండ నరసయ్య యాదవ్, రామ్మోహన్ రావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కెందే గంగాధర్, వంశీకృష్ణ, గోపు పరుశరాములు, మల్లేశం, నరసయ్య, దేవయ్య, రవి, శివతేజ తదితరులు పాల్గొన్నారు.



పెహల్గావ్ ఉగ్రవాద దాడిలో మరణించిన వారికి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ పక్షాన టీజీ జేఏసీ అధ్యక్షతన అశ్రునివాళి అర్పించి కొవ్వొత్తులు వెలిగించారు. ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండించారు. మరణించిన వారి ఆత్మ శాంతికి రెండు నిమిషాల మౌనం పాటించారు. టీజీఈ చైర్మన్ రవి ప్రకాష్ సెక్రటరీ జనరల్ వినోద్ కుమార్ వివిధ ఉద్యోగ సంఘాల అధ్యక్షులు కలెక్టరేట్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## డీజే లతో బ్యాండ్ కార్మికుల బతుకులు చిద్రం

### -ప్రభుత్వం డిజె లను నిషేధించాలి

### -బ్యాండ్ కళాకారుల సంఘం డిమాండ్




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 25:**సాంకేతికత పెరిగిపోతున్న ఈ కాలంలో శుభకార్యాలైన ఫంక్షన్లో సభలు సమావేశాల్లో డప్పులు మంగళ వాయిద్యాలు బ్యాండ్ బృందాల అవసరం లేకుండా ఈవెంట్ ఆర్గనైజర్లు అతి శక్తివంతమైన డీజేలను ఉపయోగిస్తూ బ్యాండ్ కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని మందమర్రి బ్యాండ్ కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మందమర్రి ప్రెస్ క్లబ్ లో బ్యాండ్ కార్మికులు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శుభకార్యాలకు ఫంక్షన్లకు ఈవెంట్ ఆర్గనైజర్ లను ఆశ్రయించడంతో వారు నిర్వాహకులను ఆకర్షించడానికి పవర్ఫుల్ టూ పిన్ ఫోర్ పిన్ డీజే లను వాడుతూ శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్నారని డీజేలో మ్యూజిక్ మోజులో డాన్సులు చేస్తూ యువకులు ఎందరో గుండెపోటుతో మరణించడం కూడా జరుగుతుందన్నారు. ఈ డీజేల ఉపయోగంతో బ్యాండ్ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఉపాధి లేకపోవడంతో తీసుకువచ్చిన అప్పులను తీర్చలేక కుటుంబాన్ని పోషించలేక మానసికంగా కృంగిపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మందమర్రి ఏరియా బ్యాండ్ కార్మికులమందరం ఒక అసోసియేషన్ గా ఏర్పడినామని మా హక్కులు సాధించడానికి పోరాటం చేస్తామని అన్నారు . డీజే లను ప్రభుత్వ అధికారులు నిషేధించాలని పర్మిషన్ ఇవ్వరాదని మేము అందరం కలిసి అధికారులను ప్రజాప్రతినిధులను మీడియా వారిని వేడుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజికల్ బ్యాండ్ మందమర్రి అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ తాజుద్దీన్ బాబా, కోశాధికారి ఎండి అక్బర్ బాషా, ఎండి సలాం సహాయ కార్యదర్శి వినోద్, సాయి కృష్ణ, చోటు మియా, పడగల అఖిల్, ఎండి సుకూర్, ఎండి అబ్జల్, శశిధర్, దుర్గం శ్రీనివాస్, పాల్గొన్నారు.

# మలేరియా నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలి.

## ఎల్లారెడ్డిపేట పి హెచ్ సి ఆవరణలో మలేరియా దినోత్సవం లో పాల్గొన్న కలెక్టర్.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట, ( ప్రజాబలం),** రాజన్న సిరిసిల్ల జిల్లాలో మలేరియాను సమూలంగా నిర్మూలించే ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా నిర్మూలనపై ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై, అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యాప్తి, వ్యాధి నిర్ధారణ, వైద్య సదుపాయం, వైద్యం అందించే విధానం తదితర అంశాలపై క్లుప్తంగా వివరించారు. జిల్లాలో గత ఏడాది మలేరియా కేసులు నమోదు కాలేదని తెలిపారు. దీనిలో భాగస్వాములైన వైద్యులు, సిబ్బంది, పంచాయితీ రాజ్, మున్సిపల్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. రానున్న రోజులలో కూడా ప్రతి ఒక్కరు సమన్వయంతో పని చేస్తూ ఇవే ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వైద్యులు, సిబ్బంది తమ పరిధిలోని వార్డులు, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దోమతెరలు వాడాలని, దోమలు కుట్టకుండా చూసుకోవాలని తదితర అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. పంచాయతీ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తమ పరిధిలోని ప్రాంతాల్లో మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఎక్కడైనా మురుగునీరు నిలిస్తే బ్లీచింగ్ పౌడర్ వేసి, ఆయిల్ బాల్స్ వేయాలని దోమల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రులలో మలేరియా నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. వైద్యులు, సిబ్బంది మలేరియా లక్షణాలు ఉన్నవారికి నిర్ధారణ పరీక్షలు చేయాలని వారికి సరియైన వైద్యం అందించాలని సూచించారు. ప్రజలు కూడా తమ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. దీంతో వ్యాధుల వ్యాప్తి తగ్గుతుందని స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది తమ ఇల్లు, పరిసరాలు ఎంత శుభ్రంగా ఉంచుకుంటారో, ప్రజలు కూడా అలాగే తమ ఇల్లు పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిత, ప్రోగ్రాం ఆఫీసర్ అనిత, మెడికల్ ఆఫీసర్ ప్రదీప్, పీహెచ్సీ డాక్టర్ సయ్యద్ సాయిరా అంజు మ్, డాక్టర్లు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు బొల్లారం గ్రామస్తులచే పట్టాభిషేకం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్, కుమారుడు మహమ్మద్ షారుక్ తెలంగాణ రాష్ట్రంలో మొన్న వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచాడు. వేములవాడ మైనార్టీ గురుకుల కళాశాలలో ఒకేషనల్ కోర్సులో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 969/1000 మార్కులతో కాలేజీలో మొదటి ర్యాంకు సాధించినందుకు బొల్లారం గ్రామ మాజీ వార్డు సభ్యులు మురుగం శ్రీలత - అనిల్ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈరువాల మల్లేశం, పరశురాములు, మహమ్మద్ యూసుఫ్, అశోక్, ప్రవీణ్, గోవర్ధన్, మహేందర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్ల పంపిణీ అభినందనీయం..

## మాధవరం కృష్ణా రావు



**కూకట్పల్లి (ప్రజబలం)ఏప్రిల్ 25:** పేద ప్రజలకు అండగా ఉంటూ పేద కుటుంబాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచితంగా కుట్టు శిక్షణ కార్యక్రమం చేపట్టడంతో పాటు శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్ లను అందించడం అభినందనీయమని కూకట్పల్లి ఎం ఎల్ ఏ మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఉదయం కేపీ హెచ్బి కాలనీ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆలయ చైర్మెన్ చెరుకు కుమారస్వామి ఆధ్వర్యంలో సెల్ వెల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుబ్బారావు సహకారంతో నిర్వహించిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి మహిళలు కుట్టు శిక్షణ కార్యక్రమంలో కుట్టిన పలు వస్త్రాలను, నూతన డిజైన్ డ్రెస్ లను పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, మిషన్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుమారస్వామి ,సుబ్బారావు అందిస్తున్న సేవలను అభినందించారు.రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని,మిషన్ల పంపిణీ కార్యక్రమానికి తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు ఆరువేల మందికి కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నామని, నేర్చుకున్న వారికి ఉచితంగా మిషన్లను కూడా అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని మహిళలందరికి ఉపయోగపడేలా సుమారు నాలుగువేల గజాల స్థలాన్ని కూడా ఎంపిక చేసి కేటాయింపుకు కలెక్టర్ కు లేక రాయడం జరిగిందన్నారు. స్థలం కేటాయింపు జరిగితే మహిళకు మంచి భవనం నిర్మించి అందులోనే మహిళా బ్యాంక్ కూడా ఏర్పాటు చేసి పలు ఉపాధి శిక్షణ కార్యక్రమాలను అందించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయడం జరిగిందన్నారు.దురదృష్ట వశాత్తు బీ ఆర్ ఎస్ ప్రభుత్వం రాలేదని, ఇప్పుడున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తప్పకుండా స్థలాన్ని కేటాయించి మహిళలకు భవనం నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు బొడ్ల గోపాల కృష్ణ, కృష్ణమూర్తి, స్థానిక నాయకుడు కచిన్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళ హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు

**–మందమర్రిలో ఈనెల 28,29,30 న నిర్వహణ**

**–హ్యాండ్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కనపర్తి రమేష్**



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 25:**రాష్ట్రస్థాయి 54 వ సీనియర్ మహిళల హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలను ఈనెల 28, 29, 30 తేదీలలో మందమర్రి పట్టణంలో గల సింగరేణి హై స్కూల్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కనపర్తి రమేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కనపర్తి రమేష్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ సౌజన్యంతో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 20 మంది క్రీడాకారుల చొప్పున 200 మంది పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరపున 20 మంది సీనియర్ మహిళా క్రీడాకారులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ ఛాంపియన్ షిప్ పోటీలకు సింగరేణి సంస్థ అవసరమైన ఏర్పాట్లు చేస్తుందని అందుకు సంస్థ యాజమాన్యానికి మేనేజర్ దేవేందర్ కు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ క్రీడలను జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గోనే శ్యాంసుందర్రావు, అసోసియేషన్ చైర్మన్ సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ రావుల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలు గుజరాత్ లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ప్రాతినిథ్యం వహిస్తారని అన్నారు. ఈసమావేశంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ కోశాధికారి అలుగువెల్లి రమేష్ రెడ్డి, కోచ్ సొనార్కర్ అరవింద్, ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు కాంపల్లి సమ్మయ్య, ఆర్గనైజింగ్ నెంబర్ కర్ర మహేందర్ రెడ్డి, ఎగ్గేటి రాజేశ్వర్, రాజమౌళి లు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులను ఉరితీయాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 25**మందమర్రి మార్కెట్ మజీదే అసరా మసీదు లో శుక్రవారం నమాజ్ అనంతరం కాశ్మీర్లో ఫైల్గాంలో జరిగినటువంటి దమన కాండని నిరసిస్తూ ఉగ్రవాదులను పట్టుకొని శిక్షించాలని కోరుతూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ పిలుపుమేరకు ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో ముస్లింలు కలసి నల్ల బ్యాడ్జీలు ధరించి కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునావృతం కావద్దని ముక్తకంఠంతో ఖండించారు. అనంతరం మృతులకు నివాళులు అర్పించారు. మసీద్ ఇమామ్ అజామ్ అలీ, మసీద్ ప్రెసిడెంట్ గులాం మూహిద్దీన్, నిజాం అజారుద్దీన్ జుబేర్, కలీం, సుల్తాన్ మజార్, సలావుద్దీన్, షఫీ చాంద్ పాషా, సమీర్, తాజ్, హఫీజ్, కబీరుద్దీన్ ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లలో బేస్మెంట్ పూర్తి చేసినవారికి ఒక లక్ష రూపాయల చెక్కుల పంపిణీ




**సంగారెడ్డి జిల్లా/జహీరాబాద్** నియోజకవర్గంలో ఝరాసంఘం, న్యాల్కల్ మండల కేంద్రాల్లో భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి,అదనపు కలెక్టర్ మాధురి పాల్గొని ఇందిరమ్మ ఇండ్లలో బేస్మెంట్ పూర్తి చేసినా లబ్ది దారులకు ఒక లక్ష రూపాయల చెక్కుల పంపిణీ చేశారు.,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇక ఇంటి నిర్మాణం పనులు వేగంగా చేసుకోవాలన్నారు,ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు,తదితరులు పాల్గొన్నారు.

## చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



**అందోల్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 25(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/మునిపల్లి: వ్యవసాయ పొలం లోని మేడి చెట్టుకు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం నాడు బుదేరా గ్రామ శివారులో చోటు చేసుకుంది,వివరాలలోకి వెళితే, మునిపల్లి మండల పరిధిలోని బుదేరా గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి ఉరివేసుకొని చెట్టుకు వేలడుతూ గుర్తు పట్టలేని స్థితిలో ఉన్న వ్యక్తిని చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు ఘటనా స్థలానికి చేరుకున్న మునిపల్లి ఎస్సై ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఫోటోలు సోషల్ మీడియాలో పెట్టగా బుదేరా గ్రామానికి చెందిన కోలుకుందా శ్రీనివాస్(40) గా తెలిసింది, ఈ విషయాన్ని బుదేరా గ్రామంలోని కోలుకుందా శ్రీనివాస్ కోలుకుందా స్వప్నకు తెలియజేయగా 23.04.2025 నాడు ఉదయం ఇంట్లో నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తెలిపినది.మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సింగరేణి లో నూతన బొగ్గు గనులను ప్రారంభించాలి

**మందమర్రి మున్సిపల్ ఎన్నికలను నిర్వహించాలి**

**–ఆర్.పి.ఐ రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్**



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 25:**సింగరేణి ప్రాంతంలో నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేసి ఇక్కడి యువతకు ఉపాధి కల్పించాలని రిపబ్లిక్ అని పార్టీ ఆఫ్ ఇండియా (ఆధవాలే) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్ అన్నారు. మందమరి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర మహిళ విభాగం అధ్యక్షురాలు సరిగోమ్ముల స్నేహలత, రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగపిండి రమేష్ లతో కలిసి మాట్లాడారు. ముందుగా జమ్మూ కాశ్మీర్ పహల్గామాలో ఉగ్రదాడులో ఊచకోతకు 26 మంది బలైన అమరుల మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ మందమర్రి మున్సిపల్ కు ఎన్నికలు నిర్వహించాలని అలాగే సింగరేణి ప్రాంతంలో భూగర్భ గనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం స్వరాజ్యం ఏర్పడితే మందమర్రికి మునిసిపల్ ఎన్నికలు జరిపిస్తామని హామీలు ఇచ్చి అధికారం రాగానే హామీలను తుంగలో తొక్కారాన్నారు. అలాగే సింగరేణి ప్రాంతంలో ఓపెన్ కాస్టు కాకుండా అన్ని భూగర్భ ఘనులు తీసుకువస్తామని టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో ఊక దంపుడు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకపోవడంలో గత ఎన్నికల్లో ఓటమిపాలైందని గుర్తు చేశారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఆరు గ్యారంటీలను మేనిఫెస్టోను పెట్టి అందులో ఏ ఒక్కటి నెరవేర్చలేక పోయిందన్నారు. ఈసమావేశంలో పులిపాక శ్రీనివాస్ జిల్లా ఇన్చార్జి, గుడికందుల తిరుపతి జిల్లా అధ్యక్షులు, రహమత్ ఖాన్ ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షులు, ధరంపురి శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షులు, గరిగే వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి
లక్కాకుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి
మామిడిపల్లి ప్రకాష్, జిల్లా కార్యదర్శి
భారత తిరుపతి, జిల్లా నాయకులు
కన్నూరు కృష్ణ,
తాజుద్దీన్, శంకర్,
శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## కె.కె ఓసిపి లో 40 టన్నుల క్రేన్ ప్రారంభం

## –ప్రారంభించిన జనరల్ మేనేజర్ జి.దేవేందర్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 25:**మందమర్రి ఏరియాలోని కళ్యాణి ఖని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో 40 టన్నుల క్రేన్ను జనరల్ మేనేజర్ జి. దేవేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రేన్ ప్రారంభంతో కే.కే ఓ.సి ప్రాజెక్టు పనులు మరింత వేగంగా, సమర్థవంతంగా సాగే అవకాశం ఉందని అన్నారు. ఈ సందర్భంగా సాంప్రదాయ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎన్ వంశీధర్, ఇంచార్జ్ మేనేజర్ శ్రీధర్ గౌడ్, పిట్ సెక్రటరీ మర్రి కుమారస్వామి, మందమర్రి సీ.ఏం. ఓ.ఏ.ఐ ప్రెసిడెంట్ రమేష్, ఏ.ఐ. టి.యూ.సీ ఇంచార్జ్ అంజనేయులు ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కొరకు వేసవి విజ్ఞాన శిబిరం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 :** విద్యార్థుల కొరకు వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సైన్స్ వేసవి శిబిరం-2025ను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య,జిల్లా సైన్స్ అధికారి మధుబాబు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...నిత్య జీవితంలో సైన్స్ ఎంతగా ఉపయోగపడుతుందో విద్యార్థులు నిశితంగా గమనించాలని,వాటి వెనుక ఉన్న సూత్రాలను అర్థం చేసుకోవాలని తెలిపారు.చాలా మంది సైన్స్ సూత్రాలను తెలియకుండా వినియోగిస్తున్నారని,సైన్స్ లోని సూత్రాలను తెలుసుకునేందుకు వేసవి శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.పాఠ్య పుస్తకాలలో పాఠ్యాంశాల వారిగా నేర్చుకుంటారని, కానీ ఇక్కడ ఆలోచనలోకి వచ్చే ప్రతి సమస్యను పరిష్కారం తెలుస్తుందని, ప్రతి విద్యార్థి ఆలోచన శక్తిని పెంపొందించుకునేలా ఈ శిబిరం విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు.వేసవి ఉష్ణోగ్రత పెరుగుతున్న దృష్ట్యా శిబిరానికి వచ్చే విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.ఇప్పటి వరకు 186 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిలో 120 మందికి అవకాశం కల్పించడం జరిగిందని,విద్యార్థులను ఆలోచింపజేసేలా ప్రయోగాలతో విషయ పరిజ్ఞానాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారులు చౌదరి శ్రీనివాస్,సత్యనారాయణ మూర్తి,జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి మహేశ్వర్రెడ్డి,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com